సామాజిక, రాజకీయ పక్షపత్రిక

10 సెప్టెంబర్ 2017
పేజీలు : 36
వెల : 10/-

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల




## విమోచన యాత్ర దిగ్విజయం

## భయాందోళనలో TRS

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:27 | సంచిక:20 | 10 సెప్టెంబర్ 2017


ఈ సంచికలో...


- నల్లధనాన్ని సంస్కరించి ఆర్థిక వ్యవస్థలో కలుపుకోవడం మేలు! ... 03
- 2019లోనూ బిజెపిదే అధికారం ... 04
- మోదీనే అత్యుత్తమ ప్రధాని ... 06
- విమోచన యాత్ర దిగ్విజయం భయాందోళనలో టీఆర్ఎస్ ... 07
- సెప్టెంబర్ 17 విమోచనమే ... 13
- జనధన్ యోజన: త్రిముఖ విప్లవం ... 15
- ఎన్డీఏ విధానానికి సరిపోలే తీర్పు ... 16
- మోదీ క్యాబినెట్‌లో కొత్త ముఖాలు ... 17
- పరిశుభ్రతకు ప్రతీకలుగా పండుగలు జరుపుకొందాం! ... 18
- ప్రపంచానికి మనమేమీ తోడ్పడలేమా! ... 20
- బహు లక్షణ సమన్వితుడు ... 21
- గాంధీ ఆధ్యాత్మిక వారసుడు వినోబా ... 23
- శ్రామికులకు ఊరటనిచ్చే సంస్కరణలు ... 24
- మహా ఆర్థికశక్తిగా ఎదుగుతున్న భారత్ ... 25
- సఫల దౌత్యనీతికి నిదర్శనం డోక్లామ్ విజయం ... 26
- మిషన్ భగీరథ: స్కీం కాదు... భారీ స్కాం ... 27
- కేసీఆర్‌లో కంగారు షురూ ... 28
- రణరంగంగా ప్రజాభిప్రాయ సేకరణ ... 29
- సొంత బలం పెంచుకోవడంపైనే బిజెపి దృష్టి ... 30
- బ్రిక్స్ సదస్సులో మోదీ దౌత్య విజయం ... 31
- ఓబీసీ ఉపవర్గీకరణ విప్లవాత్మక నిర్ణయం ... 32
- పట్టాలెక్కిన నదుల అనుసంధానం ... 33



మీ వార్తలు, సంబంధిత ఫోటోలు (ఫోటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా) మెయిల్‌ద్వారా కూడా జనసందేశ్‌కు క్షణాల్లో పంపించవచ్చు. మీరు పంపవలసిన చిరునామా (ఈ-మెయిల్): janasandesh@yahoo.co.in
janasandeshmag@gmail.com
Phone No :040 24650866

Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU**
on behalf of Bharateeya Janata Party and
Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads, Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan,
Opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.


## సంపాదకీయం

# నల్లధనాన్ని సంస్కరించి ఆర్థిక వ్యవస్థలో కలుపుకోవడం మేలు!

ఇంట్లో వాళ్ళు నిద్రపోయే రాత్రివేళల్లోనో, అప్రమత్తంగా ఉన్న సమయంలోనో వెలికి వచ్చి గృహస్తులకు నష్టం కలిగించే పనులకు పాల్పడి గుట్టుచప్పుడు కాకుండా పోవడం కలుగులో దాగిన ఎలుకల నైజం. దేశ ఆర్థిక వ్యవస్థకు హాని కలిగించే నల్ల ధనం కూడా కలుగులో దాగే ఎలుకలాంటిదే. పిల్లుల పెంపకంతో పాటు కలుగుల్లో పొగపెట్టడం కూడా గృహస్తులు చేపట్టే ఎలుకల బెడద నివారణ చర్యల్లో ఒకటి.

గత నవంబరులో దేశప్రధాని మోదీ పెద్దనోట్ల రద్దుతో కలుగులో దాగిన నల్లధనం లాంటి ఎలుకలకు పొగపెట్టారు. ఎలుకలకు పెట్టిన పొగ వల్ల కళ్ళు, ముక్కులు మండి నీరు కారటం, తుమ్ములు రావటం లాంటివి గృహస్థులను తాత్కాలికంగా కొంత బాధ పెట్టినట్లు మోదీ పెట్టిన పొగతో సామాన్యులైన దేశప్రజలు కూడా కొంత ఇబ్బంది పడ్డారు. అయితేనేం! ఈ ఆగష్టు 30న, రిజర్వు బ్యాంకు సమర్పించిన వార్షిక నివేదికలోని గణాంకాలను విశ్లేషిస్తే ప్రధాని వ్యూహం ఫలించిందని తెలుస్తున్నది.

రిజర్వు బ్యాంకు ముద్రించి చెలామణిలోకి పంపిన పెద్దనోట్లలో 99 శాతం దాకా తిరిగి బ్యాంకులకు వచ్చాయి. దాంతో నకిలీ, దొంగనోట్ల బెడద వొదిలించాలనే లక్ష్యం పూర్తిగా నెరవేరింది. చాటుమాటు లావాదేవీలు నడపడానికి బ్యాంకుల బయట నగదు లేక ఉగ్రవాదుల, వామపక్ష తీవ్రవాదుల ఆర్థిక మూలాలను దెబ్బతీయాలనే మరో లక్ష్యం నెరవేరింది. రెండు లక్షలు, ఆ పైన జరిగే నగదు చెల్లింపులపై ఆంక్షలు విధించడంతో అక్రమ లావాదేవీలు తెరమరుగై ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత పెరగాలనే మరో లక్ష్యం నెరవేరింది. పన్ను చెల్లింపుదార్ల సంఖ్యలోను, చెల్లించిన పన్ను మొత్తంలోను కనిపిస్తున్న పెరుగుదల నల్లధనం తరిగి పోతున్నదని సాక్ష్యం పలుకుతున్నది.

పెద్దనోట్ల రద్దుతో 'నల్లధనం నాశనమైందా, కాలిబూడిదైందా!' అంటూ, రద్దు ఫలితాలపై విమర్శలు ఎక్కుపెడుతున్న కాంగ్రెస్ తదితర విపక్షాల వైఖరి వారి కపటత్వాన్ని వెల్లడిస్తున్నది.

మోటారు వాహనాలకు నెంబర్లు, యజమానుల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నందున మోటారు వాహనంతో ముడిపడిన నేరం జరిగినప్పుడు కారకులను పట్టి దండించడానికి వీలుంది. చెలామణిలో ఉన్న కరెన్సీ నోట్లకూ నెంబర్లు ఉన్నా వాటి యజమానుల వివరాల నిర్వహణ సాధ్యం కాదు. అందువల్ల బ్యాంకుల్లో ఉన్నది, లెక్కల్లో చూపి, ఆదాయపు పన్ను శాఖకు తెలిపిన సొమ్ముకు మాత్రమే యాజమాన్యపు వివరాలు తెలుస్తాయి. మిగిలిన సొమ్ములో ఇనప్పెట్టెల్లో, నేలమాళిగల్లో దాగిన నగదు ఎంత, దాని యజమానులెవరు, అది నల్లదా, తెల్లదా చెప్పడం అది బయటికి వచ్చే దాకా సాధ్యం కాదు.

యజమానులెవరో ప్రభుత్వానికి తెలియకుండా చెలామణిలోకి వచ్చే డబ్బే కలుగులో దాగిన ఎలుక లాంటిది. అది గుట్టు చప్పుడు కాకుండా ఆర్థిక వ్యవస్థను చీకాకు పరచి పోతుంటుంది. మోది పెట్టిన పొగతో కలుగులో దాగిన ఎలుకలన్నీ బయటకు వచ్చాయి.

ఇప్పుడు చలామణిలో ఉన్న 99శాతం నగదులో ఎంతెంత నగదుకు ఎవరెవరు యజమానులో బ్యాంకుల్లో నమోదైంది. బ్యాంకుల్లో రెండు లక్షలు ఆ పైన జమచేసిన వారిని విచారిస్తే అది నల్లదో తెల్లదో తేల్తుంది. విధ్వంసం, వినాశనం భారతీయత కాదు. నల్లధనం నాశనమై పోవాలని, కాలిబూడిదై పోవాలని మోదీ ఆశించారంటే నమ్మలేం. నేరస్తులను శిక్షలతో సంస్కరించి జనజీవనంలో కలుపుకున్నట్లు నల్లధనాన్ని సైతం పన్నులు, జరిమానాలతో సంస్కరించి ఆర్థిక వ్యవస్థలో కలుపుకోవడం మేలు!

వర్తమానం



# 2019లోనూ బిజెపిదే అధికారం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సొంతబలంతో మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తామని జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ స్పష్టం చేశారు. తెలంగాణలోని ఎంపీ స్థానాలన్నింటిలో విజయం సాధిస్తామని ధీమాగా చెప్పారు. బిజెపి హైదరాబాద్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు అధ్యక్షతన ఆగస్టు 26న సికింద్రాబాద్‌లో నిర్వహించిన నవభారత సంకల్ప సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2019లో తెలంగాణలోనూ అధికసంఖ్యలో బిజెపి అసెంబ్లీ సీట్లు సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఇక కేంద్రంలో బిజెపిది సునాయాస విజయమని, ఈ విషయాన్ని ప్రతిపక్షాలే చెబుతున్నాయని ఆయన తెలిపారు. ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఈ విషయం మరింత బాగా తెలుసునన్నారు. 2019 ఎన్నికల్లో ముగ్గురు నేతల సహకారంతో బిజెపి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని, ఆ ముగ్గురిలో ఒకరు ప్రధాని మోదీ, మరొకరు బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కాగా, ఇంకొకరు ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ అని చమత్కరించారు. 2019 నాటికి దేశాన్ని పేదరికం, కుల, మత, ఉగ్రవాద, అవినీతి రహిత నవభారతాన్ని నిర్మించాలని బిజెపి సంకల్పించిందన్నారు. కశ్మీర్‌లో చివరి ఉగ్రవాదిని అంతం చేసే వరకు మోదీ ప్రభుత్వం విశ్రమించదన్నారు. రాజకీయాలు చారిటీకోసం కాదన్న మాటకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఒక్క బిజెపితోనే నవ భారత్ నిర్మాణం సాధ్యం కాదని, ఈ మహాయజ్ఞంలో తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీ తదితర అన్ని రాష్ట్రాల సీఎంలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధికి సీఎం కేసీఆర్ మరింత బాధ్యతా యుతంగా పనిచేయాల్సి ఉందని రాంమాధవ్ అన్నారు.

సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ హైదరాబాద్ ఇప్పటికీ ఉగ్రవాదానికి కేంద్ర బిందువుగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దాన్నుంచి నగరాన్ని విముక్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. నిజాంను ఎదురించి పోరాడిన యోధులకు, అమరులకు రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపునివ్వటం లేదని ఆరోపించారు. మజ్లిస్‌తో అంటకాగుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వం.. సెప్టెంబర్17న తెలంగాణ విమోచనదినాన్ని అధికారికంగా నిర్వహించకుండా ప్రజల మనోభావాలను దెబ్బతీస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతల రాంచంద్రా రెడ్డి, రాజాసింగ్, బిజెపి రాష్ట్రనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు, శ్రేణులు నవభారత నిర్మాణానికి సంకల్పం తీసుకున్నారు.

**-జనసందేశ్ ప్రతినిధి**



## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి

బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆగస్టు 25న వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా వినాయక చవితి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, ఎంపీ బండారు దత్తాత్రేయ, బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డితో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడి కృపతో అందరికీ సుఖసంతోషాలు ప్రాప్తించాలని బిజెపి నేతలు అభిలషించారు.

# తుక్కుగూడలో రైతు పంచాయితీ



బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు ఆధ్వర్యంలో కూరగాయల రైతు సమస్యలపై రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఆగస్టు 28న బిజెపి రైతు పంచాయతీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మురళీధర్ రావు టీఆర్ఎస్ అనుసరిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. రైతులకు మేలు చేసే మోదీ ప్రభుత్వం పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను మురళీధర్ రావు దృష్టికి తీసుకొచ్చారు. రైతులను అన్నివిధాల ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

# ఉత్సాహంగా మీట్ అండ్ గ్రీట్



ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బిజెపి ఆధ్వర్యంలో అమెరికాలో 'మీట్ అండ్ గ్రీట్' ఉత్సాహంగా సాగింది. ఆగస్టు 13 నుంచి ఆగస్టు 26 వరకు ఎనుగు రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో అమెరికాలోని వివిధ నగరాల్లో జరిగిన కార్యక్రమాల్లో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల కోసం, వ్యవసాయాభివృద్ధి కోసం తీసుకొచ్చిన పథకాలు, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 2022 నాటికి దేశంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా ఫసల్ బీమా యోజన, భూసార పరీక్షా కార్డులు, ఈ-నామ్, ప్రధానమంత్రి కృషి సించాయి యోజన, సమృద్ధిగా ఎరువుల లభ్యత, అందుబాటులో 24 గంటల విద్యుత్తు తదితర కార్యక్రమాలు ఏవిధంగా ఉపయోగపడుతాయో తెలిపారు. న్యూజెర్సీ, అట్లాంటా, శాన్‌ఫ్రాన్సిస్కో, పెన్సిల్వేనియా నగరాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బిజెపి నేతలు చాట్ల నందా, పులిజాల హరి, విలాస్ రెడ్డి, శ్రీకాంత్, కొంపల్లి శ్రీను, గోలి భరత్, చందు బమ్మెర, ఆనంద్ కూచిబొట్ల, కృష్ణ రామినేని తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి కార్మికుల్లో ఆనందోత్సహాలు

రాష్ట్ర బిజెపి నేతల కృషి ఫలించి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగడంతో సింగరేణి కార్మికుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఇటీవలి ఢిల్లీ పర్యటనలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ నేతృత్వంలో ప్రతినిధి బృందం కేంద్ర ఇంధన వనరుల శాఖ మంత్రి పీయుష్ గోయల్‌ను కలిసి కాంట్రాక్ట్ కార్మికుల కష్టాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు కనీస వేతనాలు వర్తించేలా నిర్ణయం తీసుకుంది. దీంతో సింగరేణిలో వివిధ కేటగిరీలో పనిచేస్తున్న ఉద్యోగులకు గణనీయంగా వేతనాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో కోల్‌బెల్ట్ జిల్లాలకు చెందిన సింగరేణి కార్మికులు, బిజెపి నాయకులు ఆగస్టు 20న రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ బండారు దత్తాత్రేయ, డా॥ కె.లక్ష్మన్‌ను సన్మానించి ఆనందాన్ని పంచుకున్నారు.

# తలాఖ్‌పై హర్షం



రాజ్యాంగ విరుద్ధమైన ముమ్మారు తలాఖ్‌ను నిషేధిస్తూ సుప్రీం కోర్టు తీర్పుపై ముస్లిం మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మోదీ చొరవతోనే ముస్లిం మహిళలు సాంఘీక దురాచారం తలాఖ్ బారి నుంచి బయటపడ్డారని అన్నారు. మహిళలు పట్ల, ముఖ్యంగా ముస్లిం మహిళల పట్ల అణచివేత, వివక్షను ప్రధాని రూపుమాపుతున్నారని కొనియాడారు. ఈ తీర్పు నేపథ్యంలో ప్రధాని మోదీ కటౌట్‌కు మిఠాయి తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఆగస్టు 23న బిజెపి రాష్ట్ర కార్యాలయంలోనూ ముస్లిం మహిళలు మోదీ మాస్క్‌ను ధరించి, బిజెపి తెలంగాణ అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. పెద్ద సంఖ్యలో ముస్లిం మహిళలు లక్ష్మన్ సమక్షంలో బిజెపిలో చేరారు. ప్రధాని మోదీ, బిజెపి దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా వారన్నారు.

# మోదీనే అత్యుత్తమ ప్రధాని



స్వతంత్ర భారత చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ప్రధానిగా నరేంద్ర మోదీకి భారతీయులు పట్టంగట్టారు. ఇండియా టుడే – కార్వీ ఇన్‌సైట్స్ సంయుక్తంగా నిర్వహించిన మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే ఈ విషయాన్ని వెల్లడించింది. పెద్దనోట్ల రద్దుతో ప్రజలు ఇబ్బందులు పడ్డా.. నల్లధనంపై మోదీ ప్రయోగించిన అస్త్రంగా ప్రజలు భావించారని పేర్కొంది. ఇప్పటికిప్పుడు దేశంలో ఎన్నికలు వస్తే ఎన్డీయేకు 349 సీట్లు వస్తాయని వెల్లడించింది.

సర్వేలో పాల్గొన్న వారిలో ప్రథమ ప్రధాని నెహ్రూ, ఇందిరా గాంధీ కన్నా మోదీపైనే ఎక్కువ మంది సానుకూలత వ్యక్తం చేశారు. ఐదు సార్లు దేశవ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించారు. తాజా ఫలితాల్లో 33శాతంతో మోదీ ముందంజలో ఉన్నారు. ఇందిరా గాంధీ 17శాతంతో రెండో స్థానంలో, వాజ్‌పేయి 9శాతం, నెహ్రూ 8శాతంతో మూడు నాలుగు స్థానాల్లో నిలిచారు. దేశంలో పన్నుల సంస్కరణలు తీసుకొచ్చి జీఎస్టీని అమల్లోకి తేవటం ద్వారా లంచం, పన్ను ఎగవేతలకు మోదీ చెక్ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలు జరిగితే 349 సీట్లు ఎన్డీయే ఖాతాలో చేరతాయన్న సర్వే.. ఇదే జోరు కొనసాగితే 2019లోనూ అధికారాన్ని నిలుపుకుంటుందని పేర్కొంది. బిహార్ సీఎం నితీశ్ కుమార్ మహాకూటమి నుంచి బయటకు రాకముందే ఈ సర్వే జరిగింది. అయితే.. తర్వాత పరిణామాలతో ఎన్డీయేకు 400 సీట్ల రావొచ్చని సర్వే అభిప్రాయపడింది. తాజా సర్వే వివరాల ప్రకారం యూపీఏకు 75, ఇతర విపక్షాలకు 119 సీట్లు వస్తున్నాయి. మోదీ పాపులారిటీతో బిజెపి 298 స్థానాల్లో విజయం సాధిస్తుందని సర్వే వెల్లడించింది. పశ్చిమ, ఉత్తర భారత్‌లలోనే బిజెపి 249 సీట్లు పొందనుండగా.. తూర్పు, దక్షిణ భారత్‌లో 107 (286 స్థానాలకు గానూ) స్థానాలు దక్కనున్నాయి.

అవినీతి రహిత పాలనే నరేంద్ర మోదీ ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయంగా అత్యధికులు అభిప్రాయపడ్డారు. స్వచ్ఛ భారత్, పాకిస్థాన్‌పై సర్జికల్ దాడులు, మౌలికవసతుల కల్పన, పేదలు, రైతుల అనుకూల పథకాలు కూడా మోదీపై ప్రజాభిమానానికి కారణాలుగా సర్వే వెల్లడించింది. అందుకే దేశవ్యాప్తంగా 63 శాతం మంది ప్రధానిగా మోదీకే పట్టంగట్టగా.. కేవలం 12 శాతం మంది మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశారు.

–జనసందేశ్ ప్రతినిధి



సెప్టెంబర్ 17ను అధికారిక తెలంగాణ విమోచన దినంగా ప్రకటించాలని కోరుతూ ఆగస్టు 21న బిజెపి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు యాప సీతయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి బి.బి.రాఘవులు ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.



సెప్టెంబర్ 17ను అధికారిక తెలంగాణ విమోచన దినంగా ప్రకటించాలని కోరుతూ ఆగస్టు 24న బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాంచరణ్ యాదవ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ బీజేవైఎం ఆధ్వర్యంలో మొగిలిపాలెం గ్రామంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేతిరెడ్డి అంజి రెడ్డి, ఏర్రోజు లక్ష్మన్, చింతం శ్రీనివాస్, తొర్తి సంతోష్, వెంకట్ రెడ్డి, కోనేటి అనిల్, మార్క హరిష కుమార్, శ్రీకాంత్ రెడ్డి, వరుకోలు శ్రీనివాస్, సంగెం ప్రశాంత్, మర్రి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆగస్టు 27న బిజెపి రాష్ట్ర కార్యాలయంలో 'నైజాం సర్కరోడా' సినిమా యూనిట్‌ను బిజెపి సినిమా సెల్ సత్కరించింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్, బిజెపి హైదరాబాద్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. – దీన్‌దయాళ్జీ



ముఖచిత్ర కథనం

# విమోచన యాత్ర దిగ్విజయం భయాందోళనలో TRS

• భువన



ఒకటే యాత్ర... 7 రోజులు.. 18 జిల్లాలు.. 1600కు పైగా కిలోమీటర్లు... నిరంకుశ నిజాం రాజు నిర్బంధాలను ఎదురించిన పోరాటాలకు నెలవైన ప్రాంతాలు.. రజాకార్ల అకృత్యాలకు సాక్ష్యంగా నిలిచిన గ్రామాలు.. సమర యోధులను అందించిన ఊర్లను సందర్శిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ చేపట్టిన తెలంగాణ విమోచన యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలన్న డిమాండ్‌తో సాగిన ఈ యాత్రకు ప్రతి ఊరూ సాదర స్వాగతం పలికింది.

తెలంగాణ సెంటిమెంట్‌తో పబ్బం గడుపుకుంటూ.. మజ్లిస్ కోసం ప్రజల ఆకాంక్షలను తాకట్టు పెడుతూ.. ఇచ్చిన హామీలను అమలు చేయక అరచేతిలో వైకుంఠం చూపిస్తోన్న టీఆర్ఎస్ అసలు స్వరూపాన్ని ప్రజలు గుర్తించడంతో వారిలో భయందోళనలు నెలకొన్నాయి. యావత్ తెలంగాణ ప్రజలు సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలన్న డిమాండ్‌ను ఎలుగెత్తి చాటారు. ఇందుకు బిజెపి చేస్తున్న పోరాటానికి మనస్ఫూర్తిగా మద్దతు తెలిపారు. ఎండనకా.. వాననకా.. సభలకు తరలివచ్చిన ప్రజలు లక్ష్మన్ ప్రసంగాలతో స్ఫూర్తి పొందారు. ప్రాంతాల వ్యత్యాసం లేకుండా.. కులమతాలకు అతీతంగా.. మహిళలు, వృద్ధులు, కార్మికులు, కర్షకులు అన్న తేడా లేకుండా డా॥ కె.లక్ష్మన్ తెలంగాణ విమోచన యాత్రకు జననీరాజనం పలికారు.








### సెప్టెంబర్ 1, తొలిరోజు

సెప్టెంబర్ 17పై కపట నాటకమాడుతున్న టీఆర్‌ఎస్‌ను ప్రజల మందు నిలబెట్టి... అధికారిక తెలంగాణ విమోచన దినోత్సవం సాధించేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ చేపట్టిన తెలంగాణ విమోచన యాత్ర ఘనంగా ఆరంభమైంది. ఉదయం బషీర్‌బాగ్ కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డా॥ కె.లక్ష్మణ్... అమ్మవారి ఆశీర్వాదం తీసుకొని ఏడు రోజుల విమోచన యాత్రకు బయలుదేరారు. అటు నుంచి ప్రారంభ సమావేశం కోసం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపం చేరుకున్నారు. తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన బోనాలు, బతుకమ్మలతో బిజెపి కార్యకర్తలు లక్ష్మణ్ బృందానికి అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం గన్‌పార్క్ తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అటు అసెంబ్లీ ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి వందనం సమర్పించారు. బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి, శాసనమండలి పక్షనేత ఎన్.రాంచందర్ రావు, ఎమ్మెల్యేలు చింతల రాంచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, రాజాసింగ్‌తో పాటు పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకురమ్మంటూ సాగనంపారు. భువనగిరి దిశగా బయలు దేరగా... అభిమానులు, మద్దతుదారులు, బిజెపి కార్యకర్తలు, తెలంగాణవాదులు డా॥ లక్ష్మణ్‌కు అడుగడుగునా స్వాగతం పలికారు. ముషీరాబాద్, విద్యానగర్, అంబర్‌పేట్, ఉప్పల్, ఘట్‌కేసర్, అన్నోజిగూడలో బిజెపి కార్యకర్తలు లక్ష్మణ్ యాత్రకు మద్దతుగా ర్యాలీలు తీశారు. భువనగిరిలో రాత్రి బస చేశారు.

> **"ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ విమోచన యాత్రకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది, అన్ని వర్గాల ప్రజలు యాత్రకు మద్దతు తెలిపారు."**

### సెప్టెంబర్ 2, రెండో రోజు

రెండో రోజు భువనగిరి నుంచి ఉత్సాహంగా ప్రారంభమైన ఈ యాత్రకు మద్దతుగా వందల మంది యువమోర్చా కార్యకర్తలు బైక్

# నేటికీ మార్గదర్శకంగా పరకాల

తెలంగాణ విమోచన పోరాటంలో ముఖ్యభూమికను పోషించిన పరకాల ప్రజల త్యాగాలు, పోరాట పటిమ నేటికీ మార్గదర్శకంగా నిలుస్తాయి. రజాకార్లు నెత్తురు పారించిన ఈ గడ్డ వందల మంది వీరమరణం పొందిన మరో జలియన్‌వాలాబాగ్‌గా చరిత్రలో నిలిచిపోయింది. పరకాల ప్రాంతానికి చెందిన ఎంతో మంది పోరాట యోధులు నిజాం వ్యతిరేక పోరాటంలో తమ సర్వస్వాన్ని కోల్పోయారు. ఆగస్టు 7, 1947లో పరకాల మండలం నర్సక్కపల్లి గ్రామంలో ఎస్.చందర్‌రావు ఆధ్వర్యంలో సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. అదే స్ఫూర్తితో నాగారం గ్రామానికి చెందిన వీరగోపాల్‌రావు నాటి నిజాం సంస్థానంలో పోలీసు పటేల్‌గిరికి స్వస్తి చెప్పి పోరాటంలో ముందు నిలిచారు. నిజాం ప్రభువు వారెంట్లు జారీ చేసి అరెస్టుల కోసం ప్రయత్నిస్తుండగా మొత్తం ఉద్యమ నేతలంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఊరూరా తిరుగుతూ పరకాల ప్రాంత ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగుల్కొల్పారు. వీరి పిలుపు మేరకు ఈ ప్రాంత గ్రామాల్లో త్రివర్ణ పతాకాలు ఎగురవేయడం నిజాం రజాకార్లకు ఎదురుతిరగడం ప్రారంభమైంది. ఉద్యమనేతల పిలుపు మేరకు 1947 సెప్టెంబర్ 2న పరకాల పట్టణంలోని చేపల బండ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేందుకు సమీప గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనాన్ని జరుపుకొనేందుకు వేలాదిగా వచ్చిన ప్రజలతో పట్టణం కిక్కిరిసిపోయింది. యూనియన్ పతాకాలు, వడిసెలు, రాళ్లు, కర్రలు చేబూని కదం తొక్కుతూ కదిలివచ్చారు. అప్పటికే మకాం వేసి ఉన్న నిజాం పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టగా, రజాకార్లు ఆయుధాలతో ఉద్యమకారులపై దాడికి సిద్ధంగా ఉన్నారు. ఉద్యమకారులు వెనక్కి వెళ్లాలని హుకుం జారీ చేశారు. ఉద్రేకం, ఉద్వేగం, ఆగ్రహంతో ఉన్న ఉద్యమకారులంతా




జెండావిష్కరణ జరపాలనుకుని చేపలబండ వైపు అడుగులు వేశారు. దీంతో అక్కడే ఉన్న నిజాం పోలీసులు ఉద్యమకారులపై కాల్పులు జరపడంతో అంతా చెల్లాచెదురయ్యారు. తుపాకీ తూటాలకు కొందరు, రజాకార్ల కత్తుల వేటుకు మరికొందరు అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. గాయాలతో అనేక మంది పరుగులు పెడుతూ గ్రామ శివారుల్లో పంట చేనుల్లో ప్రాణాలొదిలారు. ఉద్యమకారులు చిందించిన రక్తంతో చేపల బండ ప్రాంతం మొత్తం రక్తసిక్తమైంది.

ఈ ఘటనకు అద్దం పట్టే రీతిలో నేటి మహారాష్ట్ర గవర్నర్, నాటి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సీహెచ్ విద్యాసాగర్‌రావు తన తల్లి పేర నిర్వహిస్తున్న ట్రస్టు నిధుల నుంచి పోరాట చరిత్రను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో పరకాలలో అమరధామాన్ని నిర్మించారు. చరిత్రకు సజీవ సాక్ష్యంగా, వీరుల త్యాగాల స్ఫూర్తిగా అమరధామం విరాజిల్లుతోంది. తెలంగాణ విమోచన యాత్రలో భాగంగా డా॥ కె.లక్ష్మణ్, ఎంపీ బండారు దత్తాత్రేయ సెప్టెంబర్ 2న పరకాలను సందర్శించి, నాటి అమరవీరులకు నివాళులు అర్పించారు. ■



నేను, నా దేశం – ఈ రెంటిలో నా దేశమే నాకు ముఖ్యమైనది. – డా॥ బి.ఆర్.అంబేద్కర్

# ఎర్రుపాలెంలో అలుపెరగని పోరాటం



నిజాం నిర్బంధాలను లెక్క చేయకుండా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలంటూ ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం ప్రజలూ అలుపెరుగని పోరాటం చేశారు. దుక్కి దున్నే రైతు సాయుధుడై నిజాం పోలీసులు, రజాకార్లతో పోరాడాడు. మధిర తాలూకాలోని ఎర్రుపాలెం, మీనవోలు తదితర గ్రామాల్లో రజాకార్లను తీవ్రంగా ప్రతిఘటించారు. తుపాకులు ధరించిన రజాకార్లు మహిళలు, వృద్ధులు అన్న తేడా లేకుండా విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఎంతో మంది అమరులయ్యారు. సమీప కాలువల్లో రక్తం చింది నీరు ఎర్రబారిపోయిందని నాటి ఘటన ప్రత్యక్ష సాక్షులు చెప్పేవారు. తెలంగాణ విమోచన పోరాటంలో స్థానం సంపాదించిన ఎర్రుపాలెంను సెప్టెంబర్ 3న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, పి.మురళీధర్ రావు సందర్శించి అమరవీరులకు నివాళులు అర్పించారు.

"రైతులకు బేడీలు వేయడం, నేరెళ్లలో దళితులను చిత్రహింసలకు గురిచేయడం, ధర్నాచౌక్ ఎత్తేయడం... తెలంగాణలో నిజాం పాలన కొనసాగుతున్నట్లు అనిపిస్తుంది."

కార్యకర్తలు విమోచన యాత్రలో పాలుపంచుకున్నారు.

వరంగల్ తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని సందర్శించిన లక్ష్మణ్ నివాళులు అర్పించారు. తర్వాత పరకాలలోని అమర ధామాన్ని సదర్శించి నాటి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. పరకాల బహిరంగ సభలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. స్వాతంత్రం కోసం నిజాం పోలీసులు, రజాకార్ల తూటాలకు ఎదురొడ్డిన చరిత్రను కనీసం పాఠ్యాంశాల్లో చేర్పించకపోవడం దారుణమన్నారు. తెలంగాణ వచ్చాక కూడా సమరయోధులను విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో నిజాం వ్యతిరేక పోరాటంలో ర్యాలీ తీశారు. సదుద్దేశ్యంతో చేపట్టిన ఈ యాత్రను ప్రజలు విశేషంగా ప్రశంసించారు. నిజాం నిరంకుశత్వం నుంచి విముక్తి పొందిన సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా జరపాలన్న డిమాండ్‌కు గట్టి మద్దతు తెలిపారు. పరకాల దిశగా పయనమైన లక్ష్మణ్ యాత్రకు అడగడుగునా జననీరాజనం వ్యక్తమైంది. మార్గమధ్యలో ప్రతి ఊరులో యాత్రకు అపూర్వ స్వాగతం పలికారు. ఆలేరు, జనగాం, స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్, తొర్రూర్... చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా ప్రతి ఊరిలోనూ ప్రజలు తండోపతండాలు వచ్చి లక్ష్మణ్ విమోచన యాత్రకు సంఘీభావం తెలిపారు. బండారు దత్తాత్రేయ, నల్లు ఇంద్రసేనా రెడ్డి సహా బిజెపి నాయకులు,

"అధికారిక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరపకుండా ప్రభుత్వం నాటి నిజాం పాలనను మరిపిస్తుంది, ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతోంది."

## రజాకార్లను ఉరికించిన భైరాన్‌పల్లి



తెలంగాణ విమోచన పోరాటంలో భైరాన్‌పల్లి వీర గాథల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. రజాకార్ల అరాచకాలను ఎదుర్కొనేందుకు భైరాన్‌పల్లిలో గ్రామరక్షక దళాలను ఏర్పాటు చేసుకున్నారు. దూరం నుంచే రజాకార్ల రాకను పసిగట్టేందుకు పెద్ద పెద్ద బురుజులు నిర్మించారు. రజాకార్లు వస్తే బురుజులపై నుంచి నగారా మోగించేవారు. దీంతో రజాకార్లతో పోరాడేందుకు గ్రామ రక్షకదళాలు సిద్ధమయ్యేవి. ఒకసారి భైరాన్‌పల్లి పక్క గ్రామం లింగాపూర్‌పై రజాకార్లు దాడి చేసి, ధాన్యాన్ని ఎత్తుకెళ్తుండగా భైరాన్‌పల్లి వాసులు అడ్డుకొని ఎదురుదాడి చేశారు. దీంతో రజాకార్లు భైరాన్‌పల్లిపై కక్షగట్టారు. 1948 మేలో 100 మంది రజాకార్లు తుపాకులతో దాడి చేసి చావుదెబ్బ తిన్నారు. మరోసారి 400 మంది రజాకార్లు తుపాకులతో దాడి చేసి తోకముడిచారు. దీంతో భైరాన్‌పల్లిపై ప్రతీకారం పెంచుకున్న రజాకార్లు 1200 మంది సైన్యంతో ఊరిపై పడ్డారు. విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. కనిపించినవారినల్లా కాల్చి చంపారు. మహిళలను బలాత్కరించారు. సంప్రదాయక ఆయుధాలతోనే ఎదురుతిరిగిన భైరాన్‌పల్లి గ్రామ రక్షకదళం సభ్యులు రజాకార్ల తూటాలకు మొత్తం 118 మంది వీరమరణం పొందారు. భైరాన్‌పల్లి బురుజు సజీవ సాక్ష్యంగా నాటి వీరోచిత పోరాటాలను గుర్తు చేస్తుంది. ఈ చరిత్రను నేటి తరానికి అందించేందుకు డా॥ కె.లక్ష్మణ్, పేరాల శేఖర్ రావు సెప్టెంబర్ 4న భైరాన్‌పల్లి సందర్శించారు. నిజాం వ్యతిరేక పోరాటంలో అమరులైన వీరులను స్మరించుకున్నారు.

# విమోచనోద్యమంలో సిరిసిల్లా




దేశమంతటా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ఆనందోత్సవాలు జరుపుకుంటున్న సమయంలోనూ తెలంగాణ ప్రజలు కట్టు బానిసత్వంలో, నిరంకుశ నిజాం పాలనలో మగ్గి నానా కష్టాలు భరించడం చూడలేక సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి వాసులు విమోచనోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి నాయకత్వంలో 1948, సెప్టెంబరు 14న జాతీయపతాకాన్ని ఎగురవేశారు. ఇది జీర్ణించుకోలేని నిజాం పోలీసులు నిర్బంధాన్ని అమలు చేశారు. దీంతో ఉద్యమకారులు రజాకార్లకు వ్యతిరేకంగా కొడవళ్ళు, గొడ్డళ్ళు, బరిసెలతో పోరు సాగించారు. 300 మంది సాయుధ పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో గాలిపెల్లికి చెందిన పీసు బక్కయ్య, బద్దం నారాయణ, బుర్రయ్య, పుల్లుగారి ఎల్లయ్య, అల్లెం వెంకయ్య తదితరులతో పాటు ఉద్యమంతో సంబంధం లేని వృద్ధ దంపతులు కూడా మృతి చెందారు. రజాకార్ల బారి నుండి బద్దం ఎల్లారెడ్డి, రాజలింగం, అమృత్‌లాల్ శుక్లా చాకచక్యంగా తప్పించుకున్నారు. ఆగ్రహం చెందిన రజాకార్లు గాలిపెల్లిని తగులబెట్టి అందినకాడికి దోచుకుపోయారు. దీంతో ఉద్యమకారులు సిరిసిల్లా పోలీస్ స్టేషన్‌పై దాడిచేసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఇంతటి ప్రాశస్త్యమైన సిరిసిల్లాను తెలంగాణ విమోచన యాత్రలో భాగంగా డా॥ కె.లక్ష్మణ్, జి.కిషన్ రెడ్డి సెప్టెంబర్ 4న సందర్శించి అమరవీరులకు నివాళులు అర్పించారు.

'బండెనక బండి కట్టి...' పాటలతో ప్రజలను చైతన్యపర్చిన ప్రజాకవి బండి యాదగిరి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఖమ్మంలో రాత్రి బస చేశారు.

## సెప్టెంబర్ 3, మూడో రోజు

అభిమానుల కోలాహలం మధ్య ఖమ్మం నుంచి ప్రారంభమైన మూడోరోజు యాత్రలో లక్ష్మణ్ రజాకార్ల రాక్షసత్వానికి, నిజాం అకృత్యాలకు, సమర యోధుల త్యాగాలకు నెలవైన ప్రాంతాలను సందర్శించారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు ముఖ్య అతిథిగా యాత్రలో పాల్గొన్నారు. ఖమ్మం నుంచి ర్యాలీగా బయలుదేరిన ఈ విమోచన యాత్ర.. రజాకార్ల ఊచకోతతో నెత్తురు పారిన గడ్డ ఎర్రుపాలెం చేరుకుంది. గ్రామస్థులు లక్ష్మణ్‌కు సాదర స్వాగతం పలికారు. నిజాంకు

**"ప్రభుత్వం అన్ని విధాలుగా పూర్తిగా విఫలమైంది. ప్రజలు టీఆర్ఎస్ పాలనపై విసుగు చెందారు. 2019 ఎన్నికల్లో బిజెపి విజయం ఖాయం."**

వ్యతిరేకంగా పోరాడిన మాడపాటి రాంచందర్ రావు, సర్దార్ జమలాపురం కేశవరావు కుటుంబీకులను కలిసి వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. అక్కడ బిజెపి ఏర్పాటు చేసిన మాడపాటి రాంచందర్ రావు, సర్దార్ జమలాపురం కేశవరావు విగ్రహాలను లక్ష్మణ్, మురళీధర్ రావు ఆవిష్కరించారు. ఎర్రుపాలెం లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లక్ష్మణ్ ప్రసంగించారు. అనంతరం దేవుని సంకీసకు వెళ్లి అమరవీరులకు నివాళులు అర్పించారు. జనగామలో రాత్రి బస చేశారు.



**"సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగరవెయ్యడం సీఎం నైతిక బాధ్యత. లేకుంటే రాబోయే రోజుల్లో కేసీఆర్ చరిత్రహీనుడిగా మిగిలిపోతాడు. చరిత్రను ఓటుబ్యాంకు రాజకీయాలో ముడిపెట్టకూడదు."**

## సెప్టెంబర్ 4, నాలుగో రోజు

టీఆర్ఎస్‌కు గట్టి పట్టున్న ప్రాంతాలుగా చెప్తోన్న సిద్దిపేట, సిరిసిల్లా జిల్లాల్లో నాలుగో రోజు యాత్ర సాగగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్ రావు ఈ యాత్రలో పాల్గొనగా.. నాలుగో రోజు జనగాం నుంచి బయలుదేరిన విమోచన యాత్రకు మార్గమధ్యలో ఎదురైన నర్మెట్ట, తరిగొప్పల తదితర గ్రామాలు అపూర్వ స్వాగతం పలికాయి.

నాటి తెలంగాణ విమోచన పోరాటంలో 18 మందిని వరసగా నిలబెట్టి తుపాకీతో కాల్చి చంపిన రజాకార్ల అకృత్యాలకు సాక్ష్యంగా ఉన్న కూటిగల్‌ను సందర్శించారు. తెలంగాణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ప్రాణత్యాగం చేసిన కూటిగల్ అమరవీరులకు నివాళులు

### కూటిగల్.. రజాకార్ల క్రూరత్వానికి సాక్ష్యం



రజాకార్ల అకృత్యాలకు సాక్ష్యంగా నిలిచిన గ్రామం.. కూటిగల్. తెలంగాణ విమోచన పోరాటంలో రజాకార్లు 18 మంది కూటిగల్ వాసులను వరసగా నిలబెట్టి తుపాకీతో కాల్చి చంపారు. తెలంగాణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ప్రాణత్యాగం చేసిన కూటిగల్ అమరవీరులకు సెప్టెంబర్ 4న డా॥ కె.లక్ష్మణ్, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్ రావు నివాళులు అర్పించారు. పాఠ్యపుస్తకాలకు ఎక్కని ఈ చరిత్రను భావి తరాలకు అందించడం మన బాధ్యత అని లక్ష్మణ్ అన్నారు.



మహాద్భుతాలను సాధించడానికి దృఢ నమ్మకం మూలం. - స్వామి వివేకానంద

# దాశరథికి ప్రణామాలు

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలానికి పదునుపెట్టి.. నవాబులపై పదాల తూటాలను ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు. వరంగల్ జిల్లా మరిపెడ మండలం చిన్న గూడూరులో 1925 జులై 22న వెంకటాచార్యులు, వెంకటమ్మ దంపతులకు జన్మించారు. చిన్నతనం నుంచే కవిత్వంలో పట్టుసాధించిన ఆయన దొరతనానికి, నిజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. మొక్కవోని ధైర్యంతో జనాన్ని చైతన్యవంతులను చేస్తూనే గ్రామాల్లో దొరల దాష్టికాన్ని తన పదకవిత్వంతో తూర్పారాబట్టారు. గూడూరు ప్రజల కష్టాలపై ఆయన రాసిన పద్యాలు అప్పట్లో మొత్తం రాష్ట్రాన్నే మేల్కొనేలా చేశాయి.

దాశరథి రచనలకు ప్రభావితులైన జనం నిజాం నవాబుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. నిజాం పోలీసుల నిర్బంధాలు పెరగడంతో రెండేళ్ల పాటు అజ్ఞాతవాసం చేశారు. తర్వాత నిజాం పాలనకు వ్యతిరేకంగా 1947లో వరంగల్ బహిరంగలో మొదటిసారి జనంలోకి వచ్చారు. తన పదునైన మాటలతో జనాన్ని ఆకట్టుకున్నారు. అక్కడే మాటువేసిన పోలీలసులు దాశరథిని పట్టుకుని నిజమాబాద్ జైలుకు తరలించారు. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా జైలు గోడలనే రాత పుస్తకాలుగా చేసి తన కవితలతో జనాన్ని



చైతన్యవంతం చేశారు. 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' పద్యం రాసింది ఈ జైలులోనే. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు నిజాం పాలన నుంచి విముక్తి లభించిన తరువాత దాశరథి జైలునుంచి విడుదలయ్యారు. కాలక్రమంలో ఈ జైలే దాశరథి ఖిల్లాగా ప్రసిద్ధి చెందింది. నిజాం పాలనలో మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు శిక్ష అనుభవించిన జైలును డా॥ కె.లక్ష్మన్ సెప్టెంబర్ 5న సందర్శించారు. మహాకవికి మనస్ఫూర్తిగా ప్రణమిల్లారు. ■

అర్పించారు. నిజాంకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో 118 మంది యోధులు నేలకొరిగిన కర్మభూమి భైరాన్‌పల్లిని లక్ష్మన్ సందర్శించారు. నాటి వీరోచిత పోరాటాలకు సాక్షీభూతంగా నిలిచిన భైరాన్‌పల్లి బురుజునెక్కి, అమరవీరులకు నివాళులు అర్పించారు. అటు నుంచి సిద్దిపేట చేరుకున్న లక్ష్మన్‌కు ఘనస్వాగతం లభించింది. నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన ఇల్లంత కుంట, గాలిపల్లి లాంటి ప్రముఖ ప్రాంతాలకు నెలవైన సిరిసిల్లా జిల్లాలో అమరవీరులకు నివాళులు అర్పించారు. సిరిసిల్లాలో ఏర్పాటు చేసిన సభలో లక్ష్మన్‌తో పాటు బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడలో రాత్రి బస చేశారు.

### సెప్టెంబర్ 5, ఐదో రోజు

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆశీర్వాదం తీసుకొని, కోడె మొక్కులు చెల్లించిన లక్ష్మన్ ఐదో రోజు విమోచన యాత్రను శుభప్రదంగా ప్రారంభించారు. రుద్రంగి,

> **"ఉద్యమ సమయంలో అధికారిక తెలంగాణ విమోచన దినం జరపాలని రోశయ్యను డిమాండ్ చేసిన కేసీఆర్ ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నారు."**



> **"ముఖ్యమంత్రి కేసీఆర్ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని స్వాతంత్ర్య దినోత్సవాలను జరపాలి. మాట తప్పడం మంచిది కాదు. ప్రజలు అన్నీ గమనిస్తుంటారు."**

కతలాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి, కమ్మరపల్లి, ఆర్మూర్ గుండా నిజామాబాద్ చేరుకుంది. కతలాపూర్‌లో నిజాం వ్యతిరేక పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, రాజ్యాంగ నిర్మాత డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్, మలిదశ తెలంగాణ ఉద్యమం అమరవీరుడు శ్రీకాంత చారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడ రచ్చబండలో పాల్గొని గ్రామస్థులతో మాట్లాడారు. కోరుట్లలో అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. నిజామాబాద్‌లో మహాకవి దాశరథిని బంధించిన జైలును సందర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. అటు నుంచి కామారెడ్డి చేరుకొని రాత్రి మేడ్చల్‌లో బస చేశారు.

### సెప్టెంబర్ 6, ఆరో రోజు

డా॥ కె.లక్ష్మన్ తెలంగాణ విమోచన యాత్ర ఆరో రోజూ జోరుగా కొనసాగింది.. అదే ఉత్సాహం తొణికిసలాడింది. మేడ్చల్ నుంచి మహబూబ్‌నగర్ వరకు సాగిన ఈ యాత్రలో గౌరెల్లి, మహేశ్వరం, షాద్‌నగర్, బాలానగర్, జడ్చర్ల సహా పలు ప్రాంతాలను సందర్శించారు. చిన్నచిన్న గ్రామాలు సైతం లక్ష్మన్ యాత్రకు మంగళహారతులు పలుకుతూ ఆహ్వానించాయి. మేడ్చల్ జిల్లా కీసరలో తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. ఆరో రోజు యాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మేడ్చల్ సభలో పాల్గొన్న నిరంజన్ జ్యోతి పదునైన మాటలతో టీఆర్ఎస్‌ను ఉతికారేశారు. తెలంగాణ సంప్రదాయానికి చిహ్నాలైన బతుకమ్మ, బోనాలతో మహిళలు కేంద్ర మంత్రికి ఘనస్వాగతం పలికారు. తెలంగాణవాసులు చూపిన ప్రేమాభిమానాలపై సాధ్వీ నిరంజన్

> **"రైతుల పట్ల ప్రభుత్వం తీరు దారుణంగా ఉంది, మద్దతు ధర అడిగితే బేడీలు వేసింది. ఉద్యమ సమయంలో కేసీఆర్ చెప్పినదానికి ఇప్పుడు అనుసరిస్తున్న దానికి పొంతన లేదు."**

# అప్పంపల్లి అమరవీరులకు నివాళులు

తెలంగాణ విమోచన పోరాటంలో మహబూబ్ నగర్ జిల్లా అప్పంపల్లిది మరో కీలక పాత్ర. తెలంగాణను భారతదేశంలో విలీనం చేయాలంటూ 1947 అక్టోబరు 7న ఆత్మకూరు, అమరచింత సంస్థాన పరిధిలోని అప్పంపల్లిలో బెల్లం నాగన్న నాయకత్వంలో నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు. అప్పంపల్లి పరిసర గ్రామాలైన నెల్లికొండ, వడ్డేమాన్, దాసరపల్లి, లంకాల, అమరచింత తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది ఉద్యమకారులు తెలంగాణ విమోచన కొరకు సత్యాగ్రహం చేశారు. ఈ సత్యాగ్రహాన్ని అణచివేయడానికి నిజాం సైనికులు ఎంత ప్రయత్నించినప్పటికీ వారికి సాధ్యం కాలేదు. దీంతో సైనిక చర్యకు దిగారు. బెల్లం నాగన్నతో పాటు పలు ప్రముఖులను అరెస్టు చేయాలని నిజాం సైనికులు నిర్ణయించారు. ప్రజలు ప్రతిఘటించడంతో వారు తోకముడిచారు. ఆ సాయంత్రం ఉద్యమకారులపై కాల్పులు జరపడంతో 11 మంది మరణించగా, 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో నెల్లికొండికి చెందిన కుక్కల కిష్టన్న తన ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసాడు. అప్పటి తాలుకా గిర్దావర్, పోలీస్



ఇన్‌స్పెక్టర్ అతన్ని అరెస్టు చేసి తీసుకువెళ్తుండగా ప్రజలు ఎదురు తిరగారు. ప్రజల ప్రతిఘటనకు భయపడి కిష్టన్నను వదిలి పారిపోయారు. తెలంగాణ విమోచన పోరాటంలో ఎంతో ప్రాశస్త్యం ఉన్న అప్పంపల్లి చరిత్రను వెలికితీసి నాటి పోరాట యోధులను సముచితంగా సత్కరించుకోవాలంటూ డా॥ కె.లక్ష్మణ్, కేంద్రమంత్రి హన్స్‌రాజ్ గంగారాం అప్పంపల్లి అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు.

జ్యోతి ముగ్దురాలయ్యారు. ఆరో రోజు రాత్రి లక్ష్మణ్ మహబూబ్‌నగర్‌లో బస చేశారు.

## సెప్టెంబర్ 7, ఏడో రోజు

చివరి రోజుకు చేరుకున్నప్పటికీ డా॥ లక్ష్మణ్ విమోచన యాత్ర జోరు తగ్గలేదు. ప్రజల నుంచి వస్తోన్న మద్దతు, ప్రోత్సాహంతో కొత్త శక్తిని సంతరించుకుంది. లక్ష్మణ్ మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించి ఏడో రోజు యాత్ర మొదలు పెట్టారు. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లోని పలు ప్రాంతాలను సందర్శించారు. కందూరు, వీరయపల్లి, బలిజపల్లి, చిట్యాల, వనపర్తి, కొత్తకోట, దేవరకద్ర తదితర గ్రామాలు, పట్టణాల్లో ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. అన్ని వర్గాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి మద్దతు తెలిపారు.

చివరి రోజు యాత్ర కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అప్పంపల్లి సభలో ప్రసంగించి శ్రేణులను ఉత్సాహ పరిచారు. అప్పనపల్లిలో అమరవీరులకు నివాళులు

> **"నిజాం పాలనకు వ్యతిరేకంగా జమలాపురం కేశవరావు వీరోచిత పోరాటం చేశారు. ఇలాంటి వీరులెందరి చరిత్రను టీఆర్ఎస్ తొక్కిపెడుతోంది. వీరి చరిత్రను భావి తరాలకు అందించాల్సి ఉంది."**



> **"తెలంగాణ అమరవీరులను విస్మరించిన టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు. రాష్ట్రం నిర్వహిస్తే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించేందుకు కేంద్రం కూడా సిద్ధంగా ఉంది."**

అర్పించి భారీ బహిరంగ సభతో డా॥ కె.లక్ష్మణ్ తెలంగాణ విమోచన యాత్ర ముగిసింది.

## యాత్రకు జననీరాజనం

డా॥ కె.లక్ష్మణ్ తెలంగాణ విమోచన యాత్రకు కులమతాలకు అతీతంగా అన్నివర్గాల నుంచి విశేష మద్దతు వ్యక్తమైంది. బిజెపి కార్యకర్తలే కాకుండా... రైతులు, కార్మికులు, యువకులు, మహిళలు, వృద్ధులతో పాటు స్కూల్ విద్యార్థులు లక్ష్మణ్‌కు మంగళహారతులతో ఆహ్వానించారు. ఈ యాత్రలో 80 వరకు ర్యాలీలు జరిగాయి. 50 వరకు బహిరంగ సభలు ఏర్పాటు చేశారు. వందల సంఖ్యలో బైక్‌లు, కార్లు వెంటరాగా యాత్ర యావత్తూ సందడి నెలకొంది. దారి పొడుగునా 'జై తెలంగాణ' నినాదాలు మిన్నంటాయి. "సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహించాలి... స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకోవాలి..." అన్న డిమాండ్ నినాదంగా మారి తెలంగాణవ్యాప్తంగా ప్రతిధ్వనించింది.

## టీఆర్ఎస్ దిగజారుడు రాజకీయం

సెప్టెంబర్ 17న అధికారికంగా విమోచన దినం జరపాలన్న డిమాండుతో ప్రారంభమైన ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష మద్దతు వస్తుండడంతో ఆందోళన చెందిన టీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి రోజు నుంచే ఆటంకాలు సృష్టించే ప్రయత్నం చేసింది. ముందుగానే భువనగిరిలో గెస్ట్‌హౌజ్ బుక్ చేసుకున్నప్పటికీ చివరి నిమిషంలో అధికారులు రద్దు చేశారు. దీంతో లక్ష్మణ్ ఆ రాత్రి ఓ బిజెపి కార్యకర్త ఇంట్లోనే బస చేశారు. అటు వరంగల్‌లోనూ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించేందుకు అనుమతివ్వకుండా ఇబ్బందులకు గురి చేశారు. టీఆర్ఎస్ అధికార బలాన్ని ఉపయోగించి లక్ష్మణ్ యాత్రకు అడగడుగునా అడ్డంకులు సృష్టించినప్పటికీ... ప్రజల సహకారం, దేవుని ఆశీస్సులతో యాత్ర దిగ్విజయంగా పూర్తయ్యింది. ప్రజల నుంచి యాత్రకు వచ్చిన అనూహ్య స్పందన అధికారిక టీఆర్ఎస్‌కు ముచ్చెమటలు పట్టిస్తోంది. యాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసిన విశ్లేషకులు సెంటిమెంటును అడ్డం పెట్టుకొని గద్దెనెక్కిన టీఆర్ఎస్ పతనం ఖాయమని.. 2019లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్తున్నారు.■



భూ ప్రపంచం మన మాతృభూమి – సమస్త మానవాళీ మన జాతి. – శ్రీ వీర సావర్కార్




# సెప్టెంబర్ 17 విమోచనమే

● అభినవ్

ప్రజాకంటకుడైన నిరంకుశ నిజాంను గద్దెదించి, రజాకారు రాకాసి మూకలను తరిమికొట్టిన ఆనాటి పోరాటం దేశ చరిత్రలో అపూర్వఘట్టం. భావితరాలకు స్ఫూర్తిదాయకం. గ్రామ గ్రామాన రైతులు, కూలీలు, సబ్బండ వర్ణాలు ఏకమై కత్తులు, గొడ్డళ్ళు, వడిసెళ్ళు, బరిసెలు, బర్మారు తుపాకులు, రోకలిబండలనే ఆయుధాలుగా చేసుకొని ప్రాణాలకు తెగించి నిజాం సైన్యాలను, రజాకారు మూకలను ఎదిరించి తెలంగాణ విమోచన సాధించిన సెప్టెంబర్ 17 మనందరికీ పర్వదినం. వాడవాడలా జాతీయ జెండాను ఎగుర వేయాల్సిన సుదినం. నాటి అమరవీరులు, సమర యోధులను స్మరిస్తూ ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాల్సిన స్వాతంత్ర దినం. కానీ ఇంతటి ప్రాముఖ్యమైన రోజూ టీఆర్ఎస్ ప్రభుత్వం విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించడం లేదు.

## మాట మార్చిన కేసీఆర్

ఉద్యమ సమయంలో సెప్టెంబరు 17 విమోచన ఉత్సవాలను ఎందుకు నిర్వహించ లేదని ఆనాటి ప్రభుత్వాన్ని తిట్టిపోసిన కేసీఆర్ బృందం ఇప్పుడు అధికారంలో ఉండి కూడా నిర్వహించకపోవటం క్షంతవ్యం కాదు. అప్పుడు 5 మరాఠి జిల్లాలు, 8 కన్నడ జిల్లాలు నిజాం సంస్థానంలో ఉన్నందున ఇప్పుడు కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తూంటే టీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రజాకార్ల వారసులైన (ఎంఐఎం) మజ్లిస్ మెప్పు కోసం ఆరాట పడుతూ ప్రజల మనోభావాలను గౌరవించ కుండా అవమానపరుస్తున్నది. నేటి యువతకు, భావితరాలకు దేశభక్తిని, జాతీయ సమైక్యతా భావాలను రగిలించే ఈ చరిత్రను పాఠ్యాంశం చేయకుండా తొక్కిపెడుతున్నది. పైగా నిరంకుశ నిజాం రాజును కీర్తిస్తూ ప్రజలను ఉద్ధరించాడని... హిందూముస్లింలను సమానంగా ఆదరించాడని లేని గొప్పలు ఆపాదిస్తూ కట్టుకథలతో చరిత్రను వక్రీకరించి పాఠ్యాంశాలలో చేరుస్తున్నదీ కేసీఆర్ ప్రభుత్వం.

ఓట్లు సీట్లే పరమార్థం అనుకునే పార్టీలకు, కపట మేధావులకు, బూటకపు సెక్యూల రిస్టులకు నిజాం భజన నిత్యకృత్యమైంది. ప్రజలు తిరగబడి నిజాం రాజ్యానికి ఘోరీ కడితే కేసీఆర్ ప్రభుత్వం ఆ చారిత్రక వాస్తవాలను సమాధి చేస్తోంది. నిజాం తన కుటుంబ అవసరాల కోసం... తన పోలీసు, సైన్యం, ఉద్యోగ, మంది మార్బలం, భజన గాళ్ళ కోసం హైదరాబాద్‌లో ఒక గండిపేట చెరువు, ఒక ఉస్మానియా దవాఖాన, ఒక యూనివర్సిటి నిర్మిస్తే అది 16 జిల్లాలు గల మొత్తం సంస్థాన ప్రజలను ఉద్ధరించినట్టు బాకాలూదుతున్నారు. ప్రపంచంలోనే నిజాం రాజు అత్యంత సంపన్నుడని ప్రజలను, ఉద్ధరించాడని ఆయన సమాధికి సలాం కొట్టిన కేసీఆర్‌కు నిజాం రాజ్యంలో దోపిడీ దౌర్జన్యాలు, అణచివేతకు గురైన కొట్లాది మంది ప్రజల కన్నీటి గాథలు కాని, నిజాం ఉసిగొల్పిన రజాకార్ల కిరాతకాలు కాని కనిపించవు. నిజాం తన కోసం తన బలగాల కోసం తన భార్యాబిడ్డల విలాసాల కోసం చేసిందంతా ప్రజలకు ఉద్ధరించ డానికన్నట్లు ప్రచారం చేస్తున్నారు.

## నిజాం పాలనంటే నరకం

నిజాం పాలనలో కూడు, గూడు, గుడ్డ, విద్యా, వైద్యం లాంటి కనీసావసరాలకు ప్రజలు నోచుకోలేదు. ఇక స్వేచ్ఛాస్వాతంత్రాలు, కనీస మానవ హక్కులు కూడా కోల్పోయి కట్టుబానిసలుగా ప్రజలు అణచివేతలకు గురయ్యారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కాలు కదపటానికి కూడా వీలులేని నిర్బంధాలు కొనసాగాయి. నిజాంకు ఊడిగం చేసే గ్రామాధికార్లు, నవాబులు, జాగీర్దార్లు, దేశముఖులు దోపిడీ దౌర్జన్యాలతో ప్రజలను పీల్చి పిప్పి చేశారు. ప్రజలకు వెట్టిచాకిరి తప్పలేదు. కనీసం మత స్వేచ్ఛ లేకుండా అడుగడుగునా ఆంక్షలు విధించారు. హిందు వుల పండుగలు పబ్బాల పైన ప్రభుత్వ నియంత్రణ కొనసాగింది. ముస్లింల పండుగ రోజు ఇతర మతాల పండుగలు వస్తే బహిరంగంగా నిర్వహించుకోకుండా అడ్డంకు లు సృష్టించారు. దేవుడి ఊరేగింపైనా, సీతారాముల కళ్యాణమైనా, పెండ్లి బాజాలైనా, చావుడప్పులైనా మసీదుల ముందు మూగబోవా ల్సిందే. పీరీల పండగను ప్రజలందరూ విధిగా జరుపుకోవాల్సిందే. రాజు ప్రాపకం పొందాలం టే కుచ్చుటోపి, షేర్వాని ధరించాల్సిందే.

నిజాం పాలనలో 95 శాతం మంది ప్రజలు నిరక్షరాస్యులే. పేరుకు ఉస్మానియా యూనివర్సిటీని స్థాపించినా సంస్థాన ప్రజలు 95 శాతం నిరక్షరాస్యులుగానే మిగిలారు. విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ప్రజలకు విద్య అందుబాటులో లేకుండా పోయింది. పెద్ద గ్రామాలలో తప్ప అన్ని గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలే లేవు. ఉన్నచోట కూడా ప్రాథమిక పాఠశాలలే. ఉన్నత పాఠశాలలు గగనకుసుమాలే. 1948లో నిజాం గద్దె దిగేనాటికి హైదరాబాద్ తర్వాత భువనగిరిలో ఉన్నత పాఠశాల ఉంటే వరంగల్ కేంద్రమైన హన్మకొండలో ఒకటి వుండేది. అరకొరగా ఉన్న విద్య వసతులు కూడా ఉర్దూ మీడియంలోనే. ఇష్టం ఉన్నా లేకున్నా ఉర్దూలోనే అభ్యాసం చేయాల్సిన దుస్థితి. మెజారిటీ ప్రజల భాషను, సాహిత్యాన్ని అణచివేశారు. ఉర్దూలో చదివిన వారికే ప్రభుత్వ ఉద్యోగాలు దక్కేవి.

నిజాం రాజ్యంలో తెలుగు బాషా సాహిత్య సాంప్రదాయాలు అంతరించే ప్రమాదం ఉందని ఆందోళన చెందిన తెలుగు బాషాభిమానులు, జాతీయవాదులు ఎన్నో ఆంక్షలను, అడ్డంకులను ఎదుర్కొంటూ గ్రంథాలయాలను, తెలుగుభాషా నిలయాలను స్థాపించి మాతృబాష మృత భాష కాకుండా కాపాడగలిగారు. నిర్బంధాలకు జడవకుండా ఆంధ్ర మహాసభను (నిజామాంధ్ర మహాసభ) స్థాపించి ప్రజల హృదయాలలో, స్వేచ్ఛా స్వాంతంత్ర ఆకాంక్షలకు ఊపిరి లూదారు. తదనంతర కాలంలో నిజాం రాజ్యానికి వ్యతిరేకంగా మహత్తర ఉద్యమాలకు సాయుధ పోరాటాలకు పునాదులు వేశారు.

## హైదరాబాద్ మరో పాకిస్థానా?

ఆంగ్లేయుల నుండి 15 ఆగస్టు 1947నాడు దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ, మరొక పాకిస్థాన్ తరహాలో స్వంత దేశం ఏర్పాటుకు నిజాం సిద్ధమయ్యాడు. తూర్పు పడమరలలో రెండు పాకిస్థాన్లు ఏర్పడినట్లే హైదరాబాద్

సంస్థానంలోని హిందువులను తరిమికొట్టడానికి తన పోలీసు బలగాలకు తోడు ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేశాడు. కరుడగట్టిన మతోన్మాది ఖాసిం రజ్వీ నాయకత్వంలో రజాకార్లు అనే రాకాసి మూకలకు ఆయుధాలిచ్చి హిందువుల పైకి ఉసిగొల్పాడు. గ్రామాలపై దాడులు దోపిడీలు, హత్యలు, మానభంగాలు, సజీవ దహనకాండలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. విచ్చలవిడిగా గ్రామాలను దోచు కున్నారు. ప్రాణాలు దక్కించుకోవటానికి కట్టుబట్టలతో హిందువులు చెల్లాచెదరై విజయవాడ, గుడివాడ, గుంటూరు, కర్నూలు, బెంగుళూరు, నాగపూర్ తదితర ప్రాంతాలకు పారిపోయారు. రజాకార్లు సాగించిన రాక్షసకాండ ప్రపంచ చరిత్రలో ఎక్కడా జరగలేదు.

పారిపోగా మిగిలిన ప్రజలు ఎక్కడికక్కడ నిజాం సైన్యాలను, రజాకార్లను ఎదిరించటానికి నడుంకట్టారు. పనిముట్లనే ఆయుధాలుగా చేసుకుని ప్రాణాలకు తెగించి పోరాడారు. రజాకార్లను తరిమి కొట్టిన వీర భైరాన్‌పల్లి, వరంగల్ కోట, రేణికుంట, కడవెండి, కామారెడ్డిగూడెం, పర్కాల సూర్యాపేట, బీబీనగర్, బాలెంల పెరుమాండ్ల సంకీస లాంటి రణరంగాలు ఇంకా ఎన్నెనో మనకు దర్శనీయ కేంద్రాలు. రజాకార్లను తరిమికొట్టిన ఆ పోరాటంలో ప్రాణాలిచ్చిన ఎందరో అమర వీరుల త్యాగం ఫలించి ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నాటి ఆపత్కాలంలో 'పోలీసు చర్య' జరిపించినందువల్ల నిజాం గద్దెదిగాడు. నిజాం రాజ్యానికి ఘోరీ కడుదామన్న ప్రజల ఆశయం నెరవేరింది. రజాకార్లు తోకముడిచారు.

నిజాం వ్యతిరేక పోరాటం హిందూ ముస్లింల మధ్య పోరాటం కాదు. సంస్థానంలోని హిందువులు ముస్లింలు ఒక్కటై నిరంకుశ రాజుకు వ్యతిరేకంగా పోరాడితే కొందరు కుహనా మేదావులు, బూటకపు సెక్యులరిస్టులు, ఓట్ల బిచ్చగాళ్ళు విమోచన ఉత్సవాలంటే ముస్లింల మనోభావాలు దెబ్బతింటాయని సుద్దులు చెప్తున్నారు. కేవలం రజాకార్ల వారసులు తప్ప ఏ ముస్లిమూ విమోచనదినం జరుపవద్దని అనరు. నిజాంకు వ్యతిరేకంగా నిర్భయంగా సంపాదకీయాలు రాసిన అమరుడు షోయాబుల్లాఖాన్, తుర్రెబాజాఖాన్, షేక్ బందగీ లాంటి జాతీయవాద ముస్లిం లెందరో ఆ పోరాటంలో అసువులు బాసిన యదార్థాన్ని విస్మరించవద్దు.

మహాకవి దాశరథి కృష్ణమాచార్య, ప్రజా కవులు సుద్దాల హన్మంతు, బండి యాదగిరి తదితరుల కలాలు-గళాలు పోరాటాలకు ప్రేరణ ఇచ్చినవి. సురవరం ప్రతాపరెడ్డి గారి "గోలకొండ పత్రిక" షోయాబుల్లాఖాన్ "రయ్యత్" "ఇమ్రోజ్' తదితర తెలుగు, ఉర్దూ పత్రికలు రజాకార్ల రాక్షస కృత్యాలను ఎండగడుతూ ప్రజా పోరాటాలకు మద్దతు నిచ్చాయి. పగబట్టిన రజాకార్లు నడివీధిలో షోయాబుల్లా ఖాన్‌ను తుపాకులతో కాల్చి, కత్తులతో నరికి వేశారు.

## కమ్యూనిస్టులది మరో ద్రోహం

నిజాం ఇచ్చట సర్వసత్తాక షరియత్ రాజ్య స్థాపన కోసం ఆరాటపడితే, కమ్యూనిస్టులు భారతగడ్డపై రష్యా చెప్పుచేతల్లో ఉండే ఎర్రరాజ్యం కోసం కుట్రలకు పాల్పడ్డారు. ఎర్రజెండా నీడలో తుపాకులు పట్టిన సామాన్య ప్రజల ఆశయం నిజాంను గద్దె దించాలన్నదే. అందుకే భారత సైన్యాల ముందు నిజాం లొంగి, గద్దె దిగిన తక్షణం ప్రజలంతా ఆయుధాలు విసర్జించి విముక్తి పండగ చేసుకున్నారు. కాని కరుడు గట్టిన కమ్యూనిస్టులు మాత్రం భారత సైన్యాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని కొనసాగించారు. భారత్‌లో కలువకుండా ఒక కమ్యూనిస్టు దేశంగా ఉంచాలని పగటి కలలు కన్నారు. భారత సైన్యాల ముందు తమ కుప్పిగంతులు సాగవని 3 ఏండ్ల తర్వాత సాయధ పోరాటాన్ని విరమించి చెంపలేసు కున్నారు. నిజాం గద్దెదిగిన తర్వాత సాయుధ పోరాటాన్ని కొనసాగించటం చారిత్రక తప్పిదమేనని కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి అంగీకరించారు.

భారత్‌లో విలీనం తర్వాత సాయుధ పోరాటాన్ని కొనసాగించిన కాలంలో తమకు గిట్టని రైతు బిడ్డలను ఇతర పార్టీల ప్రముఖులపై పగబట్టి చంపారు. నేటి నక్సలైట్లు జన జీవన స్రవంతిలో కలిసిపోయిన తమ పాత అనుయాయులనే వేటాడి చంపినట్టుగానే అప్పుడు సాయుధ పోరాటం విరమించిన తమ పాత అనుయాయులపై దాడులు చేశారు. విప్లవ ద్రోహులని ముద్ర వేసి కొందరిని చంపారు. అంతేగాక నిజాం రాజ్యంలో జైలు నిర్బంధాలకు గురై విడుదలై వచ్చిన స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహులను కూడా వదలలేదు. ఆ వివరాలు ఓ పెద్ద గ్రంథమే అవుతుంది.

నిజాం రాజ్యంలోని 16 జిల్లాల్లో 5 మరాఠీ జిల్లాలలో, 3 కన్నడ జిల్లాలలో కొందరు నాయకులు తప్ప పార్టీ శ్రేణులు లేరు. ఇక తెలుగు జిల్లాలలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం మినహా మిగతా జిల్లాల్లో అంతంత మాత్రమే. నిజాం ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేవిధంగా ప్రజల్ని కూడగట్టడంలో కమ్యూనిస్టుల కృషి ఉందనడం వాస్తవమే. కొన్ని తెలుగు జిల్లాలలో వారి ప్రభావం ఉన్నప్పటికీ హైదరాబాద్‌తో పాటు మరాఠా, కన్నడ ప్రజలుండే 8 జిల్లాలలో జరిగిన పోరాటంలో ముందున్నది ఆర్యసమాజ్, స్టేట్ కాంగ్రెస్ సంస్థలు. మొత్తం 8 తెలుగు జిల్లాలలో ఆంధ్ర మహాసభ పోరాటం చాలా ముఖ్యమైనది. బేస్ క్యాంపులు నిర్వహించి అస్త్ర శస్త్రాలతో రజాకార్లను తరిమి కొట్టిన ఆర్య సమాజ్, ఆంధ్ర మహాసభ, ఆంధ్ర మహిళా సభ, స్టేట్ కాంగ్రెస్ పోరాటం గణనీయమైనది. మరాఠా జిల్లాలో కమ్యూనిస్టులకు బొత్తిగా బలం లేనందువల్లనే 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో మొదటి హైదరాబాద్ స్టేట్ అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడైన కామ్రేడ్ వి.డి.దేశ్‌పాండేను వరంగల్ జిల్లా ఇప్పగూడెం నుండి పోటీ చేయించారు. కుట్రలు, కుతంత్రాలతో కమ్యూనిస్టులు చేసిన ద్రోహం వల్ల జరిగిన నష్టం తక్కువేమి కాదు. 1948 సెప్టెంబర్ 17 తర్వాత కమ్యూనిస్టులు జరివిన నరమేధంలో చాలామంది చనిపోయారు. ఇది యదార్థ చరిత్ర.

విమోచన అనగానే కొందరికి శరీరం మీద జెర్రులు పాకినట్లు వంకర్లు పోతారు. ఎందుకంటే దేని నుండి విమోచన జరిగిందో ఆ కథ తవ్వితే చాలా అస్తిపంజరాలు బయటికి వస్తాయని భయపడుతారు! విమోచన అనగానే భుజాలు తడుముకునే వాళ్లుంటారు కాబట్టి సింపుల్‌గా విలీనం అంటే సరిపోతుందని కొందరు అంటారు. ఇంకా కొందరు ఇప్పటికీ అది విద్రోహమే అని మొండిగా వాదిస్తారు. ప్రజలకు సంబంధించి 17 సెప్టెంబర్ విమోచన దినమే..! అందరం కలిసి వాడ వాడలా జాతీయ జండాను ఎగుర వేసి స్వాతంత్ర్య వేడుకలు జరుపుకొనే పండుగ. ■



సాధారణంగా విజ్ఞులు వింటారు, మేధావులు మాట్లాడుతారు, మూర్ఖులు వాదిస్తారు.




## జనధన్ యోజన:
# త్రిముఖ విప్లవం



**అరుణ్ జైట్లీ**
కేంద్ర ఆర్థిక మంత్రి

మూడేళ్ల కిందట ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేదలకు ఆర్థిక సహాయం అందించడానికి ఉద్దేశించిన జన్‌ధన్ యోజన ప్రారంభించారు. దీని ద్వారా పేదలకు బ్యాంకు ఖాతా, ఎలక్ట్రానిక్ పద్ధతిలో డబ్బు చెల్లించే అవకాశం దక్కింది. పేదలు రుణాలు తీసుకోవడానికి, బీమా సౌకర్యం పొందడానికి కూడా వీలు కలిగింది. ఈ పథకం దృక్పథం చాలా విశాలమైంది. ఆర్థిక, డిజిటల్ సదుపాయాలు అందుబాటులో లేని వారికి ఆ సౌకర్యం కల్పించడానికి ఉద్దేశించింది. దీంతో పేదలు ఆర్థిక సమస్యల నుంచి విముక్తం కావడమే కాదు సామాజిక జనజీవన స్రవంతిలో కలిసే అవకాశం దక్కింది. మూడేళ్ల తర్వాత ఈ పథకం అనేక కోణాల్లో బ్రహ్మాండమైన విజయం సాధించింది.

పేదలను ఆర్థిక వ్యవహారాల్లో భాగస్వాములను చేయడంతో పాటు వారికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ప్రమాద బీమా సౌకర్యం కూడా లభిస్తుంది. 2017 ఆగస్టు 7 నాటికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద 3.46 కోట్ల మందికి బీమా సదుపాయం కలిగింది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 10.96 కోట్ల మందికి ఈ సదుపాయం సమకూరింది. ఈ రెండు పథకాల్లో లబ్ధి పొందిన వారిలో మహిళలు 40 శాతం మంది ఉన్నారు. 2014 మార్చి నాటికి మొత్తం పొదుపు ఖాతాల్లో మహిళల వాటా 28 శాతం మాత్రమే. మహిళలకు 33.69 కోట్ల ఖాతాలు మాత్రమే ఉండేవి. 40 పెద్ద బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులలో ఉన్న సమాచారం ప్రకారం 2017 మార్చి నాటికి మహిళల ఖాతాలు 40 శాతానికి చేరాయి. ఇందులో జన్‌ధన్ కింద మహిళలు తెరిచిన బ్యాంకు ఖాతాలు 14.49 కోట్లు. ఇప్పుడు మహిళల ఖాతాల సంఖ్య 43.65 కోట్లకు చేరింది.

జన్‌ధన్ యోజన ముద్ర యోజనకు అవకాశం కల్పించింది. 2017 ఆగస్టు 18 నాటికి 8.77 కోట్ల మందికి రూ.3.36 కోట్ల రుణం అందింది. ఈ డబ్బు అంతా వారి బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లింది. ఇది "జాం" విప్లవానికి దారి తీశాయి. ప్రధాన ఆర్థిక సలహాదారు కల్పించిన "జాం" అనే మాట విప్లవాత్మకమైంది. దీని కింద ఆర్థిక భాగస్వామ్యం, ఆధార్, మొబైల్ టెలికమ్యూనికేషన్ సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం 52.4 ఆధార్ కార్డులు 73.62 బ్యాంకు ఖాతాలకు అనుసంధానమై ఉన్నాయి. దీని వల్ల పేదలు ఎలక్ట్రానిక్ పద్ధతిలో డబ్బు చెల్లించగలుగుతున్నారు.

అన్నింటికన్నా మించి ప్రభుత్వం 35 కోట్ల మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి ఏటా రూ.74,000 కోట్లు జమ చేస్తోంది. అంటే ప్రతి నెలా రూ.6,000 కోట్ల కన్నా ఎక్కువగా జమ అవుతోంది. పహల్, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం, వృద్ధాప్య పింఛన్లు, విద్యార్థుల ఉపకార వేతనాల వంటి పేదరిక నిర్మూలన పథకాల కోసం ఈ డబ్బు బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు.

ఇప్పుడు భీం ఆప్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లాంటివి అమలులోకి రావడంతో "జాం" పూర్తిగా అమలవుతుంది. భారతీయులందరూ, ముఖ్యంగా పేదలు డిజిటల్ ప్రధాన స్రవంతిలో కలవడానికి సురక్షితమైన, అపరిమిత మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. "జాం" సామాజిక విప్లవం వల్ల ప్రభుత్వానికి, ఆర్థిక వ్యవస్థకు, ప్రధానంగా పేదలకు ప్రయోజనం చేకూరుతుంది. పేదలకు ఆర్థిక సేవలు అంది జీవితానికి భరోసా లభిస్తుంది. హఠాత్తుగా ఎదురయ్యే ఇబ్బందుల నుంచి తప్పించుకోవచ్చు. సబ్సీడీ భారం తగ్గినందువల్ల ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థకు మేలు కలుగుతుంది. పౌరులకు వేగంగా, సులభంగా నిధులు అందజేయవచ్చు. ఇందులో దుర్వినియోగానికి తక్కువ అవకాశం ఉంటుంది. దేశంలో వంద కోట్ల ఆధార్ కార్డులు వంద కోట్ల బ్యాంకు ఖాతాలతో అనుసంధానం అవుతాయి. వంద కోట్ల మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వస్తాయి. దీంతో మొత్తం దేశమంతా డిజిటల్ ఎకానమీలో భాగం అవుతుంది. జీఎస్టీ వల్ల ఒకే పన్ను అమలులోకి వచ్చినట్టే "జాం" విప్లవం మొత్తం భారతీయులందరితో అనుసంధానం అవుతుంది. ఏ భారతీయుడూ ప్రధాన స్రవంతికి దూరంగా ఉండలేదు. ఇది సామాజిక విప్లవం.■

**1.** 2015 జనవరిలో జన్‌ధన్ యోజన కింద పేదలకు 12.55 కోట్ల బ్యాంకు ఖాతాలు ఉంటే 2017 ఆగస్టు 16 నాటికి అవి 29.52 కోట్లకు చేరాయి.

**2.** 2015 జనవరిలో గ్రామీణ ప్రాంతాలలో 7.54 కోట్ల జనధన్ ఖాతాలు ఉండగా 2017 ఆగస్టు 16 నాటికి వీటి సంఖ్య 17.64 కోట్లకు పెరిగింది.

**3.** 2015 జనవరిలో 11.08 కోట్ల రూపే కార్డులు జారీ అయితే అవి 2017 ఆగస్టు 16 నాటికి 22.71 కోట్లకు చేరాయి.

**4.** 2015 జనవరిలో ఈ ఖాతాల్లో రూ.65,844.68 కోట్లు నిలవ ఉంది. 2015 జనవరిలో ఒక్కో ఖాతాలో సగటున రూ.837 నిలవ ఉంటే 2017 ఆగస్టు 16 నాటికి అది రూ.2231కి పెరిగింది.

**5.** జన్‌ధన్ ఖాతాల్లో డబ్బు నిలవలేని ఖాతాలు 76.81 శాతం ఉంటే ఇప్పుడు 21.41 శాతానికి తగ్గింది.

**6.** 2014 మార్చి నాటికి మొత్తం పొదుపు ఖాతాల్లో మహిళల వాటా 28 శాతం మాత్రమే. 2017 మార్చి నాటికి మహిళల ఖాతాలు 40 శాతానికి చేరాయి. ఇందులో జనధన్ కింద మహిళలు తెరిచిన బ్యాంకు ఖాతాలు 14.49 కోట్లు.

మనమాట

# ఎన్డీఏ విధానానికి సరిపోలే తీర్పు

వ్యక్తిగత గోప్యతపై ఆగస్టు 24 సుప్రీంకోర్టు తీర్పు ఆహ్వానించదగింది. ఈ తీర్పు ప్రాథమిక హక్కులను, వ్యక్తిగత స్వేచ్ఛను సుదృఢం చేస్తుంది. మా ప్రభుత్వం అందరినీ, ముఖ్యంగా పేదలను సామాజికంగా సమానంగా చూస్తుంది. సుప్రీంకోర్టు తీర్పు మా వైఖరికి, ప్రభుత్వ విధానానికి అనుగుణంగానే ఉంది. కానీ కొందరి దుష్ప్రచారాన్ని బయటపెట్టవలసిన అవసరం ఉంది. వ్యక్తిగత గోప్యత గురించి ఇప్పుడు మహోపన్యాసాలు చేస్తున్న వారు ఇంతకాలం పటిష్టమైన గోప్యతా విధానాన్ని రూపొందించనే లేదు. ఆధార్ గురించి వ్యాఖ్యలు చేస్తున్న వారే దానికి చట్ట ప్రతిపత్తి కల్పించలేదు.

ఈ తీర్పు వెలువరించిన న్యాయమూర్తులలో ఒకరు తమ తీర్పులో "ఎ.డి.ఎం. జబల్‌పూర్ కేసును తోసిపుచ్చాలన్న వాదనతో నేను ఏకీభవిస్తున్నాను. ఆ తీర్పు మన రాజ్యాంగ న్యాయ నిర్ణయంలో ఓ మాయని మచ్చ. ఆ వైఖరిని పది అడుగుల లోతున పాతి పెట్టాలి. మళ్లీ అది తలెత్తడానికి వీలు ఉండకూడదు." అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ గుండెల్లో హెచ్చరిక గంటలు మోగించాలి. ఆ పార్టీలో ఉన్న ప్రసిద్ధ న్యాయవాదులు తమ అధిష్టానానికి ఈ విషయాన్ని వివరించి చెప్పాలని భావిస్తున్నాను. మనం ఎంత దూరం ప్రయాణించామో కూడా సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఎమర్జెన్సీ విధించి కోట్లాది మంది ప్రజల జీవించే హక్కును, స్వేచ్ఛను హరించిన కాంగ్రెస్... తామే ప్రాథమిక హక్కుల పరిరక్షకులం అన్నట్టుగా బిల్డప్ ఇస్తున్నారు. ఇంటర్నెట్‌లో సెన్సార్ పద్ధతిని అమలు చేయడానికి సెక్షన్ 66ను తీసుకొచ్చిన వారు స్వేచ్ఛ, హక్కుల గురించి మాట్లాడుతున్నారు. సదరు న్యాయమూర్తి చెప్పిన "వ్యక్తిగత గోప్యతా హక్కుపై సందిగ్ధతకు తావు లేకుండా భారత రాజ్యాంగంలోని మూడవ భాగంలో చెప్పినట్టు ప్రాథమిక హక్కు కావాలి. అయితే హేతుబద్ధమైన నియంత్రణలు ఉండాలి. ఇదే ప్రస్తుత అవసరం. పాత విధానాలు కొత్త

**అమిత్ షా**
**బిజెపి జాతీయ అధ్యక్షుడు**



పద్ధతులకు దారి ఇస్తాయి," ఈ మాటలు భవిష్యత్తుకు బాటలు వేస్తాయి.

వ్యక్తిగత గోప్యత నిర్బంధమైంది కాదని కూడా సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది. ఇది కూడా ప్రభుత్వ వైఖరికి అనుగుణంగానే ఉంది. అరుణ్ జైట్లీ పార్లమెంటు వేదికగా మాట్లాడుతూ "వ్యక్తిగత గోప్యత ప్రాథమికమైంది.. అవునా.. కాదా? ఇవి వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు

**గోప్యత అంటే సమాచారాన్ని దాచిపెట్టడం, అనామకత్వం అంటే వ్యక్తిగతమైన దాన్ని దాచడం. ఒక వ్యక్తి వైద్య సంబంధ రికార్డులను అనధికారికంగా అందజేయడం వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించడమే. కాని ఆరోగ్యానికి సంబంధించిన ఈ సమాచారాన్ని వినియోగించుకుని ప్రభుత్వం ప్రజారోగ్య విధానాలను రూపొందించవచ్చు. మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలకుండా చర్య తీసుకోవచ్చు.**

కాదనడానికి అనువైన రోజులు కావు. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అని నేను భావిస్తున్నాను. గోప్యతా హక్కుని ప్రాథమిక హక్కుల్లో ఎక్కడ ఇముడుస్తారు? అందుకే ప్రతిపాదించిన ఈ సవరణలపై అనుమానాలను నివృత్తి చేయాలనుకుంటున్నాను. గోప్యత వ్యక్తి స్వేచ్ఛలో భాగం అని ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు." అని అన్నారు.

దీనిపై మరో న్యాయమూర్తి మాట్లాడుతూ "జాతీయ భద్రత మాట అటుంచి సమాచారం సేకరించడానికి ప్రభుత్వం ప్రయత్నించడం సబబే. సంక్షేమ రాజ్యంలో ప్రభుత్వం పేదలు, ఏ ఆధారమూ లేని వారి అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తూ ఉంటుంది. అందువల్ల అనర్హులైన వారికి ప్రజాధనం అందకుండా చూడాల్సిన అవసరం ఉంది. మానవాభివృద్ధికి కేటాయించే నిధులు పక్కదారి పట్టకుండా చూడాల్సిన అవసరం ఉంది. అందవలసిన వారికి నిధులు అందేట్టు చూడడానికి ప్రభుత్వం సమాచారం సేకరించడం సరైందే. అయితే ప్రభుత్వం సేకరించిన సమాచారం ప్రయోజనకరమైన విషయాలకు మాత్రమే ఉపయోగపడాలి. అనధికారికంగా ఇతరేతర ప్రయోజనాలకు వినియోగించకూడదు. అలా అయితేనే ప్రభుత్వ ప్రయోజనం నెరవేరి గోప్యతకు భంగం కలగకుండా ఉంటుంది. నేరాలను దర్యాప్తు చేయడం, నిరోధించడం, ప్రభుత్వ ఆదాయాన్ని పరిరక్షించడం ప్రభుత్వానికి ఉండే ఉద్దేశాలు. సంక్షేమ రాజ్యంలో డిజిటల్ పద్ధతులు చాలా కీలకమైనవి. సరైన పద్ధతుల్లో వినియోగించుకుంటే సమాచార సాంకేతికత శక్తిమంతమైన ఉపకరణంగా పని చేస్తుంది. వినూత్నమైన విజ్ఞానం అందడానికి తోడ్పడుతుంది." అని అన్నారు. ఈ మాటలు కూడా నిధులు పక్క దారి పట్టకూడదన్న ప్రభుత్వ విధానానికి అనుగుణంగానే ఉన్నాయి.

గోప్యత అంటే సమాచారాన్ని దాచిపెట్టడం, అనామకత్వం అంటే వ్యక్తిగతమైన దాన్ని దాచడం. ఒక వ్యక్తి వైద్య సంబంధ రికార్డులను అనధికారికంగా అందజేయడం వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించడమే. కాని ఆరోగ్యానికి సంబంధించిన ఈ సమాచారాన్ని వినియోగించుకుని ప్రభుత్వం ప్రజారోగ్య విధానాలను రూపొందించవచ్చు. మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలకుండా చర్య తీసుకోవచ్చు. ఒక వ్యక్తిని ప్రభుత్వం అనామకంగా ఉంచేయడం అంటే ప్రజారోగ్య పరిరక్షణకు, రాజ్య ప్రయోజనాల పరిరక్షణకు వినియోగించుకోవడమే. తన దగ్గరున్న సమాచారం ఆధారంగా ప్రభుత్వం విధానాలను రూపొందించవచ్చు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.ఎన్.కృష్ణ నాయకత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం న్యాయస్థానానికి తెలియజేసింది. న్యాయస్థానం ఈ తీర్పును దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో సముచిత చర్య తీసుకోవచ్చు.■



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. - దీన్‌దయాళ్జీ



# మోదీ క్యాబినెట్‌లో కొత్త ముఖాలు

కేంద్ర మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముద్ర స్పష్టంగా కనిపించింది. కేంద్ర మంత్రి మండలిలో కొత్తగా తొమ్మిదిమందికి చోటు దక్కింది. అదనపు బాధ్యతల భారం మోస్తున్నవారికి ఉపశమనం లభించింది. ఏ సభలోనూ సభ్యులుగా లేని ముగ్గురు అనుభవశీలుల్ని నేరుగా మంత్రిమండలిలోకి తీసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిమండలిని విస్తరించడం ఇది మూడో సారి. త్వరలో ఎన్నికలు జరగబోతున్న కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లకు చెందిన నేతలకు కేబినెట్‌లో చోటు దక్కింది. సెప్టెంబర్ 3న రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నూతన మంత్రుల చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇంతవరకు వాణిజ్యశాఖ సహాయ మంత్రిగా స్వతంత్ర హోదాలో ఉన్న నిర్మలా సీతారామన్‌కు కేబినెట్ మంత్రిగా పదోన్నతి కల్పించడంతో పాటు కీలకమైన రక్షణశాఖను అప్పగించారు. ఇందిరాగాంధీ తర్వాత రక్షణశాఖను ఒక మహిళ చేపట్టడం ఇదే ప్రథమం. పూర్తిస్థాయి మంత్రిగా ఆ శాఖను చూసే తొలి మహిళ నిర్మలే కానున్నారు. కీలకమైన భద్రతపై కేబినెట్ కమిటీలో సభ్యురాలిగానూ ఉంటారు. ఆ కమిటీలో ప్రధాని, హో మంత్రి, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి, ఆర్థిక మంత్రి ఉంటారు.

రైల్వే మంత్రిత్వ శాఖను పీయూష్ గోయల్‌కు అప్పగించారు. దాంతోపాటు బొగ్గు శాఖనూ ఆయనకే ఇచ్చారు. విద్యుత్తు శాఖలో కనబరిచిన మంచి పనితీరుకు గానూ గోయల్ గుర్తింపు పొందారు. ఇంతవరకు రైల్వేను చూసిన సురేశ్ ప్రభును పరిశ్రమలు-వాణిజ్య శాఖకు మార్చారు. మొత్తం మీద నిర్మలతో పాటు గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ... ఈ నలుగురికీ పదోన్నతులు లభించినట్లయింది. చమురు-ఇంధన శాఖను ప్రధాన్, మైనారిటీ వ్యవహారాల శాఖను నఖ్వీ చూస్తారు. ప్రధాన్‌కు నైపుణ్యాభివృద్ధి శాఖనూ అదనపు బాధ్యతగా కట్టబెట్టారు. ఉమాభారతిని తాగునీరు, పారిశుద్ధ్య శాఖ మంత్రిగా ఉంటారు. జల వనరులు, నదుల అభివృద్ధి, గంగానది ప్రక్షాళన బాధ్యతల్ని నితిన్ గడ్కరీకి అప్పగించారు. పనితీరు పరంగా మంచి పేరు తెచ్చుకున్న గడ్కరీ వద్దనే రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖనూ ఉంచారు. అనిల్ దవే మరణంతో పర్యావరణ మంత్రిత్వశాఖ బాధ్యతలూ చూస్తున్న కేబినెట్ మంత్రి హర్షవర్ధన్ ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఎన్నికయ్యాక సమాచార-ప్రసార మంత్రిత్వశాఖనూ అదనపు బాధ్యతగా చూస్తున్న స్మృతి ఇరానీ వద్ద ఆ శాఖల్ని అలాగే ఉంచారు.

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ముగ్గురు మాజీ ప్రభుత్వాధికారులకు ప్రధాని పెద్దపీట వేశారు. కీలకమైన శాఖలకు స్వతంత్ర హోదాలో సహాయ మంత్రులుగా వారిని నియమించి, పాలనా దక్షతను గుర్తించారు. మాజీ దౌత్యాధికారి హర్‌దీప్ పూరికి గృహనిర్మాణ-పట్టణాభివృద్ధి శాఖ, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆల్ఫాన్స్ కన్నన్‌థానమ్‌కు పర్యాటకశాఖ అప్పగించారు. దీంతో కేరళకు ఎన్డీఏ మంత్రివర్గంలో చోటు దక్కినట్లయింది. కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి ఆర్.కె.సింగ్‌కు విద్యుత్తు-నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖను ఇచ్చారు. ముంబయి మాజీ పోలీసు కమిషనర్ సత్యపాల్‌సింగ్‌ను మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయమంత్రిగా నియమించారు. జలవనరులు, గంగా ప్రక్షాళన శాఖకూ ఆయన సహాయమంత్రిగా ఉంటారు. క్రీడల శాఖ మంత్రిగా విజయ్ గోయల్ స్థానంలో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ నియమితులయ్యారు. సమాచార-ప్రసార శాఖ సహాయమంత్రిగానూ ఆయన కొనసాగుతారు. ఇదివరకు స్వతంత్ర హోదాలో సహాయమంత్రిగా ఉన్న గోయల్‌ను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ, గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ సహాయమంత్రిగా మార్చారు.

కొత్తగా మంత్రివర్గంలో చేరిన శివ్‌ప్రసాద్ శుక్లాను ఆర్థిక శాఖ సహాయమంత్రిగా అర్జున్‌రామ్ మేఘవాల్ స్థానంలో నియమించారు. మేఘ్‌వాల్‌ను పార్లమెంటరీ వ్యవహారాల శాఖకు మార్చారు. అశ్విని కుమార్ చౌబేను ఆరోగ్య శాఖ సహాయ మంత్రిగా, వీరేంద్ర కుమార్‌ను మహిళా-శిశు అభివృద్ధి సహాయ మంత్రిగా నియమించారు. అనంత్‌కుమార్ హెగ్డేను నైపుణ్యాభివృద్ధి శాఖకు, గజేంద్ర సింగ్ షెకావత్‌ను వ్యవసాయ శాఖకు సహాయ మంత్రులుగా నియమించారు. సంతోష్‌కుమార్ గాంగ్వార్‌కు పదోన్నతి కల్పించి కార్మిక-ఉపాధి కల్పన శాఖను స్వతంత్ర హోదాతో అప్పగించారు. గిరిరాజ్‌సింగ్‌ను కూడా ఇదే విధంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖకు నియమించారు. తాజా మార్పులతో కేంద్ర మంత్రిమండలిలో మంత్రుల సంఖ్య 73 నుంచి 76కి పెరిగింది. రాజీవ్ ప్రతాప్ రూడీ, కల్‌రాజ్ మిశ్ర, బండారు దత్తాత్రేయ, సంజీవ్‌కుమార్ బల్యాన్, ఫగ్గన్‌సింగ్ కులస్తే, మహేంద్రనాథ్ పాండేలు కేబినెట్ విస్తరణకు ముందే రాజీనామా చేశారు.

**-జనసందేశ్ ప్రతినిధి**




# పరిశుభ్రతకు ప్రతీకలుగా పండుగలు జరుపుకొందాం!



**మనదేశంలో పడుగలను పరిశుభ్రతకు ప్రతీకలుగా జరపుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 27న ఆకాశవాణి 'మన్ కీ బాత్' (మనసులో మాట)లో ప్రసంగిస్తూ అనేక అంశాలను ప్రస్తావించారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, జన్‌ధన్ విజయాలు, స్పోర్ట్ టాలెంట్ సెర్చ్ పోర్టల్ తదితర అంశాలపై తన అభిప్రాయాలను దేశ ప్రజలతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తావించాలంటూ ప్రజలత వచ్చిన సూచనలను సైతం చదివి వినిపించారు. ఈ ప్రసంగంలోని ముఖ్యాంశాలను ప్రధాని మాటల్లోనే చూద్దాం.**

☞ నా ప్రియమైన దేశవాసులారా, సాదర నమస్కారం! "అహింసా పరమో ధర్మః" దీనిని మనం చిన్నప్పటి నుండీ వింటూ వచ్చాం.. చెప్తూ వచ్చాం. విశ్వాసాల పేరుతో హింసను సహించేది లేదని ఎర్రకోట ప్రసంగంలోనూ చెప్పాను. అది సంప్రదాయపరమైన విశ్వాసం అయినా సరే, రాజకీయ ఆలోచనా ధోరణి తాలూకూ విశ్వాసం అయినా సరే, ఒక వ్యక్తి పట్ల ఉన్న విశ్వాసం అయినా సరే, వారసత్వపరమైన విశ్వాసం అయినా సరే.. విశ్వాసాల పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అధికారం ఎవరికీ లేదు. డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు ఇచ్చిన రాజ్యాంగం ప్రకారం, ప్రతి వ్యక్తికీ న్యాయం పొందేందుకు అన్ని రకాల ఏర్పాట్లూ ఉన్నాయి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారు, హింసామార్గంలో పయనించేవారు ఎవరినైనా సరే- వారు వ్యక్తి అయినా, గుంపు అయినా, ఈ దేశం సహించదు. ఏ ప్రభుత్వమూ సహించదు.

☞ మనదేశంలో వైవిధ్యాలు ఆహారం, జీవనశైలి, వస్త్రధారణ వరకే పరిమితం కాదు. జీవితంలో ప్రతి విషయంలోనూ కనిపిస్తాయి. మన పండుగలు కూడా భిన్నంగా ఉన్నాయి. ఏడాదిలో ఏదో ఒక్కరోజు ఏ పండుగతోనూ ముడిపడని రోజు ఉంటుందేమో. మన పండుగలన్నీ కూడా ప్రకృతిపరంగా కాలానుగుణంగా వస్తుంటాయి.

☞ గణేశ చతుర్థి సంగతి వచ్చినప్పుడు బహిరంగ గణేశోత్సవాల విషయం రావడం సాధారణమే. బాలగంగాధర తిలక్ 125 ఏళ్ళ క్రితం ఈ సంప్రదాయానికి జన్మనిచ్చారు. గత 125 ఏళ్ల క్రితం అవి స్వాతంత్ర్యోద్యమానికి ప్రతీకగా ఉండేవి. స్వాతంత్రం తరువాత అవి సమాజ శిక్షణ, సామాజిక చైతన్యాన్ని మేల్కొలపడానికి ప్రతీకగా నిలిచాయి. గణేశ చతుర్థి పండుగ పదిరోజుల వరకూ చేస్తారు. ఈ పండుగని ఏకత్వం, సమానత, పరిశుభ్రతలకు ప్రతీకగా చెప్తారు.

☞ అన్నిచోట్లా పర్యావరణానికి అనుకూలమైన మట్టి గణపతి ఉద్యమం మొదలైంది. మీరు యూట్యూబ్‌లో గనుక చూస్తే, ప్రతి ఇంట్లోనూ పిల్లలు మట్టిగణపతిని తయారుచేసి దానికి రంగులు అద్దుతున్నారు. కొందరు కూరగాయల రంగులు అద్దితే, కొందరు రంగురంగుల కాగితం ముక్కలు అంటిస్తున్నారు. దగ్గరదగ్గర ఈ ప్రయోగాన్ని అన్ని కుటుంబాలూ చేస్తున్నాయి.

☞ భారతదేశంలోని రంగురంగుల పండుగలలో కేరళకు చెందిన ఓనమ్ ప్రముఖమైన పండుగ. ఈ పండుగ సామాజిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను తెలుపుతుంది. గుజరాత్‌లో నవరాత్రి ఉత్సవాలు, బెంగాల్‌లో దుర్గా పూజ ఉత్సవాలు పర్యాటక శాఖ ఆకర్షణలుగా మారిపోయాయి. మన ఇతర పండుగలు కూడా విదేశీయులను ఆకర్షించడానికి ఉపయోగపడతాయి. నవభారతదేశంలో పండుగలను పరిశుభ్రతకు ప్రతీకలుగా తయారు చెయ్యాలి. దీనిని సామాజిక అలవాటుగా మార్చడం ముఖ్యం. శుభ్రత అంటే కేవలం ఇంట్లో అని మాత్రమే కాదు. మొత్తం గ్రామంలో, నగరంలో, పట్టణంలో, రాష్ట్రంలో, మన దేశంలో శుభ్రత, పరిశుభ్రతని పండుగలలో ఒక ముఖ్యమైన భాగంగా చెయ్యాలి.

☞ మూడేళ్ళ క్రితం నేను పరిశుభ్రత ఉద్యమం మొదలుపెట్టాను. దీనికి వచ్చే అక్టోబర్ 2 నాటికి మూడేళ్ళు పూర్తవుతాయి. ఈ ఉద్యమం తాలూకూ అనుకూల పరిణామాలు కనబడుతున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణాలు 39 శాతం నుండి 67 శాతానికి చేరాయి. రెండు లక్షల ముప్పైవేల కన్నా అధికంగా పల్లెలు, బహిరంగ మలమూత్ర విసర్జన నుండి విముక్తులమయ్యామని ప్రకటించాయి.

☞ ఆ మధ్య గుజరాత్‌లో భయంకరమైన వరదలు వచ్చాయి. చాలామంది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. వరద నీరు ఇంకిపోయిన తర్వాత చాలా దుర్గంధం వ్యాపించింది. ఇలాంటి సమయంలో గుజరాత్‌లోని బనాస్కాంతా జిల్లాలో ధానేరాలో, జమీయత్ ఉలేమా-ఎ-హింద్ కార్యకర్తలు వరద ప్రభావిత ఇరవై రెండు గుడులను, మూడు మసీదులను దశలవారీగా శుభ్రపరిచారు. తమ చెమటను చిందించి అందరినీ రక్షించారు. పరిశుభ్రత పాటించడానికి ఐక్యత ఎంత అవసరమో జమీయత్ ఉలేమా-ఎ-హింద్ కార్యకర్తలు చూపెట్టారు. ఇలాంటి సంఘటనలు మనకు ప్రేరణను అందిస్తాయి.

☞ అక్టోబర్ 2న గాంధీ జయంతిని 'పారిశుధ్య అక్టోబర్ 2'గా జరుపుకోవాలనే సంకల్పాన్ని చేసుకోమని మరోసారి మీ అందరికీ చెప్పాలనుకుంటున్నాను. అందుకోసం సెప్టెంబర్ 15 నుండీ 'పారిశుధ్య సేవ' మంత్రాన్ని ఇంటింటికీ చేర్చండి. పరిశుభ్రత కోసం ఏదో ఒక అడుగు వెయ్యండి. స్వయంగా పరిశ్రమించి ఈ ప్రచారంలో ఒక భాగమవ్వండి.




☞ మన ఇంటి చుట్టుపక్కల ఎవరైనా సామానులు అమ్మేవారు , తోపుడు బళ్ళ వారు, చిన్న దుకాణదారుడో, కూరగాయలు అమ్మేవారో మన పని కోసం వచ్చినప్పుడు, ఎప్పుడైనా ఆటో డ్రైవర్‌తో పని పడినప్పుడు వారికి ఇవ్వాల్సిన ధర విషయమై బేరసారాలు చేస్తాం. అదే మనం ఏదైనా రెస్టారెంట్‌కు భోజనానికి వెళ్తే బిల్లు కూడా చూడకుండా డబ్బులు తీసి ఇచ్చేస్తాము. షోరూమ్‌లో చీర కొనడానికి వెళ్తే బేరాలాడం కానీ ఎవరైనా పేదవారితో పని వస్తే మాత్రం బేరాలాడ కుండా అస్సలు ఉండలేం. పేదవాడు ఏమనుకుంటాడో అని మీరెప్పుడైనా ఆలోచించారా? ప్రశ్న రెండు రూపాయిలదో, ఐదు రూపాయిలదో కాదు. పేదవాడి మనసుకు కలిగిన కష్టానిది. వాళ్ళు పేదవారు కాబట్టి మీరు వారి నిజాయితీని అనుమానించారని వాళ్లు బాధపడతారు.

☞ క్రీడామంత్రిత్వశాఖ క్రీడా ప్రతిభను వెతికి, సానబట్టడం కోసం ఒక స్పోర్ట్స్ టాలెంట్ సెర్చ్ పోర్టల్‌ను తయారు చేసింది. దేశం మొత్తంలో క్రీడారంగంలో ప్రతిభ గల పిల్లలు ఎక్కడ ఉన్నా, క్రీడారంగంలో వాళ్ళు సాధించిన విజయాలు ఈ పోర్టల్‌లో బయోడేటాతో సహా లేదా వీడియోను అప్లోడ్ చేయవచ్చు. ఎంచుకున్న ఔత్సాహిక క్రీడాకారులకు క్రీడా మంత్రిత్వశాఖ శిక్షణ అందిస్తుంది. మన క్రీడాకారులకు సంతోషకరమైన వార్త ఏమిటంటే, భారతదేశంలో అక్టోబర్ 6 నుండీ 28 వరకూ, ఫీఫా అండర్ 17 ప్రపంచ కప్ మొదలవబోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇరవై నాలుగు టీమ్‌లు భారతదేశాన్ని తమ నివాసంగా మార్చుకోనున్నాయి.

☞ 'ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన' భారతదేశంలోనే కాక ప్రపంచం మొత్తం ఆర్థిక పండితులకు చర్చానీయాంశమైంది. 2014, ఆగస్టు 28న నా మనసులోని ఒక కలతో ఈ ప్రచారాన్ని ప్రారంభించాను. ముప్పై కోట్ల కొత్త కుటుంబాలను దీంతో జతపరిచాం, బ్యాంక్ ఖాతాలు తెరిచాం. ఈ సంఖ్య ప్రపంచంలో ఎన్నో దేశాల జనాభా కంటే ఎక్కువ. మూడేళ్ళ లోపే సమాజంలోని ఆఖరి మెట్టుపై కూచుని ఉన్న నా పేద సోదరుడు కూడా దేశ ఆర్థిక వ్యవస్థ తాలూకూ ముఖ్యధారలో భాగస్థుడయ్యాడు. అతడి అలవాటు మారింది. అతడు బ్యాంక్‌కు వెళ్ళివస్తున్నాడు. డబ్బుని ఆదా చేస్తున్నాడు. డబ్బు ఉండటం వల్ల సురక్షితంగా ఉండగలుగుతున్నాడు. పేదవాడు ఇప్పుడు తన జేబులోని రుపే కార్డ్‌ని చూసుకుని, ధనవంతులతో సమానంగా తనను తాను చూసుకుంటున్నాడు. వాళ్ల జేబుల్లో క్రెడిట్ కార్డ్ ఉంటే, నా జేబులో రుపే కార్డ్ ఉంది అని సంతృప్తి పడుతున్నాడు. అది గౌరవంగా భావిస్తున్నాడు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనలో దాదాపు 65 వేల కోట్ల రూపాయిలు బ్యాంకుల్లో జమ అయ్యింది. ఒకరకంగా ఇది పేదలు ఆదా చేసిన సొమ్ము. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ద్వారా ఎవరి ఖాతాలయితే ఏర్పడ్డాయో, వారికి బీమా ప్రయోజనమూ లభించింది.

☞ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకం, ప్రధానమంత్రి సురక్షా బీమా పథకం పేదవారికి జీవితంలో కొత్త నమ్మకాన్ని అందిస్తోంది. చాలా కుటుంబాల్లో ఒక రూపాయి బీమా కారణంగా పేదవాడికి ఆపద వచ్చినప్పుడు, కుటుంబంలో ముఖ్యవ్యక్తి మరణిస్తే, కొద్ది రోజుల్లోనే వారికి రెండు లక్షల రూపాయిలు లభిస్తాయి.

☞ దళితులైనా, గిరిజనులైనా, మహిళలైనా,చదువుకున్న యువకుడైనా, తన కాళ్ళపై తాను నిలబడి ఏదన్నా చెయ్యాలనుకునే యువకుడైనా ప్రధానమంత్రి ముద్రా పథకం, స్టార్టప్ పథకం, స్టాండప్ పథకం మొదలైన పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. కోటానుకోట్ల యువతకు ప్రధానమంత్రి ముద్రా పథకం ద్వారా బ్యాంకుల నుండి ఏ గ్యారెంటీ లేకుండానే రుణాలు అందేలా, వారు స్వయంగా తమ కాళ్లపై తాము నిలబడుతున్నారు. ఇంతే కాక, ప్రతి ఒక్కరూ మరొకరికి లేదా ఇద్దరికి ఉద్యోగాన్ని ఇచ్చే ప్రయత్నం చేశారు. గత కొద్ది రోజుల క్రితం బ్యాంకుల వారు నన్ను కలిశారు. జన్‌ధన్ యోజన, ఇన్సురెన్స్, రుపే కార్డ్, ప్రధానమంత్రి ముద్రా పథకం, తదితర పథకాలతో సామాన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరిందో, వారు సర్వే చేయించారు. వాటి వల్ల ప్రేరణాత్మకమైన సంఘటనలు వెలికివచ్చాయి. అలాంటి విషయాలను మై గౌ.ఇన్ లో అప్లోడ్ చెయ్యమని బ్యాంకులవారికి నేను కోరుతున్నాను.

**-జనసందేశ్ ప్రతినిధి**



ప్రతి హిందువూ హిందూ దేశ చరిత్ర చదివి తీరాలి. - మహాత్మాగాంధీ

భావ పరివర్తన చాలదు, హృదయ పరివర్తన కావాలి. - శ్రీ దత్తోపంత్ ఠెంగ్డే

ఏకాత్మత

# ప్రపంచానికి మనమేమీ తోడ్పడలేమా!

• శివరాం

పారిశ్రామిక విప్లవం, అంతర్జాతీయ వాణిజ్యం ఊపందుకోగా నూతన అధికార కేంద్రాలుగా ఎదిగి వచ్చిన వర్తక సముదాయాలకు, పురాతన రాజులు, భూస్వాములకు మధ్య ఉత్పన్నమైన విభేదాల ఫలితంగా ఐరోపా దేశాల్లో ఆవిర్భవించిన ప్రజాస్వామ్యం ఆమోదాన్ని పొందింది.

### దోపిడికి గురయిన వ్యక్తి

ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రతి వ్యక్తికీ ఒక ఓటు వచ్చింది. కాని వాస్తవిక అధికారం విప్లవాన్ని నడిపించిన వారిచేతుల్లోకే వెళ్ళింది. పారిశ్రామిక విప్లవంతో నూతన ఉత్పత్తి విధానాల పట్ల విశ్వాసం ఏర్పడింది. కార్మికులు తమ ఇళ్ళలో స్వేచ్ఛగా పని చేయడానికి బదులు కర్మాగారాల యజమానుల నుండి ఆర్డర్లు తీసుకుని కర్మాగారాల్లో పనిచేయడం ప్రారంభించారు. తమ సొంత ఊళ్ళు వదిలి రద్దీగా ఉండే నగరాలకు కార్మికులు వలస రాసాగారు. అక్కడ సరైన గృహ వసతి ఉండదు. కర్మాగారాల్లో కార్మికుడి రక్షణకు కనీస నియమాలుండవు. కార్మికుడు ఆర్థికంగా దుర్బలుడు. అయినా అసంఘటితుడు. కనుక అతను అన్యాయం, పీడన, దోపిడిలకు బలిపశువు అయ్యాడు.

కార్మికులను దోచుకుంటున్న వర్గాల చేతుల్లోనే రాజకీయాధికారం కూడా చిక్కియున్నందున ప్రభుత్వం నుండి కార్మికునికి ఉపశమనం లభించే ఆశే లేదు. ఈ పరిస్థితుల్లో సోషలిస్టులం అని చెప్పుకున్న కొద్దిమంది ఈ అన్యాయాన్ని నిరసిస్తూ కార్మికుల మేలు కోరి ఉద్యమాలు నడిపారు. అలాంటి వారిలో కారల్ మార్క్స్ ఒకరు. ఉద్యమాన్ని నడిపే కృషిలో మొత్తం చరిత్రను, నిర్మాణాన్ని అధ్యయనం చేసి, తనదైన విశ్లేషణను సమర్పిస్తూ తన సిద్ధాంతాలకు ఒక శాస్త్రీయ పునాది ఉన్నట్లు ఆయన చెప్పారు.

మార్క్స్ అనంతర కాలపు సోషలిస్టులు అందరూ ఆయన్ని ఆమోదించి ఉండకపోవచ్చు కాని ఆయన సిద్ధాంతాలతో మాత్రం అందరూ చాలావరకు ప్రభావితులయ్యారు.

### శ్రామిక నియంతృత్వం



మార్క్స్ ప్రవచించిన గతితార్కిక భౌతిక వాదం ప్రకారం ఉత్పత్తి సాధనాలు ప్రయివేటు యాజమాన్యం చేతిలో ఉండడమే దోపిడికి మూలకారణం. ఉత్పత్తి సాధనాలను సమాజ పరం (మార్క్స్ దృష్టిలో ప్రభుత్వ పరం) చేస్తే ఇక దోపిడి ఉండదు. అయితే దీనికన్నా ముందు దోపిడి శక్తుల నుండి ప్రభుత్వాన్ని విముక్తం చేసి, మరలా వారి ప్రభావానికి గురికాకుండా స్వాధీనం చేసుకు తీరాలి. దానికి శ్రామిక నియంతృత్వం తప్పనిసరి. ఆపైన దోపిడి వర్గం పూర్తిగా అంతమై, మళ్ళీ తలెత్తే అవకాశం మృగ్యం అయ్యాక ప్రభుత్వం రద్దయిపోయి అంతిమంగా వర్గ రహిత, రాజ్యవిహీన ఆదర్శ సమాజం అవతరిస్తుంది. పెట్టుబడిదారి విధానం అంతానికి కావలసిన బీజాలు దానిలోనే ఉన్నాయని విశదీకరించిన మార్క్స్ సామ్యవాదం అనివార్యం అని తేల్చారు.

కొన్ని ఐరోపా దేశాల్లో సామాజిక విప్లవం వచ్చింది. సామ్యవాదాన్ని ఆమోదించని చోట్ల కూడా రాజకీయ నాయకులు కార్మికుల హక్కులను ఆమోదించక తప్పలేదు. "సంక్షేమ రాజ్యం'' ఆదర్శ రాజ్యంగా ఆమోదం పొందింది. జాతీయత, ప్రజాస్వామ్యం, సామ్యవాదం లేదా సమానత్వం అనే ఈ మూడు సిద్ధాంతాలే ప్రధానంగా ఐరోపా దేశాల రాజకీయ సామాజిక ఆలోచనలను ప్రభావితం చేశాయి. వీటితో పాటు ప్రపంచ ఐక్యత, శాంతి ఆదర్శాలు కూడా రూపుదిద్దుకున్నాయి. మానవ జాతి ఉన్నత ఆకాంక్షలను ప్రతిఫలించే ఇవన్నీ మంచి ఆదర్శాలు. కాని ఈ సిద్ధాంతాల్లో ప్రతిదీ అసంపూర్ణమే కాక ఆచరణలో మిగిలిన వాటికి వ్యతిరేకం.

జాతీయత ప్రపంచ శాంతికి సమస్య ఔతుంది. పెట్టుబడిదారీతనం, ప్రజా స్వామ్యం చేతులు కలిపి స్వేచ్ఛగా దోచుకోడానికి అధికారం అప్పగిస్తాయి. సామ్యవాదం పెట్టుబడిదారీని తొలగిస్తూ, వ్యక్తిస్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకత తీసుకొస్తుంది.

పాశ్చాత్యులు ఇప్పుడీ మంచి సిద్ధాంతాల పునఃసమీక్షలో పడ్డారు. ఈ రోజువరకు వారీ పనిలో సఫలం కాలేదు. దేనికో దానికో మరోటికో ప్రాధాన్యతనిస్తూ ఈ సిద్ధాంతాల కలగలుపుల, సంయోగాల ప్రయోగాలు చేశారు.

ఇంగ్లాండు జాతీయత, ప్రజాస్వామ్యములకు ప్రాధాన్యతనిస్తూ తన రాజకీయ సామాజిక సంస్థలను అభివృద్ధి చేసుకున్నది. ఫ్రాన్సు దీన్ని స్వీకరించ లేక పోయింది. అక్కడ ప్రజాస్వామ్యం రాజకీయ అస్థిరతను చవిచూసింది. సామ్యవాదంతో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని బ్రిటన్‌లోని లేబర్ పార్టీ కోరింది. కాని సామ్యవాదం బలపడితే ప్రజాస్వామ్యం మనగలదా అని ప్రజలు సందేహాలు లేవనెత్తడంతో అది బలంగా సామ్యవాదాన్ని సమర్థించడం మానుకొంది. సామ్యవాదం మరింత పలచబడినప్పుడు హిట్లర్, ముస్సోలినీలు జాతీయ సామ్యవాదం పేర ప్రజాస్వామ్యాన్ని పాతిపెట్టారు. అంతిమంగా సామ్యవాదం వారి జాతీయవాదానికి పరికరమై ఆపైన ప్రపంచ ఐక్యత, శాంతికి సవాలు విసిరింది. మనకు మార్గదర్శకమైనదాన్ని పాశ్చాత్య ప్రపంచం నుండి ఎంచుకోవచ్చు. కాని దాని వద్ద స్పష్టమైన పటిష్టమైనదేదీ కనిపించడం లేదే! ఏది మంచిదో నిర్ణయించుకోలేని సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతూ పాశ్చాత్య ప్రపంచమే ఇప్పుడు నాలుగు రోడ్ల కూడలిలో ఉంది. ఈ పరిస్థితుల్లో పాశ్చాత్య ప్రపంచం నుండి మనకు మార్గదర్శనం లభిస్తుందని ఆశించలేం. దానికి బదులు సందిగ్ధావస్థలో నున్న ప్రపంచానికి మనం ఏమీ తోడ్పడలేమా అని మనం ఆలోచించాలి! ■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. - స్వామి వివేకానంద

స్ఫూర్తి

# బహు లక్షణ సమన్వితుడు

**బాపూరావు మోఘె దీన్‌దయాళ్ జయంతి ఉత్సవాల సందర్భంగా రాసిన వ్యాసం**



పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మేధోపరంగా, హృదయపరంగా అనేక లక్షణాల సమాహారం. నాకు ఆయనతో పరిచయం అయిన తర్వాత ఈ లక్షణాలలో మొట్టమొదట కనిపించింది భాషలు నేర్చుకోవడంలో ఆయనకు ఉన్న సామర్థ్యం, అనురక్తి.

### భాషానురక్తి

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కాన్‌పూర్‌లోని సనాతన ధర్మ కళాశాలలో చదువుతుండగా ఆయనతో నాకు పరిచయం అయింది. అప్పుడే జనసంఘ్‌తో కూడా పరిచయం అయింది. ఆ మరుసటి సంవత్సరం నాగపూర్‌లో వేసవి శిబిరం జరిగినప్పుడు మేమిద్దరం ఒకే గదిలో ఉన్నాం. అప్పుడు ఆయనకు మరాఠీ వచ్చేది కాదు. తాను మాట్లాడదలచుకున్న హిందీ వాక్యాన్ని మరాఠీలోకి అనువదించమని అడిగి ఆ భాషలో వ్యాకరణం నేర్చుకోవడానికి ప్రయత్నించే వారు. హిందీ పదాలకు మరాఠీ సమానార్థకాలు నేర్చుకునే వారు. ఈ వేసవి శిబిరం 40 రోజులపాటు జరిగితే 30 రోజులలో మరాఠీలో ఆయన సాధారణ విషయాలు గ్రహించారు. చివరి రెండు వారాల్లో ఆయన మరాఠీ పత్రికలు చదివే స్థాయికి చేరారు. ఆయన మరాఠీలో ధారాళంగా మాట్లాడగలిగేవారు కాదు గాని 1963లో 500 పేజీల డా॥ హెగ్డేవార్ జీవిత చరిత్రను హిందీలోకి అనువదించారు. ఆ అనువాదం స్వయంగా రాసినంత బాగా ఉంది. జనసంఘ్ కార్యక్రమాలలో భాగంగా దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లినప్పుడు రైల్వే స్టేషన్లలో బోర్డులు చదివి ఆ భాషల అక్షరాలు నేర్చుకున్నారు. ఆ రకంగా ఆయనకు భారతీయ భాషల అక్షరమాలలన్నీ తెలిసేవి. పెద్దగా కష్టపడకుండానే ఏ భాష అయినా నేర్చుకునే వారు.

### అద్భుతమైన మేధ

దీన్‌దయాళ్ జీ మేధస్సు అపారమైంది. ఆయన ఏ పరీక్ష రాసినా మొదటి స్థానంలో ఉండేవారు. కాని ఆయన పుస్తకాల పురుగు కాదు. జనవరి వరకు కళాశాలలో అన్ని కార్యక్రమాలలో పాల్గొనేవారు. అందరి గదులకు వెళ్లి వారితో ముచ్చటించే వారు. కళాశాలలో ఆయన జీరో అసోసియేషన్ స్థాపించారు. దీని లక్ష్యం వార్షిక పరీక్షలలో సున్నా మార్కులు తెచ్చుకోవడం. జనవరిలో చదవడం మొదలు పెట్టేవారు. రాత్రి హాస్టల్ గదుల్లో దీపాలు ఆర్పేవారు కనక చలిలో బయట లాంతర్ పెట్టుకుని 11 గంటల నుంచి తెల్లవారుజాము అయిదింటి వరకు చదివే వారు. ఒక్కోసారి ఏ లెక్క అయినా చేయలేకపోతే నిద్రలోనే చేసేసి లేచిన తర్వాత అది రాసేవారు. దీన్‌దయాళ్ జీ ఎవరి భావాలను వ్యతిరేకించేవారు కాదు. ఎవరి మనసు కష్టపెట్టే వారు కాదు. ఆయనకు మేనమామ అంటే ప్రాణం. దీన్‌దయాళ్‌ను పెంచింది ఆయనే. దీన్‌దయాళ్‌కు ఆయన పెళ్లి సంబంధాలు కూడా చూశారు. కాని పండిట్ జీ పెళ్లి చేసుకోదలుచుకోలేదు. మేనమామను నొప్పించదలచుకోలేదు. అందువల్ల అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడి తను వారికి నచ్చకుండా చేశారు.

### అపారమైన ఆత్మవిశ్వాసం

కాన్‌పూర్‌లో పట్టభద్ర స్థాయి పూర్తి చేసిన తర్వాత ఆగ్రాలో ఎంఏలో చేరారు. మొదటి సంవత్సరంలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుల య్యారు. రెండో సంవత్సరంలో ఉండగా ఆయన మేనమామ కూతురికి తీవ్రంగా జబ్బు చేసింది. ఆమెను ఏదైనా పర్వత ప్రాంతంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్తే తప్ప ఆమె ఆరోగ్యం బాగుపడదని డాక్టర్లు చెప్తే చదువు వదిలేసి ఆమెను ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ కాలక్షేపం కోసం ఓ పుస్తకాల దుకాణానికి వెళ్లారు. ప్రకృతి చికిత్సకు సంబంధించిన కొన్ని పుస్తకాలు కనిపించాయి. మేనమామ కూతురి జబ్బు నయం చేయడానికి ఎవరి సహాయమూ అక్కర లేదని ప్రకృతి చికిత్సతో నయం అవుతుందనుకున్నారు. కొన్న పుస్తకాలను, ఆరోగ్య కేంద్రంలో ఉన్న పుస్తకాలను చదివారు. "నీకు అభ్యంతరం లేకపోతే నేనే చికిత్స చేస్తాను" అని ఆమెకు చెప్పారు. "డాక్టర్లందరి వైద్యం ప్రయత్నించిన తర్వాత ఇప్పుడు నువ్వే డాక్టర్ అయిపోయినట్టున్నావు. నువ్వు చికిత్స చేస్తే నాకు అభ్యంతరం లేదు" అని అంగీకరించింది. డాక్టర్లు తగ్గించలేని రోగాన్ని ఆయన తగ్గించారు. అయితే ఆమె దీన్‌దయాళ్ జీ చెప్పినట్టు పథ్యం చేయనందువల్ల వ్యాధి తిరగబెట్టి ప్రాణాలు కోల్పోయింది. పుస్తకాలు చదివి ప్రకృతి చికిత్స చేయడంలో నైపుణ్యం సంపాదించడం ఆయన మేధాశక్తికి నిదర్శనం.

### త్యాగ నిరతి

మేనమామ కూతురు మరణించిన తర్వాత దీన్‌దయాళ్ ఎంఏ. వదిలేసి ప్రయాగలో ఎల్.టి. కోర్సులో చేరారు. అదే సమయంలో సంఘ్ ప్రచారక్ కావాలని నిర్ణయించుకున్నారు. ఎల్.టి. పరీక్ష పూర్తి అయిన తర్వాత సంఘ్ కార్యకలాపాల కోసం ఆయనను లఖింపూర్ జిల్లాలోని గోలా గోకర్ణనాథ్‌కు పంపించారు. స్థానికులతో సత్సంబధాలు ఏర్పరచుకున్నారు. ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి విద్యార్థుల అభిమానం సంపాదించారు. ఆయన అక్కడ ఎంత మంచి పేరు సంపాదించుకు న్నారంటే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉద్యోగ విరమణ చేస్తే ఆ స్థానం దీన్‌దయాళ్‌కు ఇవ్వాలన్న ప్రతిపాదన వచ్చింది. ఆయన అంత ఆసక్తి కనబరచకపోతే జీతం చాలదేమోనని

భావించి మూడు నాలుగు ఇంక్రిమెంట్లు ఇస్తామని చెప్పారు. ఈ మాట విన్న దీన్‌దయాళ్ "నా అవసరాలు చాలా పరిమితం. రెండు ధోవతులు, రెండు చొక్కాలు, రెండు పూటలా తిండి ఉంటే చాలు. దీనికి నాకు నెలకు రూ. 30 కన్నా ఎక్కువ అవసరం లేదు. మీరిచ్చే డబ్బు నేను ఏం చేసుకోవాలి?" అన్నారు. ఇది ఆయన త్యాగనిరతికి సంకేతం.

### సాహిత్య ప్రతిభ

1945-46లో మిత్రులు కొందరు తన భావాలను వ్యక్తం చేస్తూ పుస్తకాలు రాయమని చెప్పారు. దీనికోసం దీన్‌దయాళ్, దేవరస్, నేను జిర్జాపూర్ జిల్లాలో గంగానది ఒడ్డున ఒక ఇంట్లో ఉన్నాం. మాకు నచ్చిన పుస్తకాలు తీసుకెళ్లాం. ఆరు రోజుల పాటు పుస్తకాలు చదివాం. గంగానది ఒడ్డున షికారుకెళ్లే వాళ్లం. ఆరో రోజు నేను, దేవరస్ తొమ్మిదిన్నరకు నిద్రపోయాం. అప్పుడు దీన్‌దయాళ్ లాంతరు పెట్టుకుని ఏదో చదువుతున్నారు. 11 గంటలకు నాకు మెలకువ వచ్చి చూస్తే ఆయన ఏదో రాస్తున్నారు. నాలుగు గంటలకు చూస్తే ఇంకా రాస్తూనే ఉన్నారు. అయిదింటికల్లా ఒక పుస్తకం రాయడం పూర్తి చేశారు. ఒక్క ఉదుటున సార్నాథ్ చంద్రగుప్త పుస్తకం రాసేశారు. ఉదయం రెండు మూడు నిమిషాల్లో ఆ పుస్తకానికి పరిచయం రాశారు. ఒక్కమాట కూడా మార్చాల్సిన అవసరం రాలేదు. ఆ పుస్తకం ప్రచురితమైంది. 1947లో నేను దక్షిణాదికి వెళ్లి అనేక ఏళ్లు ఉండవలసి వచ్చినందువల్ల ఆయన ఉపన్యాసాలు వినే అవకాశం రాలేదు. చివరకు హైదరాబాద్‌లో జనసంఘ్ సమావేశంలో ఆయన ఉపన్యాసం విన్నప్పుడు ఆయన భాష పూర్తిగా మారిపోయింది.

ఈ విషయాన్ని ఆయన దగ్గర ప్రస్తావిస్తే "జనసంఘ్‌లో చేరిన తర్వాత నేను సామాన్య ప్రజలను ఉద్దేశించి మాట్లాడాలి. సాహిత్య భాష దీనికి పనికి రాదు. అందువల్ల కావాలనే సామాన్యులు మాట్లాడే భాషలో మాట్లాడాను" అన్నారు. ఆ రకంగా ఆయనకు సాహితీ సృజన శక్తి ఉన్నా తను చేపట్టిన పని కోసం మరో దారిలో వెళ్లారు.

### అర్థశాస్త్ర ప్రావీణ్యం

జనసంఘ్ ఏర్పడినప్పుడు అది ఆర్థిక సిద్ధాంతం లేని పార్టీ అన్న విమర్శలు వచ్చాయి. జనసంఘ్ ప్రధాన కార్యదర్శిగా పార్టీ ఆర్థిక కార్యక్రమం రూపొందించాల్సిన బాధ్యత తనదేనని భావించారు. ఆయన అనేక శాస్త్రాలు చదివినా అర్థ శాస్త్రాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయలేదు. ఆర్థిక శాస్త్రంపై అనేక పాత కొత్త పుస్తకాలు చదివి దాని మీద పట్టు సంపాదించారు. అయితే ఆయన రూపొం దించిన ఆర్థిక కార్యక్రమం పుస్తకాలు చదివి తయారు చేసింది కాదు. అన్ని రాష్ట్రాలలో మారుమూల ప్రాంతాలలో కూడా పర్యటించి పేదల ఆర్థిక సమస్యలను అధ్యయనం చేశారు. ఆర్థిక పరిస్థితిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, బాగా ఆలోచించి దీన్‌దయాళ్ జనసంఘ్ ఆర్థిక కార్యక్రమాన్ని సిద్ధం చేశారు. ఆయన ఆర్థికశాస్త్ర అధ్యయనం ఎంత లోతైందంటే "టూ ప్లాన్స్" అన్న గ్రంథమే ఇంగ్లీషులో రాశారు. అది మొదటి రెండు పంచవర్ష ప్రణాళికల మీద రాసింది. అందరి మన్ననలు పొందింది. ఆ గ్రంథానికి రెండో భాగం కూడా రాసినా ప్రయాణంలో ఎక్కడో పోయింది. ఆయన అభిప్రాయాలను కొన్నింటిని పార్లమెంటరీ కమిటీ ఆమోదించింది. ఆ పుస్తకం మళ్లీ రాయమని నేను అడిగినా రాయలేదు. కాని భారత ఆర్థిక వ్యవస్థ మీద మరో గ్రంథం రాశారు. దేశాభివృద్ధి ఏ దిశగా సాగాలో అందులో సూచించారు. కళాశాల స్థాయిలో ఆర్థిక శాస్త్రం చదవక పోయినా అలాంటి గ్రంథాలు రాయడం దీన్‌దయాళ్ వంటి అసాధారణమైన వ్యక్తులకు తప్ప సాధ్యం కాదు.

### నిగర్వి

దీన్‌దయాళ్ జీ నిరాడంబరతకు, ప్రేమాభిమానాలకు నిదర్శనం. ఆయన ఏదైన సమావేశంలో ప్రసంగించడానికి వెళ్లేటప్పుడు మాసిన దుస్తులు మార్చుకోమని మిత్రులు చెప్పేవారు. "జనం నా మాటలు వినడానికి వస్తారా లేక నా దుస్తులు చూడడానికి వస్తారా?" అని అడిగేవారు. ఆయన జాతీయస్థాయి నాయకుడైన తర్వాత కూడా తనకు సహాయకుడిగా ఏర్పాటు చేసిన మనిషి గురించే ఆలోచించేవారు. ఆ వ్యక్తి ఆరోగ్యం బాగా లేకపోతే తన బట్టలు తానే ఉతుక్కునే వారు. అతని బట్టలు కూడా ఉతికే వారు. ■



ఆగస్టు 28న గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించిన 'మిషన్ 100+' సోషల్ మీడియా వాలంటీర్ల సమావేశంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, బీజేవైఎం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన 'ఖేలో భారత్' పోటీలు ఆగస్టు 23న ముగిసాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



పరోపకారమే పుణ్యం, పర పీడనమే పాపం. – శ్రీ విద్యా ప్రకాశనందగిరి స్వామి

సంస్మరణ

# గాంధీ ఆధ్యాత్మిక వారసుడు వినోబా

**సెప్టెంబర్ 11న వినోబా భావే జయంతి సందర్భంగా జనసందేశ్ పాఠకుల కోసం**

1895 సెప్టెంబర్ 11న జన్మించిన వినాయక్ నరహరి "వినోబా" భావే అహింస, మానవ హక్కుల కోసం పాటుపడ్డ ఆదర్శమూర్తి. ఆచార్య వినోబాగా ప్రసిద్ధుడైన ఆయన భూదానోద్యమ నేతగా ప్రఖ్యాతుడయ్యారు. ఆయనను జాతి ఉద్ధారకుడిగా, మహాత్మా గాంధీ వారసుడిగా పరిగణిస్తారు. గాంధీ ఆయనను మొదటి సత్యాగ్రాహిగా ఎంపిక చేశారు.

### బాల్యం

నరహరి శంభు రావు, రుక్మిణీ దేవి తొలి సంతానం వినోబా. ఆయన మహారాష్ట్రలోని కొలాబా జిల్లా గగోడ్‌లో జన్మించారు. ఆయనకు ముగ్గురు తమ్ముళ్లు, ఒక సోదరి. తల్లి రుక్మిణీ దేవి గాఢమైన మత విశ్వాసాలున్న వారు. వినోబాలో ఆధ్యాత్మిక భావాలు పాదుకొల్పారు. విద్యార్థిగా ఉన్నప్పుడు వినోబా లెక్కల్లో దిట్ట. తాత దగ్గర భగవద్గీత చదివినందువల్ల చిన్నతనంలోనే ఆయనలో ఆధ్యాత్మిక భావన పెరిగింది. తెలివైన విద్యార్థి అయినప్పటికీ ఆయనకు సాంప్రదాయిక విద్య అంతగా రుచించలేదు. సామాజిక జీవనం వదిలేసి హిమాలయాలకు వెళ్లిపోవాలనుకున్నారు. దేశమంతటా తిరిగి అనేక భాషలు నేర్చుకున్నారు. సంస్కృతంలో ప్రావీణ్యం సంపాదించారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో మహాత్మా గాంధీ ప్రసంగం గురించి ఒక కథనం ఆయనను ఆకట్టుకుంది. అది చదివిన తర్వాత ఆయన జీవిత గమనమే మారిపోయింది. 1916లో బొంబాయి వెళ్తూ తన సర్టిఫికెట్లన్నీ చించేశారు. గాంధీతో ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగించేవారు. 20 ఏళ్ల ఈ యువకుడి మీద గాంధీకి అభిమానం కలిగి వినోబాను అహ్మదాబాద్‌లోని కోచ్రాబ్ ఆశ్రమానికి పిలిపించారు. 1916 జూన్ 7న వినోబాకు మహాత్మా గాంధీని కలుసుకునే అవకాశం వచ్చింది. ఆ ఆశ్రమంలో చేరిపోయారు. నిరాడంబరత, ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ ఆశ్రమంలోని సకల కార్యకలాపాలలో పాల్గొనే వారు. ఖాదీ ఉద్యమం లాంటి గాంధీ ప్రబోధించిన అన్ని ఉద్యమాలలో భాగస్వామి అయ్యారు. ఆ ఆశ్రమంలో ఉన్న మామా ఫడ్కే వినోబా అన్న పేరు పెట్టారు. వినోబా అంటే గొప్ప గౌరవం అని అర్థం.



**1951లో వినోబా తెలంగాణాలో పాదయాత్ర ప్రారంభించారు. 1951 ఏప్రిల్ 18న పోచంపల్లి గ్రామంలోని హరిజనులు తాము బతకడానికి కొద్దిగా భూమి ఇవ్వాలని కోరారు. భూస్వాములు ముందుకొచ్చి హరిజనులను కాపాడాలని వినోబా కోరారు. ఆశ్చర్యకరంగా ఒక భూస్వామి ఆ భూమి దానంగా ఇవ్వడానికి సమ్మతించారు. భూదానోద్యమానికి అదే ఆరంభం.**

### స్వాతంత్ర్యోద్యమంలో

గాంధీ ప్రభావంతో వినోబా స్వాతంత్ర్యోద్యమంలో కూడా పాల్గొన్నారు. సహాయ నిరాకరణోద్యమం, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చరఖా తిప్పి నూలు వడికే వారు. ఇతరులను కూడా ఆ పని చేయమని ప్రోత్సహించే వారు. 1932లో వినోబా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని ఆరోపించి బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను ఆరు నెలలపాటు ధూలియా జైలులో ఉంచింది. అక్కడ ఆయన తోటి ఖైదీలకు మరాఠీలో భగవద్గీత బోధించారు. జైలులో ఆయన భగవద్గీత మీద చెప్పిన విషయాలన్నింటినీ కలిపి తర్వాత గ్రంథంగా ప్రచురించారు. 1940 వరకు వినోబా గురించి ఆయనతో పరిచయం ఉన్న వారికి తప్ప ఇతరులకు అంతగా తెలియదు. 1940 అక్టోబర్ 5న గాంధీ ఒక ప్రకటన విడుదల చేసి దేశవాసులకు ఆయనను పరిచయం చేశారు. గాంధీజీ ఆయనను మొదటి సత్యాగ్రాహిగా ఎంపిక చేశారు.

### భూదానోద్యమం

1951లో వినోబా తెలంగాణాలో పాదయాత్ర ప్రారంభించారు. 1951 ఏప్రిల్ 18న పోచంపల్లి గ్రామంలోని హరిజనులు తాము బతకడానికి కొద్దిగా భూమి ఇవ్వాలని కోరారు. భూస్వాములు ముందుకొచ్చి హరిజనులను కాపాడాలని వినోబా కోరారు. ఆశ్చర్యకరంగా ఒక భూస్వామి ఆ భూమి దానంగా ఇవ్వడానికి సమ్మతించారు. భూదానోద్యమానికి అదే ఆరంభం. ఈ ఉద్యమం 13 ఏళ్ల పాటు కొనసాగింది. వినోబా దేశంలోని అనేక ప్రాంతాలలో 58,741 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేసి భూదానోద్యమం కొనసాగించారు. ఆయన దాదాపు 4.4 లక్షల ఎకరాల భూమి సేకరించారు. దీనిలో 1.3 లక్షల ఎకరాల భూమీ పంపిణీ చేశారు. ఈ ఉద్యమానికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందాయి. స్వచ్ఛందంగా సామాజిక న్యాయం సాధించడానికి ఇది మహాద్భుతమైన మార్గం అన్న పేరు వచ్చింది.

### మతపరమైన కార్యక్రమం

భగవద్గీత వినోబా మీద చాలా ప్రభావం చూపింది. ఆయన కార్యాచరణ అంతా ఆ పవిత్ర గ్రంథం స్ఫూర్తిగానే సాగింది. నిరాడంబరమైన, విలాసాలకు తావు లేని జీవితం గడపడానికి ఆయన అనేక ఆశ్రమాలు నెలకొల్పారు. మహాత్మా గాంధీ బోధనల స్ఫూర్తితో మహిళల కోసం 1959లో వినోబా మహారాష్ట్రలోని వార్ధా జిల్లా పౌనార్‌లో బ్రహ్మ విద్యా మందిరం నెలకొల్పారు. గో హత్య నిషేధం కోసం అపారంగా కృషి చేశారు. గో హత్యను నిషేధించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. జైన మత విధి ప్రకారం ఆహారం ముట్టుకోకుండా దీక్ష వహించి 1982 నవంబర్ 15న సమాధి మరణం పొందారు.

**–జనసందేశ్ ప్రతినిధి**

అందరికీ సేవకుడైన వాడే వారికి నిజమైన యజమాని. – స్వామి వివేకానంద




# శ్రామికులకు ఊరటనిచ్చే సంస్కరణలు

• దీపక్ రాజన్

పాలనా సంస్కరణల వల్ల శ్రామికుల పరిస్థితి సమూలంగా మారిపోయింది. గతంలో ఉద్యోగ విరమణ తర్వాత భవిష్యనిధిలోని తమ సొమ్ము తీసుకోవడానికి కార్మికులు భవిష్యనిధి కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేట్టు తిరగాల్సి వచ్చేది. భవిష్యనిధి కింద పింఛన్ పొందడానికి నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. దీనికి సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించడం పెనుభారంగా యాజమాన్యాలు భావించేవి. ఇఎస్ఐ ఆసుపత్రులలో స్పెషలిస్టు డాక్టర్లను సంప్రదించడం దుర్లభంగా ఉండేది. ఉపాధి కల్పనా కేంద్రాలలో కాగితాల పని విపరీతంగా ఉన్నందువల్ల చాలా మంది అటు వైపే వెళ్లే వారు కాదు.

తమ భవిష్యనిధి ఖాతా నుంచి వైద్యం కోసమో, పిల్లల పెళ్లిళ్ల కోసమో, గృహ వసతి కోసమో డబ్బు తీసుకోవాలని కార్మికులు అనుకుంటే అక్కడి ఉద్యోగులు సహకరించే వారు కాదు. రికార్డులు పారదర్శకంగా లేనందువల్ల విచక్షణాధికారాలకు, ఏకపక్ష వ్యవహారానికి అవకాశం ఉండేది. చాలా కాలంగా ఉన్న కార్మికుల ఫిర్యాదులను పరిష్కరించడానికి గత మూడేళ్ల కాలంలో కార్మిక మంత్రిత్వ శాఖ అనేక చర్యలు తీసుకుంది. అవ్యవస్థీకృతరంగంలోని 40 కోట్ల మంది కార్మికులకు కూడా ఇపిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పిస్తామని కార్మిక శాఖ మంత్రి హామి ఇచ్చారు.

ఇపిఎఫ్ డబ్బు తీసుకోవడానికి ఉండే గడువును 20 రోజుల నుంచి 10 రోజులకు కుదించారు. అంతకుముందు ఇది ఊహించలేం. ఫిర్యాదుల పరిష్కారానికి గతంలో 20 రోజులు పడితే ఇప్పుడు 15 రోజులు మాత్రమే పడుతుంది. తమ ఆరోగ్యం కోసం, తమ మీద ఆధారపడిన వారికోసం ఇపిఎఫ్ నుంచి డబ్బు తీసుకోవాలంటే ఇప్పుడు కార్మికులు తామే రూఢీ పత్రం అందజేస్తే సరిపోతుంది. వైద్య సర్టిఫికేట్ అందజేయాల్సిన అవసరం లేదు. త్వరితంగా పింఛన్ అందజేయడానికి వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి ఇపిఎఫ్ఓ ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నారు. 2017 జులై 1 నాటికి ఇపిఎఫ్ కింద సభ్యులందరూ ఆధార్ నెంబర్ అందజేసేట్టు చూడాలని క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పింఛన్ తీసుకుంటున్న వారు ఆ పని ఇదివరకే చేసేశారు. దీని వల్ల జాప్యం చేయడానికి, సాకులు చెప్పడానికి అవకాశం ఉండదు. పింఛన్ పంపిణీ మొదలైనవన్ని ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరగాలని కార్మిక మంత్రిత్వ శాఖ 2017 మేలోనే ఆదేశాలు జారీ చేసింది. దీని వల్ల 4.5 కోట్ల మంది ఇపిఎఫ్ సభ్యులకు, పింఛన్ తీసుకునే వారికి ప్రయోజనం ఉంటుంది.

సొంత ఇంటి కోసం కలగనే కార్మికుల కోసం తీపి కబుర్లే ఉన్నాయి. ఇంటి కోసం కార్మికులు ఇపిఎఫ్ నుంచి ముందే డబ్బు తీసుకునే అవకాశం ఇంతకుముందు కూడా ఉంది. ఇప్పుడు బ్యాంకుకు చెల్లించాల్సిన వాయిదా మొత్తాలను కూడా నేరుగా ఇపిఎఫ్ ఖాతా నుంచి పంపించుకోవచ్చు. దీని కోసం ఇపిఎఫ్ యాజమాన్యం 2017 జూన్‌లో హడ్కోతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం కార్మికులు గృహనిర్మాణ సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇల్లు కట్టుకోవడానికి డబ్బు తీసుకోవచ్చు. లేదా ఇపిఎఫ్ ఖాతా నుంచే వాయిదాలు చెల్లించవచ్చు. గృహ నిర్మాణం కోసం డబ్బు తీసుకోవడానికి ఉన్న షరతులను సులభతరం చేశారు. ఇంతకుముందు అయిదేళ్లుగా ఇపిఎఫ్ సభ్యులుగా ఉన్న వారు గృహ నిర్మాణం కోసం డబ్బు తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు అది మూడేళ్లకు తగ్గించారు. రుణంతో ముడిపడ్డ సబ్సిడీ పథకం కింద 2.20 లక్షల వరకు వడ్డీలో రాయితీ పొందవచ్చు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్దేశించిన మొత్తం కన్నా తక్కువ ఆదాయం ఉన్న వారికి ఈ సదుపాయం ఉంటుంది.

కనీస వేతనాలు పెంచడం వల్ల కూలీలుగా పని చేసే వారికి ఊరట కలుగుతుంది. వ్యవసాయేతర రంగాలలో పని చేసే కార్మికుల వేతనాన్ని "సి" కేటగరీలో రూ.246 నుంచి 350 కి, "బి" కేటగరీలో రూ.437 కు, "ఎ" కేటగరీలో రూ.523కు పెంచారు. 2015 నాటి బోనస్ చెల్లింపు సవరణ చట్టం ప్రకారం నెలసరి వేతన పరిమితిని రూ.10,000 నుంచి రూ.21,000కు పెంచారు. 2017 నాటి ఉద్యోగుల పరిహార చట్టం ప్రకారం చట్టాన్ని ఉల్లంఘించే వారికి విధించే జరిమానా రూ.5,000 నుంచి రూ.50,000కు పెంచారు. ఇది లక్షకు కూడా పెంచవచ్చు. 2017 నాటి ప్రసూతి (సవరణ) చట్టం ప్రకారం ఇద్దరు పిల్లలున్న వారికి ఇంతకుముందు 12 వారాల సెలవు ఇస్తుండగా ఇప్పుడు దాన్ని 26 వారాలకు పెంచారు. ఇద్దరికన్నా ఎక్కువ పిల్లలు ఉంటే 12 వారాల సెలవు ఇస్తారు. దీనివల్ల మహిళలు ఉద్యోగంలో చేరడానికి ప్రోత్సాహం లభిస్తుంది.


పారిశ్రామిక వాడలున్న 393 జిల్లాలకు ఇఎస్ఐ కార్పొరేషన్ వైద్య సేవలు కల్పిస్తారు. వీటిలో 301 జిల్లాల్లో ఇది పూర్తిగా అమలవుతోంది. రెండో దశలో దేశంలోని అన్ని జిల్లలకూ ఇది వర్తిస్తుంది. వలస వెళ్లే కార్మికుల కోసం 'ఒక ఐపి-రెండు చికిత్సాలయాలు' పథకం అమలు చేస్తున్నారు. ఇప్పుడు బీమా ఉన్న వారు తమ కోసం ఒక చికిత్సాలయాన్ని తల్లిదండ్రుల కోసం మరో చికిత్సాలయాన్ని ఎంపిక చేసుకోవచ్చు. దీని వల్ల బీమా చేసుకున్న వారి కుటుంబాలు ఒక చోట పని చేసే వారు మరో చోట ఉన్నా ప్రయోజనం ఉంటుంది. ఉపాధి కల్పించడం కోసం కార్మిక శాఖ జాతీయ కెరీర్ సర్వీస్ పథకం అమలు చేస్తోంది. జాతీయ కెరీర్ సర్వీస్ పథకం పోర్టల్‌లో 3.87 కోట్ల అభ్యర్థులు, 14.8 లక్షల సంస్థలు నమోదై ఉన్నాయి. దీని వల్ల ఆరు లక్షల ఉద్యోగాలు వచ్చాయి. 2016-17లో 540 ఉద్యోగ మేళాలు నిర్వహించారు.

కార్మిక శాఖ ప్రధానమంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన ప్రారంభించింది. దీని కోసం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించింది. యజమానులు ఉద్యోగుల ఇపిఎఫ్ ఖాతాలో 12 శాతం జమ చేయాల్సి ఉండగా అందులో 8.33 శాతం ప్రభుత్వమే జమ చేస్తుంది. ఇది ఉద్యోగుల పింఛన్ ఖాతాలో జమ అవుతుంది. వస్త్ర పరిశ్రమ రంగంలో ప్రభుత్వం 3.6 శాతం చెల్లిస్తుంది. కొత్తగా ఉద్యోగులను చేర్చుకునే యజమానులకు ఇది బాగా ఉపయోగపడుతుంది. ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్న వస్త్ర పరిశ్రమ రంగానికి ప్రభుత్వం రూ.6,000 కోట్లు మంజూరు చేసింది. ■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. - స్వామి వివేకానంద

విశ్లేషణ



# మహా ఆర్థికశక్తిగా ఎదుగుతున్న భారత్

• రాజీ రంజన్ రాయ్

గత 70 ఏళ్లలో భారత్ సాధించిన ఆర్థికాభివృద్ధి అద్భుతమైన విజయగాథ. దీనిలో అనేక కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. మౌలిక సదుపాయాలు బొత్తిగా లేని దశ నుంచి అనేక సవాళ్లను ఎదుర్కొని ఆర్థికాభివృద్ధి సాధించింది. మన జాతి నిర్మాతలు దృఢ సంకల్పంతో ఒక్కో ఇటుక పేర్చి ఈ ఆర్థిక సౌధాన్ని నిర్మించారు. పేదరికాన్ని, రైతుల కడగండ్లను దూరం చేయడానికి ప్రారంభించిన పంచవర్ష ప్రణాళికలు మహత్తరమైన పునాది వేశాయి. అయితే వ్యవస్థలోకి అనేకానేక సమస్యలు దూరినందువల్ల వ్యాపారం చేయడం ప్రోత్సాహకరంగా లేకుండా పోయింది. విదేశీ మారక ద్రవ్య నిలవలు ఎన్నడూ భరోసా కల్పించేట్టుగా ఉండేవి కావు. విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) నామమాత్రమే. అందుకే రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మన అర్థిక వ్యవస్థ ద్వారాలు తెరవాలన్న డిమాండు ఊపందుకుంది. పీవీ నరసింహా రావు ప్రధానమంత్రి అయ్యే వరకు రాజకీయ సంక్షోభాల కారణంగా పెద్దగా జరిగిందేమీ లేదు. పీవీ హయాంలోనే ఉదారవాద విధానాలు ప్రారంభమయ్యాయి. రాజకీయ అస్థిరత, కార్గిల్ యుద్ధం కారణంగా 1996 నుంచి 1999 వరకు విదేశీ, స్వదేశీ పెట్టుబడులు మందకొడిగానే సమకూరాయి. అయితే కార్గిల్ యుద్ధం తర్వాత అప్పటి ప్రధానమంత్రి భవిష్యత్ దృక్పథం వల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకుంది. ఉదారవాద విధానాల ప్రయోజనం కనిపించడం ప్రారంభమైంది. పెట్టుబడులు రావడం, ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడిని ఉపసంహరించడం ద్వారా సమకూరిన మొత్తాన్ని రోడ్లు, విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి వినియోగించడం ఊపందుకుంది. అప్పటి నుంచి భారత ఆర్థిక వ్యవస్థ వెనుదిరిగి చూడాల్సిన అవసరమే లేకుండా పోయింది. 2000లో అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యంలో చిక్కుకున్నప్పుడు కూడా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమించింది. అంతర్జాతీయ పెట్టుబడి దారుల దృష్టి ఆకర్షించింది.

ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మన దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే త్వరితంగా ఎదుగుతున్న వ్యవస్థగా తయారైంది. చైనాను కూడా అధిగమించే స్థితికి చేరుకున్నాం. మోదీ ప్రవేశ పెట్టిన అనేక సంస్కరణల వల్ల మనదేశంలో వ్యాపారం చేయడం సులువైపోయింది. అందుకే ప్రస్తుతం మన దేశం ప్రసిద్ధ సంస్థల పెట్టుబడులకు గమ్య స్థానంగా మారింది. బహుశా ఈ కారణం వల్లే అంతర్జాతీయ సీఈఓలు పెట్టుబడులతో తమంత తామే మన దేశానికి తరలి వస్తున్నారు. ఇది అపూర్వమైంది.

మోదీ అమలు చేసిన పెద్ద నోట్ల రద్దు భారత ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి తోడ్పడింది. అవ్యవస్థీకృత రంగం మీద విపరీతంగా ఆధారపడినందువల్ల మన ఆర్థిక వ్యవస్థ బాగా నష్టపోయింది. నిజానికి అవ్యవస్థీకృత రంగం అపారమైన ఉపాధి అవకాశాలను సృష్టించి ఉండాల్సింది. కాని ఇది

**ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మన దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే త్వరితంగా ఎదుగుతున్న వ్యవస్థగా తయారైంది. చైనాను కూడా అధిగమించే స్థితికి చేరుకున్నాం. మోదీ ప్రవేశ పెట్టిన అనేక సంస్కరణల వల్ల మనదేశంలో వ్యాపారం చేయడం సులువైపోయింది. అందుకే ప్రస్తుతం మన దేశం ప్రసిద్ధ సంస్థల పెట్టుబడులకు గమ్య స్థానంగా మారింది.**

పన్నుల ఎగవేతకు, చట్టాలను ఉల్లంఘించడానికి దారి తీసింది. ఇది కార్మికుల ఉత్పాదకతను దెబ్బ తీసింది. మైలురాయి వంటి వస్తు సేవల పన్ను ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తిని సమకూర్చనుంది. ఈ చట్టం వల్ల పెట్టుబడులు, వృద్ధిపై సానుకూల ప్రభావం చూపుతుంది. పన్నుల రంగంలో ఈ సంస్కరణ, నిర్దేశిత సబ్సిడీలను నిలిపివేసినందు వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాల రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి వీలు కలుగుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) తెలియజేసింది.

2016 నాటి నిర్దేశిత ఆర్థిక, ఇతర సబ్సిడీల (ప్రయోజనాలు, సేవల) చట్టం, సబ్సిడీల, దివాలా నియమావళి, జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ వంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యాన్ని పెంచుతాయి. 2017-18 కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7.7 శాతం ఉండొచ్చునని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. దీన్ని బట్టి మన ఆర్థిక వ్యవస్థ మౌలిక అంశాలు పటిష్ఠంగా ఉన్నట్టు లెక్క. ఒడిదుడుకులను తట్టుకునే శక్తి ఉందన్నమాట. ప్రభుత్వం పారిశ్రామిక, వస్తూత్పత్తి రంగాల గురించి శ్రద్ధ తీసుకుంటే మరింత వేగంగా అభివృద్ధి చెందే శక్తి భారత ఆర్థిక వ్యవస్థకు ఉంది. మార్కెట్ సామర్థ్యం పెరగాలంటే కొన్ని అవాంతరాలను తొలగించవలసిన అవసరం ఉందని ఐఎంఎఫ్ అభిప్రాయపడింది. 2015-16లో భారత ఆర్థిక వ్యవస్థ 7.6 శాతం చొప్పున వృద్ధి చెందింది. 2017లో భారత స్థూల జాతీయ ఉత్పత్తి వృద్ధి రేటు 7.7 శాతం ఉంటుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. వ్యవసాయ రంగం మెరుగుపడడం, వేతనాల సంస్కరణలు, వినియోగానికి మద్దతు ఇవ్వడం, ఎగుమతులను ప్రోత్సహించడం వల్ల ఇది సాధ్యం అవుతుంది. జి-20 దేశాలలో 7 శాతం వృద్ధి రేటు కనబరుస్తున్నది భారత్ మాత్రమే.

వ్యవస్థాగతమైన సంస్కరణలు, నియమ బద్ధమైన స్థూల ఆర్థిక విధానాలు త్వరితగతిన ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తున్నాయని 2017 నాటి ఓఇసిడి ఆర్థిక సర్వేలో తేలింది. అనేక ఎఫ్‌డిఐలను సరళీకరించినందువల్ల ఉద్యోగాల, ఉపాధి అవకాశాల కల్పన మెరుగుపడుతుంది. ఏవో కొన్ని రంగాలను మినహాయించి అన్ని రంగాలలో ఆటోమేటిక్‌గా విదేశీ పెట్టుబడులు సమకూరే విధానాన్ని మోదీ అనుసరిస్తున్నారు. 2016-17లో విదేశీ పెట్టుబడులు 27.22 బిలియన్ డాలర్ల నుంచి 31.18 బిలియన్ డాలర్లకు పెరిగినట్టు ఒక అంచనాలో తేలింది. 2017 మార్చి 24 నాటికి విదేశీ మారక ద్రవ్య నిలవలు 367.93 బిలియన్ డాలర్లు ఉన్నాయి. కరెంట్ అకౌంట్ లోటు 1.3 శాతం ఉంది.

ఇతర సూచికలను బట్టి చూస్తే ఆనందించదగిన అంశాలు అనేకం ఉన్నాయి. 2016-17లో స్థూల ద్రవ్య లోటు 3.5 శాతానికి పరిమితమైంది. 2017-18లో ఇది 3.2 శాతం ఉంటుందని అంచనా. నాణ్యమైన వ్యయం, పన్నుల వసూళ్ల వల్ల మోదీ నాయకత్వంలో భారత ఆర్థిక వ్యవస్థ నూతన చరిత్రను లిఖించనుంది. ఆర్థిక ఆధిపత్యం చెలాయించే దిశగా పురోగమిస్తోంది. ■

అందరికీ సేవకుడైన వాడే వారికి నిజమైన యజమాని. - స్వామి వివేకానంద




# సఫల దౌత్యనీతికి నిదర్శనం డోక్లామ్ విజయం

● రాకా

భారతదేశం సఫల దౌత్యనీతి, నిక్కచ్చి వ్యవహారం, దృఢ వైఖరి వల్ల సిక్కిం సరిహద్దుల్లో జూన్ నుంచి చైనాతో కొనసాగుతున్న డోక్లామ్ వివాదానికి ఫుల్‌స్టాప్ పడింది. డోక్లామ్ ప్రాంతం నుంచి దశలవారీగా ఇరుపక్షాల సైన్యాన్ని ఉపసంహరించాలని భారత్, చైనాలు ఒక అంగీకారానికి వచ్చాయి. దీంతో ఆరు వారాలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభన ముగిసింది.

ఇండియా, చైనా, భూటాన్ సరిహద్దుల్లో డోక్లామ్ ప్రాంతం అత్యంత కీలకమైనది. భూటాన్‌కి చెందిన ఈ భూమి తనదని చైనా వాదిస్తోంది. ఈ ప్రాంతం సైనిక పరంగా భారత్‌కు అత్యంత కీలక ప్రాంతం. ఈ ప్రాంతంలోకి చైనా ఏకపక్షంగా చొరబడి రోడ్డు నిర్మిస్తుండడంతో భారత్, భూటాన్‌లలో ఆందోళన మొదలైంది. మరోవైపు ఒప్పందాల ప్రకారం భూటాన్ రక్షణ బాధ్యత భారత్‌దే. దీంతో భూటాన్‌ను కాపాడడంతో పాటు మన దేశ ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు భారత సైన్యం డోక్లామ్‌లో అడుగుపెట్టి చైనా రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. ఈ ప్రాంతం నుంచి ఇండియా బలగాలు వెనుదిరగకపోతే భారత్‌పై యుద్ధం తప్పదని డ్రాగన్ చాలాసార్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా బెదిరింపులకు దిగింది.

ఈ రెండు నెలల కాలంలో బలగాలను ఉపసంహరించుకోవాలని చైనా తీవ్ర ఒత్తిడి చేసినా, ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా.. భారత్ మాత్రం వెనుకడుగు వేయలేదు. రెండు దేశాల బలగాలు వెనక్కి వెళ్తేనే చర్చలు ఉంటాయని భారత్ తేల్చి చెప్పింది. సిక్కిం సరిహద్దులోని ఈ డోక్లామ్ ప్రాంతం తమదేనని చైనా వాదిస్తుండగా.. అది భూటాన్‌దని భారత్ తెలిపింది. ఈ ప్రాంతంలో చైనా రోడ్డు నిర్మాణం తమ దేశ భద్రతకే పెను ముప్పని భావించిన ఇండియా.. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్తూ వచ్చింది. దీంతో 1962 యుద్ధంలో ఏం జరిగిందో తెలుసుగా అంటూ చైనా తీవ్ర హెచ్చరికలు కూడా జారీ చేసింది. అయినా ఏ మాత్రం తలవంచని భారత్.. మొత్తానికి దౌత్య మార్గంలోనే సమస్య పరిష్కరించి చైనాకు తగిన పాఠం చెప్పింది.

ఈ విషయంలో చైనా దుందుడుకుగా వ్యవహరిస్తే, భారతదేశం విభిన్నమైన విధానాన్ని ఎంచుకుందని, తగిన సంయమనం పాటించింది. డోక్లామ్ ప్రతిష్టంభనను చైనా పెద్దది చేసి దూకుడు ప్రదర్శిస్తే, మనం మాత్రం మౌనం పాటించాము. అలాగని మనం వెనకడుగు వేయలేదు. దేనికైనా సిద్ధమని మనం మనసైన్యాలను కూడా అక్కడికి తరలించాం. దీంతో చైనా అసహనం మరింత పెరిగింది. డోక్లామ్ వివాదంలో చైనా బెదిరింపులకు తలొగ్గకుండా పట్టుదలతో వ్యవహరించి భారత్ విజయం సాధించింది. పొరుగు దేశాల పట్ల చైనా వ్యవహరించే తీరును దౌత్య, భాగస్వామ్య విధానాల ద్వారా ఎదుర్కోవచ్చని రుజువు చేసింది.

వాస్తవానికి అంతర్జాతీయ చట్టానికి విరుద్ధంగా సిక్కిం సరిహద్దుల్లోని వివాదాస్పద ప్రాంతమైన డోక్లామ్ వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టింది చైనా బలగాలే. ఇక్కడ ఉద్రిక్తతను ప్రోత్సహించేలా డ్రాగన్ దళాలు దాదాపు రెండున్నర నెలలు నిలువుకాళ్ల జపం చేశాయి. ఇంకో వైపు చైనాతో ఏర్పడిన డోక్లామ్ వివాదంలో ఇండియాకు జపాన్ మద్దతిచ్చింది. బలప్రయోగంతో ఏకపక్షంగా యథాతథ స్థితిని మార్చడం సరికాదని జపాన్ అభిప్రాయపడింది. ఇప్పటికే అమెరికా కూడా ఈ విషయంలో భారత్‌కు మద్దతిచ్చింది. తాజాగా జపాన్ కూడా భారత్ వైపు నిలవడంతో చైనా మరిన్ని చిక్కుల్లో పడింది. వచ్చే నెలలో జపాన్ ప్రధాని షింజో అబె భారత్ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆ దేశం భారత్‌కు మద్దతు పలకడం విశేషం. చైనాలో జరగనున్న బ్రిక్స్ సమావేశాలకు సరిగ్గా నెలరోజులే ఉండడం... అంతర్జాతీయ సమాజం ముందు అభాసుపాలయ్యే అవకాశం ఉండడంతో డ్రాగన్ మెల్లగా వెనక్కి జారుకుంది. గమనార్హమైన విషయం ఏమిటంటే రెండు దేశాలూ ఒకేసారి సైన్యాన్ని వెనక్కు తీసుకోవాలని ఆది నుంచి డిమాండ్ చేస్తున్న భారత్, తన పంతాన్ని నెగ్గించుకోవడం విశేషం.

ఒకటి రెండు రోజుల్లో తేలిపోతుందనుకున్న వివాదం రెండు నెలలు దాటడంతో చైనా దిక్కుతోచని స్థితిలో పడింది. తన ఆయుధ పాటవానికి, రణ శంఖారావానికి భారత్ భయపడుతుందనుకున్న చైనా అంచనాలు ఉత్తుత్తి ఊహాగానాలుగానే మిగిలిపోయాయి. దీంతో ఏం చేయాలో బీజింగ్‌కు దిక్కుతోచడం లేదు. ఇప్పటికే ఉత్తర కొరియాకు చైనా మద్దతు బహిరంగ రహస్యమే. దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్తతలు, తైవాన్‌తో అమెరికా రక్షణాత్మక ఒప్పందాలతో ఎదురుదెబ్బలు తిన్న చైనాకు డోక్లామ్ అంశం కూడా మింగుడు పడని వ్యవహారమే.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రెండోసారి దేశాధ్యక్షుడుగా ఎన్నిక కావాలని ఆశిస్తున్నారు. అక్టోబరులో జరిగే కమ్యూనిస్టు పార్టీ 19వ సమావేశాల్లో ఈ ఎన్నిక జరగనుంది. అదే సమయంలో డోక్లామ్ నుంచి చైనా సైన్యం వెనక్కు మళ్లితే జిన్‌పింగ్‌కు ఇబ్బందులు తప్పవు. ఒక వేళ ముందుకెళ్లి భారత్‌తో యుద్ధానికి సిద్ధపడితే అంతర్జాతీయంగా చైనాకు చెడ్డపేరు వస్తుంది. వన్ బెల్ట్, వన్ రోడ్ పేరుతో ప్రపంచంలో ప్రబలమైన ఆర్థికశక్తిగా ఎదగాలన్న చైనా ఆశయానికి ఇది భంగం కలిగించే అంశమే. ఆసియాలోనే కాదు ప్రపంచంలోనే బలీయమైన ఆర్థికశక్తిగా ఉన్న భారత్‌తో యుద్ధం సంభవిస్తే భారత్‌తో పాటు చైనా ఆర్థికవ్యవస్థ కూడా దెబ్బతినే ప్రమాదముంది. వీటితో పాటు చైనాకు వ్యతిరేకంగా భారత్‌కు మద్దతుగా అమెరికా, జపాన్‌లు రంగంలోకి దిగవచ్చు. అలా జరిగితే చైనాకు మరిన్ని సవాళ్లు తప్పవు.

భారత్ డోక్లామ్ విషయంలో దృఢంగా వ్యవహరించకపోయినా, వెనకడుగు వేసినా ఆసియా ఖండంలో భారత్ పరపతి తగ్గిపోయి ఉండేది. భూటాన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవ్స్, బంగ్లాదేశ్ వంటి దేశాలు భారత్‌ను పక్కనబెట్టి చైనా వైపు మొగ్గు చూపేవి. భారత్ దృఢ వైఖరి వల్ల చైనాకు కళ్లెం పడింది. వియత్నాం, ఫిలిప్పీన్స్ సహా ఆగ్నేయాసియా దేశాలు కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చైనా దుందుడుకు వాదానికి భారత్ కళ్లెం వేసినట్టు అయింది. ఈ చర్య వల్ల ప్రపంచవ్యాప్తంగా భారత్ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ■



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. – గాంధీ

విశ్లేషణ



# మిషన్ భగీరథ: స్కీం కాదు... భారీ స్కాం




ఏనుగుల రాకేష్ రెడ్డి
బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి


2014లో టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇంటింటికీ మంచినీరు నినాదంతో ముఖ్యమంత్రి కేసీఆర్ 27 జులై 2014 న ఎంతో అట్టహాసంగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిపాదించారు. 6 ఆగస్టు 2014 న కరీంనగర్‌లో ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఈ ప్రాజెక్టు వ్యయం మొదట రూ. 30,000 కోట్లని, తరువాత అంచనాలు మార్చి రూ. 42,000 కోట్లని, ఇప్పుడు రూ. 45,000 కోట్లు అని లెక్కకడుతున్నారు. రూ. 45,000 కోట్ల వ్యయంతో మొత్తం 1,27,000 కిలోమీటర్ల పైపులైన్లు వేసి ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని మొత్తం 25,000 నివాస ప్రాంతాలకు రక్షిత మంచినీటిని అందిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 42 టీఎంసీల నీరు కావాలని, అందుకోసం కృష్ణా నది నుండి 19.5 టీఎంసీలు గోదావరి నుండి 19.5 టీఎంసీలు మరో 3 టీఎంసీలు హైదరాబాద్ మెట్రో వర్క్సుకు సంబంధించిన ఎల్లంపల్లి లైన్ నుండి నేరుగా సమకూర్చుకుంటామని చెప్పారు. ఈ వివరాలు ఏవీ కూడా ఒక ఫీల్డ్ సర్వే ద్వారానో, ఒక సాంకేతిక అధ్యయనం ద్వారానో, ఒక డీపీఆర్ ద్వారానో ప్రభుత్వం చెప్పలేదు. ముఖ్యమంత్రి కేవలం ఇంటర్నెట్‌ను ఉపయోగించి గూగుల్ మ్యాపుల్లో టాగింగ్ చేసుకొని అధికారంలోకి వచ్చిన ఒక నెల లోపల డిజైన్ చేసి ప్రకటించారు. ఇంజినీరులెవరికీ దీనిలో భాగస్వామ్యం లేదు.

ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించడం అవసరం. కానీ, ఇంత పెద్ద ప్రాజెక్టు రూపొందిస్తున్నప్పుడు ప్రస్తుతమున్న పరిస్థితిని, ప్రజల అవసరాలను, ఈ రెండింటి మధ్య ఉన్న అంతరాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి, ఆ అంతరాన్ని పూడ్చడానికి వివిధ మార్గాలను పరిశీలించి, కాస్ట్ – బెనిఫిట్ ఎనాలిసిస్ ప్రకారం ఉత్తమ మార్గాన్ని ఎంచుకొని ప్రాజెక్టును రూపొందిస్తారు. ఇవేవి లేకుండా రూ. 45,000 కోట్ల ప్రాజెక్టు కోసం ఒక 15 పేజీల డాక్యుమెంట్ తయారు చేసి, ఇదే ప్రాజెక్టు రిపోర్ట్ అని చెవిలో పూలు పెడుతున్నారు. ప్రపంచంలో ప్రణాళిక లేని, ఎటువంటి సాంకేతిక అధ్యయనం లేని ప్రాజెక్టు ఏదైనా ఉందంటే అది మిషన్ భగీరథనే!


ఇప్పటివరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్రంలో ప్రస్తుతమున్న నీటి వసతులను ఏర్పాటు చేశాయి. మిషన్ భగీరథ వల్ల ఈ ప్రాజెక్టులు ధ్వంసం కానున్నాయి. ప్రస్తుతమున్న నీటి వ్యవస్థలను బలోపేతం చేయకుండా, ఉన్న వసతులను ఉపయోగించుకోకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని ఉపయోగించి కొత్త వ్యవస్థను నిర్మించాలనుకుంటున్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణలో ఏడాదికి కేవలం విద్యుత్తు ఖర్చే రూ. 2,400 కోట్లు ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇతర నిర్వహణ ఖర్చు ఇంతకంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అంటే ఏడాదికి సుమారుగా రూ. 5,000 కోట్లు ప్రజల మీద భారం వేయనున్నారు. అదనంగా రూ. 5,000 కోట్ల వడ్డీ భారం ప్రజల మీద పడనుంది. అంటే మిషన్ భగీరథ ప్రాజెక్టు ఏడాదికి రాష్ట్ర ప్రజల మీద రూ. 10,000 కోట్ల భారం మోపనుంది. సగటున ప్రతి పౌరుని మీద ఏడాదికి రూ. 3,333 భారం పడనుంది.

> **టెండర్లు అయ్యాక రూ. 60 కోట్లు ఇచ్చి వాప్కోస్‌తో సర్వే చేయించామని చెబుతున్నారు. ఆ సర్వే రిపోర్టును ప్రజల ముందు పెట్టడానికి ఎందుకు భయపడుతున్నారు? పైపులు వేయాలని చెప్పి గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లన్నీ తవ్వి వాటిని బాగు చేయలేని స్థితికి చేర్చారు. కొత్త రోడ్లను వేయడానికి వందల కోట్ల రూపాయలు కావాలి.ఎవరి కోసం ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారు? కేవలం కాంట్రాక్టర్ల కోసం, వాళ్ళ కమిషన్‌ల కోసమేనా?**

సాంకేతికంగా ఈ ప్రాజెక్టు అసలు ఆచరణసాధ్యమైంది కాదు. ఎటువంటి సర్జ్ ఎనాలిసిస్ (ప్రెషర్ మెకానిజం) లేకుండా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఎత్తులు వొంపుల ఆధారంగా ప్రెషర్ మెకానిజం డిజైన్ చేయకపోతే పైపులు పగులుతాయి. దేవాదుల పైపులు ఏ విధంగా పగిలి నీరు వృథా అవుతుందో మనం చూస్తున్నాం. ఎక్కడ ఒక పైపు పగిలినా మొత్తం జిల్లా అంతటికీ తాగునీటి సరఫరా ఆగిపోతుంది.

డీపీఆర్ లేకుండా ప్రాజెక్టుకు రూ. 42,000 కోట్లు ఖర్చు అవుతుందని ఎలా తేల్చారు? కాంట్రాక్టర్లు సూచించారా? లేక ముఖ్యమంత్రి గాలిలో లెక్కలు కట్టారా? డీపీఆర్ లేకుండానే ఇంత పెద్ద ప్రాజెక్టుకు టెండర్లు పిలిచారు. ఇది చట్ట వ్యతిరేకమని ప్రభుత్వానికి తెలియదా? కోర్టులు దీనిని సుమోటోగా తీసుకొని విచారణ చేపడితే వాస్తవాలు బయటకి వస్తాయి. డీపీఆర్ లేకుండా హడావిడిగా టెండర్లు పిలవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. టెండర్లు అయ్యాక రూ. 60 కోట్లు ఇచ్చి వాప్కోస్‌తో సర్వే చేయించామని చెబుతున్నారు. ఆ సర్వే రిపోర్టును ప్రజల ముందు పెట్టడానికి ఎందుకు భయపడుతున్నారు? పైపులు వేయాలని చెప్పి గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లన్నీ తవ్వి వాటిని బాగు చేయలేని స్థితికి చేర్చారు. కొత్త రోడ్లను వేయడానికి వందల కోట్ల రూపాయలు కావాలి. గ్రామ పంచాయతీలకు ఇందులో భాగస్వామ్యం లేకపోవడంతో గ్రామ సర్పంచులు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో ఉన్న నీటి వ్యవస్థను ధ్వంసం చేస్తుండడంతో ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారు. ఇంకా ఎవరి కోసం ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారు? కేవలం కాంట్రాక్టర్ల కోసం, వాళ్ళ కమిషన్‌ల కోసమేనా?

గుజరాత్‌లో నీటి ఎద్దడి ఉన్న కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టును నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అన్ని సాంకేతిక జాగ్రత్తలతో మొదలుపెడితే దానిని విజయవంతంగా పూర్తి చేయడానికి పదేళ్లు పట్టింది. మరి టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రం మొత్తానికి నీటిని అందించే మిషన్ భగీరథను నాలుగేళ్లలో ఎలా పూర్తి చేయగలుగుతుంది? ఈ ప్రాజెక్టు చేపట్టడానికి అవసరమైన సిబ్బంది ప్రభుత్వం వద్ద లేదు. స్కాముల కోసం ఈ స్కీంను తెచ్చారు తప్ప ప్రభుత్వ చిత్తశుద్ధి ఎక్కడా కనపడటం లేదు. ■




# కేసీఆర్‌లో కంగారు షురూ

● ప్రవీణ్

ఎన్నికలకు మరో 20 నెలల వ్యవధి ఉన్నదనగానే తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఎన్నికల మూడ్‌లో కనిపిస్తున్నారు. సర్వేలన్నీ టిఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయంటూ వస్తున్న ముఖ్యమంత్రి మొదటిసారిగా రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై కొంత వ్యతిరేకత ఉందంటూ అంగీకరించారు. అంటే బలహీనవర్గాలలో పార్టీ, ప్రభుత్వం పట్ల విశ్వాసం సన్నగిల్లిన్నట్లు ఆయనే స్వయంగా ఒప్పుకున్నట్లు స్పష్టం అవుతోంది.

మొన్నటి వరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి శాసనసభా పక్ష సమావేశం ఏర్పాటు చేసి ఒకొక్క ఎమ్మెల్యేకి సర్వే నివేదిక ఇచ్చి, ఏయే లోపాలు సరిచేసుకోవాలో ఉపదేశిస్తూ ఉండేవారు. కానీ గతవారం జరిగిన సమావేశంలో సర్వే ప్రసక్తి ఏమీ తీసుకురాకుండా అందరినీ గెలిపించే బాధ్యత తనదే అని స్పష్టం చేశారు. పార్టీ వర్గాలలో భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నా మొదటిసారిగా ఆయన మాటలలో కొంత కంగారు కనిపిస్తోంది. మొన్నటి వరకు పనితీరు బాగాలేని వారికి తిరిగి టికెట్ ఇచ్చే ప్రసక్తి లేదని చెబుతూ వస్తున్న టీఆర్ఎస్ అధినేత మొదటిసారిగా సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ సీట్లు గ్యారెంటీ అంటూ హామీ ఇచ్చారు. మిగిలిన చోట కూడా చాలా వరకు అభ్యర్థుల ఎంపిక పూర్తైనట్లు కూడా చెప్పారు. అంటే ప్రస్తుత ఎమ్మెల్యేలలో అసంతృప్తి చెలరేగకుండా, వివిధ నియోజకవర్గాలలో సీట్లు ఇస్తామని హామీ ఇచ్చినవారు చేజారకుండా జాగ్రత్త పడుతున్నట్లు కనిపిస్తున్నది.

ఎమ్మెల్యేలను తిరిగి గెలిపించే బాధ్యత తనదే అని భరోసా కల్పిస్తున్నా వారిలో మాత్రం భవిష్యత్ పట్ల ఆందోళన వ్యక్తం అవుతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా నంద్యాల ఉపఎన్నిక ఫలితం తర్వాత కేసీఆర్ చూపుతున్న సర్వే నివేదికల పట్ల మొదటిసారిగా మంత్రులలో సైతం అనుమానాలు నెలకొంటున్నాయి. నెల రోజుల క్రితమే నంద్యాలలో వైసీపీ భారీ మెజారిటీతో గెలుపొందనున్నట్లు కేసీఆర్ చెప్పడం గమనార్హం. ఫలితం మాత్రం అందుకు పూర్తి భిన్నంగా వెలువడింది. ఎన్నికల భారం తనపై ఉంచి, అప్పటి వరకు ప్రజలలో ఉండమని చెప్పడం ద్వారా ఎలాగైనా జనాన్ని మంచి చేసుకోమని, లేకపోతే పార్టీ మనుగడ కష్టం అనే సంకేతం ఇచ్చారు. ముందుగా భూ సర్వే జరిగే నియోజకవర్గాల టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వచ్చే మూడు నెలల వరకు హైదరాబాద్‌కు రావొద్దని ఆదేశించారు. సెప్టెంబర్ 1 నుండి డిసెంబర్ నెలాఖరు వరకు జరిగే రైతు సమన్వయ సమితిల ఏర్పాటు, భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని వివరించారు.

వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి అవసరమైన భూమిక ఏర్పాటు చేసుకోవడానికి ఈ సమన్వయ సమితిలో అత్యంత కీలకమైనవని, ఎమ్మెల్యేలు అత్యంత శ్రద్ధతో నిర్వహించాలని ఈ సందర్భంగా కేసీఆర్ సూచించడం గమనార్హం. కాబట్టి ఈ కార్యక్రమం పూర్తయ్యేంత వరకు గ్రామాల్లోనే ఉండాలని, హైదరాబాద్‌కు రావొద్దని సూచించారు. అంటే గ్రామీణ ప్రజలకు పార్టీ దూరం అవుతున్నదని ఆయన ఆందోళన చెందుతున్నట్లు స్పష్టం అవుతున్నది. రాజకీయాలకు అతీతంగా గ్రామస్థాయి రైతు సమన్వయ సమితి సభ్యులను ఎంపిక చేయాలని సూచిస్తూనే ఈ కమిటీలను గ్రామస్థుల ఏకాభిప్రాయం ద్వారా కాకుండా ఎమ్మెల్యేలే నామినేట్ చేయాల్సి ఉంటుందని చెప్పడం గమనిస్తే పార్టీ కమిటీలుగా మారనున్నట్లు స్పష్టం అవుతున్నది. ఈ సర్వే ద్వారా గ్రామాలపై పట్టుపెంచుకొనే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తున్నది.

> **టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకులకు మంత్రి పదవులు హామీ ఇచ్చి ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదు. కొండా సురేఖ వంటి వారు ఈ విషయమై అసంతృప్తితో ఉన్నారు. అదే విధంగా టీడీపీ శాసనసభ పక్షనాయకుడిగా ఉన్న ఎర్రబెల్లి దయాకరరావు అధికార పక్షంలో చేరి ప్రేక్షక పాత్ర వహించాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత లభించని వారు తమ దారి తాము చూసుకోక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి.**

గ్రామాల్లో 15 మందితో గ్రామ రైతు సమన్వయ సమితి, 24 మంది చొప్పున మండల, జిల్లా రైతు సమితి, 42 మందితో రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితి ఏర్పాటు చేయాల్సి ఉంది. గ్రామీణ వ్యవసాయ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చేసేదని చెబుతున్న ఈ కార్యక్రమంలో పారదర్శకత లోపిస్తున్నది. అంతా అధికార పార్టీ వ్యవహారంలా కొనసాగుతున్నది. 2019 ఎన్నికల్లో కూడా టీఆర్ఎస్ విజయం ఖాయమని తన సర్వేలు స్పష్టం చేస్తున్నాయని అంటున్న కేసీఆర్ ఆయా సర్వేల ప్రాతిపదికను మాత్రం ప్రస్తావించడం లేదు. ఎవరు, ఏవిధంగా సర్వేలు చేశారో కూడా పార్టీ వర్గాలకు కూడా అర్థం కావడం లేదు.

గత మూడేళ్ళుగా ప్రతిపక్షాల నుండి భారీ సంఖ్యలో కేసీఆర్ వలసలను ప్రోత్సహించారు. వారికి కీలక పదవులు కూడా కట్టబెట్టారు. 21 మంది ఎమ్మెల్యేలను గెలుచుకున్న కాంగ్రెస్‌లో ఇప్పుడు 10 మంది కూడా లేరు. 15 మందిని గెలుచుకున్న టీడీపీలో ముగ్గురు మాత్రమే ఉన్నారు. చివరకు ఏకైక సీపీఐ శాసన సభ్యుడు కూడా అధికారపక్షంలో చేరారు. కేవలం బిజెపి నాయకులను మాత్రమే టచ్ చేయలేక పోయారు.

టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకులకు మంత్రి పదవులు హామీ ఇచ్చి ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదు. కొండా సురేఖ వంటి వారు ఈ విషయమై అసంతృప్తితో ఉన్నారు. అదే విధంగా టీడీపీ శాసనసభ పక్షనాయకుడిగా ఉన్న ఎర్రబెల్లి దయాకరరావు అధికార పక్షంలో చేరి ప్రేక్షక పాత్ర వహించాల్సి వస్తుందని వాపోతున్నారు. కనీసం సీఎంను కలిసే అవకాశాలు కూడా ఉండడం లేదు. ప్రజలలో ప్రభుత్వం, పార్టీ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు స్పష్టం అవడంతో పార్టీలో, ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత లభించని వారు తమ దారి తాము చూసుకోక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి. గత కొంతకాలంగా ఇతర పార్టీల నుండి టీఆర్ఎస్‌లోకి వలసలు ఆగిపోవడం గమనార్హం. రాబోయే రోజులలో టీఆర్ఎస్ నుండే ఇతర పార్టీలలోకి వలసలు ప్రారంభం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ■



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. – గాంధీ




# రణరంగంగా ప్రజాభిప్రాయ సేకరణ

• కృష్ణ చైతన్య

తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీటి సదుపాయం కల్పించడం ద్వారా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రదర్శిస్తున్న ఆసక్తి అభినందనీయమే. అయితే ప్రభుత్వం ఏ పనైనా చట్టప్రకారం చేయాలి. ప్రభుత్వ పథకాల కారణంగా నిర్వాసితులయ్యే అణగారిన వర్గాలు, పేదలు, బలహీన వర్గాల పట్ల ప్రత్యేక సానుభూతి చూపాలి. చట్ట ప్రకారం వారికి పునరావాసం కల్పించి, తగిన పరిహారం చెల్లించిన తరువాతనే అటువంటి పథకాలు చేపట్టాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

అయితే ప్రభుత్వమే చట్టాన్ని తుంగలో తొక్కి, అడ్డదిడ్డంగా పనులు చేస్తూ, అదేమని ప్రశ్నించిన న్యాయస్థానాలు, ప్రతిపక్షాలను ఆడిపోసుకోవడం నేడు రివాజుగా మారింది. చట్ట ప్రకారం నడుచుకోమని చెప్పడాన్ని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు అడ్డంకులు కల్పించడంగా చెప్తూ కేసీఆర్, ఆయన మంత్రులు, టీఆర్ఎస్ నాయకులు నిత్యం ఆడిపోసుకొంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆగస్టు చివర్లో జరిపిన ప్రజాభిప్రాయ సేకరణ ఒక తంతుగా జరిగింది. ప్రజల అభిప్రాయాలను వినే ప్రయత్నం చేయకుండా, అభ్యంతరాలు, అనుమానాలు వ్యక్తం చేసిన వారిపై అధికార పక్షానికి చెందినవారే దాడులకు దిగి, రణరంగాన్ని తలపించే విధంగా వ్యవహరించడం విస్మయం కలిగిస్తుంది.

సభాస్థలిలోనే ప్రశ్నలు లేవనెత్తిన వారిపై కుర్చీలతో దాడి చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి దాడికి పాల్పడిన వారిని కట్టడి చేయాల్సింది పోయి దాడికి గురైన వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడికి గురైన భూనిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు యుప్పట్ల శ్రీనివాస్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా రెండు గంటల పాటు యుద్ధ వాతావరణం నెలకొనడంతో పోలీసులు లాఠీఛార్జీకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు. కానీ దాడి చేసిన వారెవ్వరిని అదుపులోకి తీసుకొనే ప్రయత్నం చేయలేదు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు.

మొదట ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తోందని, దానికి అనుసంధానంగా పెద్దపల్లి జిల్లాలో మూడు చోట్ల పంపు హౌజ్‌లు, బ్యారేజ్‌ల నిర్మాణం చేపడుతుందని తెలిపారు. ఈ నిర్మాణ పనుల వల్ల వాటి కింద భూములు కోల్పోయే రైతులు, వాటి దగ్గరలో ఉండే

> **ప్రభుత్వం ఏర్పడే నాటికి అసంపూర్ణంగా ఉన్న ప్రాజెక్టులన్నీ రూ.33 వేల కోట్లతో పూర్తి చేసే అవకాశం ఉంది. అయితే రీడిజైన్ పేరుతో ప్రాజెక్ట్‌ల స్వరూపం మార్చి, కొత్త పేర్లు, కొత్త స్వరూపాలతో ఆయకట్టు ప్రాంతాన్ని పెంచుతున్నామంటూ మొత్తం రూ.1.50 లక్షల కోట్లకు పైగా వ్యయం కాగల ప్రాజెక్ట్‌లను చేపడుతున్నారు. వీటికి అవసరమైన ఆర్థిక వనరులను ఏ విధంగా సమకూర్చగలరో చెప్పడమే లేదు. రోజుకొక్క భారీ ప్రాజెక్ట్ పేరుతో ప్రజలను భ్రమల్లో ముంచెత్తడమే ప్రభుత్వం తీరుగా మారింది.**

ప్రజలకు తలత్తే పర్యావరణ సమస్యలు, కాలుష్యంపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నామని తెలిపారు. తొలుత కొందరు ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ కార్యకర్తలు తమ అభిప్రాయాలను తెలిపారు. అదే సమయంలో మంథని మండలం ఉప్పట్లకు చెందిన ప్రాజెక్టు ముంపు బాధితుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, బ్యారేజ్‌లు, పంపుహౌజ్‌ల నిర్మాణాల వల్ల రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అసహనంతో సీఎం జిందాబాద్ అని పెద్దపెట్టున నినాదాలు చేశారు. వేదికపై మాట్లాడుతున్న శ్రీనివాస్‌ను వెళ్లిపొమ్మని సూచించడంతో నిరసనగా అతను సభ వద్దనే బైఠాయించాడు. ఈ క్రమంలోనే సభలో ఉద్రిక్త వాతవరణం మొదలైంది. నిబంధనల ప్రకారం ప్రజాభిప్రాయ సేకరణ జరపడానికి నెల రోజుల ముందే కనీసం రెండు దిన పత్రికలలో ప్రభుత్వం ప్రకటన జారీ చేయాల్సి ఉంది. ముంపు గ్రామాలన్నింటిలో డప్పు వేయించి ప్రచారం చేయించాలి. కానీ అవేమీ చేయకుండా, గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాట్లు చేసి, రెండు రోజుల ముందే తెలిపారు. అదేమని అడిగితే ప్రజాప్రతినిధులకు చెప్పామని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణకు రెండు రోజుల ముందు ఒక ప్రముఖ దినపత్రిక రెండు పూర్తి పేజీలు ఈ ప్రాజెక్ట్ గురించి విస్తృతమైన వార్తలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ వాదనకు ప్రజలు తలవంచే విధంగా ముందస్తుగానే ఒక రకమైన వాతావరణం సృష్టించే ప్రయత్నం చేసింది. అయితే పర్యావరణ సమస్యలు, ముంపు ప్రాంత ప్రజల ఈతిబాధలు, వారి అభిప్రాయలు, అభ్యంతరాలను మాత్రం మరుగున పడేసే ప్రయత్నం చేయడం గమనార్హం. భారీ ప్రాజెక్టుల పేరులతో వీలైనంతగా అంచనాలు పెంచుతూ డిజైన్‌లను తయారు చేసి, కాంట్రాక్టులతో లాలూచి వ్యవహారం నడపడమే అభివృద్ధిగా ప్రజలకు చెప్పే ప్రయత్నం జరుగుతున్నది. ఆయా ప్రాజెక్టలతో ప్రయోజనం పొందాల్సిన ప్రజల ఆలోచనలు, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొనే సహనం ప్రభుత్వంలో కనిపించడం లేదు. ప్రభుత్వం ఏర్పడే నాటికి అసంపూర్ణంగా ఉన్న ప్రాజెక్టులన్నీ రూ.33 వేల కోట్లతో పూర్తి చేసే అవకాశం ఉంది. అయితే రీడిజైన్ పేరుతో ప్రాజెక్ట్‌ల స్వరూపం మార్చి, కొత్త పేర్లు, కొత్త స్వరూపాలతో ఆయకట్టు ప్రాంతాన్ని పెంచుతున్నామంటూ మొత్తం రూ.1.50 లక్షల కోట్లకు పైగా వ్యయం కాగల ప్రాజెక్ట్‌లను చేపడుతున్నారు. వీటికి అవసరమైన ఆర్థిక వనరులను ఏ విధంగా సమకూర్చగలరో చెప్పడమే లేదు. రోజుకొక్క భారీ ప్రాజెక్ట్ పేరుతో ప్రజలను భ్రమల్లో ముంచెత్తడమే ప్రభుత్వం తీరుగా మారింది. ■

విశ్లేషణ



# సొంత బలం పెంచుకోవడంపైనే బిజెపి దృష్టి

**తమిళనాడులో ఏఐడీఎంకే వర్గాల విలీనం, రాష్ట్రంలో బిజెపి అవకాశాలపై దాని ప్రభావం గురించి బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, తమిళనాడు వ్యవహారాల ఇంచార్జి పి.మురళీధర్ రావు ఓ ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు:**

**ప్ర: తమిళనాడు పరిణామాలను ఎలా చూస్తున్నారు?**

**జ:** తమిళనాడు, ఆ రాష్ట్ర ప్రజలకు సంబంధించినంత వరకు అన్నా డీఎంకేలోని రెండు వర్గాల విలీనంతో చాలావరకు అనిశ్చితి తొలగిపోయింది. అంటే కొంతమేరకు సుస్థిరత నెలకొంటుందని ప్రజలు భావిస్తున్నారు.

**ప్ర: దీనివల్ల బిజెపికి ఏమేరకు లాభం?**

**జ:** బిజెపి తన సొంత బలం పెంచుకోవడం మీద దృష్టి పెట్టింది. బలం పెంచుకోడానికి మేము ఇతరుల మీద ఆధారపడం. రాష్ట్ర, జాతీయ ప్రయోజనాల విషయంలో బిజెపి, అన్నా డీఎంకేల మధ్య కొంత గత కొన్ని సంవత్సరాలుగా చాలావరకు భావసారూప్యం ఉన్నమాట వాస్తవమే. ఇప్పుడు ఆ బంధాన్ని మరింత పటిష్ఠం చేసుకునే అవకాశాలు పెరిగాయి.

**ప్ర: అంటే సమైక్య అన్నా డీఎంకే ఎన్డీఏ భాగస్వామి అవుతుందని అనుకోవచ్చా?**

**జ:** అది ఏఐడీఎంకే, ప్రధాన మంత్రి మీద ఆధారపడి ఉంటుంది. ఇప్పుడే దానిపై నేనేమీ చెప్పలేను. ఆ పార్టీతో మా అనుబంధం మరింత పెరిగే అవకాశం ఉంది, ఎందుకంటే పార్లమెంటులో మా రెండు పార్టీల మధ్య సహకారం చాలాకాలంగా కొనసాగుతోంది.

**ప్ర: తమిళనాడు ప్రభుత్వానికి ముప్పేమీ లేదని మీరు భావిస్తున్నారా?**

**జ:** అధికారాన్ని నిలుపుకోవడం అనేది వారంతా కలిసి ఉండటం మీద ఆధారపడి ఉంటుంది. పార్టీ మనుగడ కూడా వారి ఐక్యత మీదే ఆధారపడి ఉంటుంది. ఎమ్జీఆర్ చనిపోయినప్పుడు జయలలిత పార్టీ పగ్గాలు చేపట్టిన తరువాత ఏఐడీఎంకే స్థానాన్ని డీఎంకే ఆక్రమించుకోలేక పోయింది.

**ప్ర: కానీ జయలలిత మృతి అనంతర పరిణామాలు ఏఐడీఎంకే భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని భావిస్తున్నారా?**

**జ:** ఒక పార్టీగా ఏఐడీఎంకే తన కార్యకర్తల ఆమోదం పొందాలి, ఆ పార్టీ ప్రభుత్వం ప్రజల మద్దతు సంపాదించాలి. బిజెపి నాయకుడిగా నేను చెప్పగలిగింది ఇదే. దాని పరిపాలనా తీరుపై ఇది ఆధారపడి ఉంటుంది. జయలలిత మరణం, ప్రజా జీవితం నుంచి దాదాపు కరుణానిధి కనుమరుగు కావడం వల్ల రాజకీయ శూన్యత ఏర్పడింది. దాన్ని భర్తీ చేయడానికి చాలామంది గట్టిగా ప్రయత్నిస్తారు.

**ప్ర: తమిళనాడులో బిజెపి భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?**

**జ:** బిజెపి బలంపెంచుకోవడంపై దృష్టి కేంద్రీకరించింది. కార్యకర్తల బలాన్ని పెంచు కోవడం, సమర్థమైన పాలనను అందించే, తమిళనాడు ప్రయోజనాలను కాపాడగల పార్టీగా ప్రజల ముందుకు వెళ్లేందుకు మేము పాటుపడుతున్నాం. కొన్ని పరిణామాలు ఇటీవల కాలంలో చోటుచేసుకున్నాయి. వాటిని మేము ఎలా సద్వినియోగం చేసుకోగలమో వేచి చూడాలి.


**–జనసందేశ్ ప్రతినిధి**



ఆగస్టు 24న మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని రాపల్లి నర్సింగపూర్ గ్రామీణ రోడ్లను బాగుచేయాలని బిజెపి అధ్వర్యంలో రోడ్లపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగదుల కృష్ణమూర్తి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి తిరుపతి, అశ్విన్ రెడ్డి, హరీష్, మల్లేష్, రాజనర్సు, వంశీ, నరేష్ తదితరులులు పాల్గొన్నారు.



ఈ భూమ్మీద జన్మచేత ఎవరూ అధికులు కారు. బహిరింద్రియ నిగ్రహం కలవారే ఇతరులకన్నా అధికులు, ఉత్తములు. – శ్రీ జ్యోతిరావు పూలే




# బ్రిక్స్ సదస్సులో మోదీ దౌత్య విజయం

చైనా గడ్డపై భారత్ భారీ దౌత్య విజయాన్ని సొంతం చేసుకుంది. చైనాలో జరుగుతున్న బ్రిక్స్ కూటమి సదస్సు ప్రకటనలో తొలిసారిగా పాకిస్థాన్‌కు చెందిన లష్కరేతోయిబా, జేఈఎం వంటి ఉగ్రవాద సంస్థల పేర్లను ప్రస్తావించారు. నేరుగా పాక్ పేరెత్తకున్నా.. ఆ దేశ ఉగ్రసంస్థల్ని ప్రస్తావించడం భారత్ విజయంగా నిపుణులు భావిస్తున్నారు. ఉగ్రవాద చర్యలకు పాల్పడే వారిని, నిర్వహించేవారిని, మద్దతు తెలిపేవారిని జవాబుదారీగా చేయాలని ఆ ప్రకటన స్పష్టం చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అండగా నిలిచిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, బ్రెజిల్ అధ్యక్షులు మైఖేల్ టెమెర్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జువూలు ఉగ్ర కార్యకలాపాల్ని గట్టిగా ఖండించారు. సమష్టిగా పోరాడాలని స్పష్టం చేశారు.

ఐదు దేశాల బ్రిక్స్ సదస్సు ఆఖరులో 43 పుటల 'షామన్ ప్రకటన'ను ఆమోదించారు. అఫ్గానిస్థాన్‌లో హింసకు వెంటనే చరమగీతం పలకాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తాలిబన్లు, ఐఎస్ఐఎస్, అల్‌ఖైదా, అనుబంధ సంస్థలైన ఈస్టర్న్ టర్కిస్థాన్ ఇస్లామిక్ మూవ్‌మెంట్(ఈటీఐఎం), ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఉజ్బెకిస్థాన్, హఖానీ నెట్‌వర్క్, లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్, తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్, హిజ్బుట్ తహ్రీర్‌ల కారణంగా ఈ ప్రాంతంలో పెచ్చరిల్లుతున్న హింస, భద్రత పరిస్థితిపై ప్రకటన ఆందోళన వ్యక్తం చేసింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం ప్రధాని మోదీ బ్రిక్స్ సదస్సులో ఉగ్రవాదం అంశాన్ని బలంగా లేవనెత్తారు. దీనికి ఇతర నేతలు మద్దతు పలికారు. ఈ మహమ్మారిపై పోరుకు కలిసి నడుస్తామన్నారు. ప్రకటనలో ఉగ్రవాదాన్ని 17 సార్లు ప్రస్తావించారు. ఉగ్రవాదంపై పోరుకు అన్నిదేశాలూ సమగ్ర విధానాన్ని అనుసరించాలని బ్రిక్స్ పిలుపునిచ్చింది. తమ భూభాగాల్లో ఉగ్రనెట్‌వర్క్‌లకు ఆర్థిక సహాయం అందకుండా నిరోధించడం అన్ని దేశాల బాధ్యత అని పేర్కొంది. ఉత్తరకొరియా చేపట్టిన అణు పరీక్షను ఖండించింది. బ్రెజిల్ ప్రతిపాదించిన 'బ్రిక్స్ ఇంటెలిజెన్స్ బ్యాంకు' ఏర్పాటు అంశాన్నీ ప్రస్తావించింది. తొలిసారిగా పాక్ ఉగ్రసంస్థల జాబితాను బ్రిక్స్ ప్రకటనలో నిర్దిష్టంగా పేర్కొనడం జరిగిందని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి ప్రీతిశరన్ పేర్కొన్నారు. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఐరాస భద్రతా మండలి సంస్కరణల అంశాన్నీ ప్రధాని బ్రిక్స్ వేదికపై లేవనెత్తారని తెలిపారు.

గోవాలో జరిగిన గత బ్రిక్స్ సదస్సులో పాక్ ఉగ్రసంస్థల పేర్లను ప్రకటనలో చేర్చేందుకు ఒప్పుకోని చైనా ఈసారి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కఠిన పదజాలం ఉపయోగించడంతో పాటు, వాటి పేర్లతో కూడిన ప్రకటన విడుదల చేయడంలో భాగస్వామిగా మారడం గమనార్హం. జైషేమొహమ్మద్ అధినేత మసూద్ అజర్‌ను ఐరాస ద్వారా ప్రపంచ ఉగ్రవాదిగా గుర్తించడంపై అడ్డుపడుతున్న చైనా.. ఈ విషయంలో భవిష్యత్తులో ఎలా ప్రతిస్పందిస్తుందనే అంశం ఆసక్తికరంగా మారింది. బ్రిక్స్ ప్రకటన విడుదల తర్వాత అజర్ విషయంలో చైనా వైఖరిపై ఎదురైన ప్రశ్నల్ని సున్నితంగా పరిహరించింది. ఉగ్రవాదంపై అంతర్జాతీయ పోరులో పాల్గొనే విషయంలో తమ వైఖరి సుస్థిరమనీ, సుదృఢమని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జెంగ్ షుయాంగ్ పేర్కొన్నారు. ఆయా ఉగ్రసంస్థల హింసాత్మక కార్యకలాపాలతో ఆందోళన వ్యక్తమైనందు వల్లే వాటిని బ్రిక్స్ ప్రకటనలో చేర్చినట్లు వివరించారు.

- ☞ పన్ను ఎగవేతపై పోరాడేందుకు సమాచార మార్పిడి చేసుకోవాలనీ, అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతిక సహాయం అందించాలని బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి. నిజమైన, ఆధునిక ప్రపంచ పన్ను వ్యవస్థకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశాయి. సదస్సులో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా నాలుగు ఒప్పందాలపై సంతకాలు చేశాయి.
- ☞ సంప్రదాయ వైద్యవిధానాల మార్పిడి, అంతర్జాతీయ వేదికలపై ఆరోగ్య రంగంలో సహకారాన్ని పెంపొందించుకోవాలనీ, అంతరిక్షాన్ని శాంతియుత అవసరాలకే ఉపయోగించుకోవాలనీ, ఐఎంఎఫ్ కోటా సంస్కరణల్ని 2019 చివరి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించాయి.

**–జనసందేశ్ ప్రతినిధి**

# ఓబీసీ ఉపవర్గీకరణ విప్లవాత్మక నిర్ణయం

• కిశోర్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత బీసీల అభ్యున్నతిపై దృష్టి సారించారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించేందుకు పూనుకొన్నారు. ఓబీసీల వర్గీకరణ చేపట్టడం విప్లవాత్మక నిర్ణయం. బీసీ కులాల్లో కొన్నింటికి కాకుండా అన్నింటికీ అభివృద్ధి ఫలాలు అందించడం దీని ప్రధాన లక్ష్యం. ఇందుకోసం వారిని గ్రూపులుగా వర్గీకరించాలనే అభిప్రాయానికి వచ్చారు. కేంద్రమంత్రివర్గ ఆమోదంతో దీనికి కార్యాచరణను ప్రకటించారు. ఇందుకోసం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేస్తారు. నియామకం అనంతరం 12 వారాల్లో ఈ కమిషన్ నివేదిక సమర్పించాలి. ఓబీసీల్లో రిజర్వేషన్ల ఫలాలు పొందుతున్నవారు, పొందనివారెవరో గుర్తించడం, కొత్తగా చేర్చాల్సిన కులాలను పరిశీలించడం వంటివి దీనిలో చేర్చారు.

దేశంలో 52 శాతానికి పైగాగల వెనుకబడిన కులాల వర్గీకరించాలని మోదీ ప్రభుత్వ నిర్ణయం దేశంలో సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎన్నో మార్పులకు వీలు కల్పించనుంది. 1990లో వీపీసింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను ఆమోదించటంతో కేంద్రంలో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. కానీ అందులో ఉపవర్గీకరణ లేదు. దీనికంటే ఎంతో ముందు నుంచే రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లు, అందులో ఓబీసీ ఉపవర్గీకరణ అమల్లో ఉంది. కేంద్రంలో ఇటువంటి అవకాశం లేని ఫలితంగా ఓబీసీల్లో ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న కులాల వారే అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఓబీసీ కులాలకు వర్తించే 27 శాతం రిజర్వేషన్లను వారిలోని 12 శాతం కులాల వారే పొందుతున్నారని, మిగిలిన కులాల వారు రిజర్వేషన్ల ద్వారా కలిగే లబ్ధికి దూరంగా ఉన్నారనేది ఓ అంచనా. కొన్ని ప్రభుత్వశాఖల్లో అయితే మొత్తం ఓబీసీ రిజర్వేషన్లను 6.67 శాతం ఓబీసీలే పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఓబీసీ రిజర్వేషన్లలో కేంద్ర స్థాయిలో ఉపవర్గీకరణ చేపట్టాలనే డిమాండ్లు మొదలయ్యాయి. కేంద్ర నిర్ణయంతో ఓబీసీల్లో అన్ని ఉప కులాలకు సమన్యాయం జరిగే అవకాశం ఉంది.

భారతదేశంలో సామాజిక పునాదులు చాలా బలమైనవి. వృత్తులు, ఎంచుకున్న రంగాలు, జీవన విధానాల ఆధారంగా సామాజిక వర్గాలు ఏర్పడ్డాయి. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ 8,000 కులాలు, 25 వేల ఉపకులాలున్నాయి. సామాజిక జీవనానికి అవి ప్రధాన ప్రాతిపదికలుగా మారాయి. పాలనవ్యవస్థను ప్రభావితం చేసే స్థాయికి చేరాయి. రాజకీయాలనూ శాసించగలుగుతున్నాయి. ఎన్నికల్లో సీట్ల పంపిణీకి కుల సమీకరణాలే కీలకమవుతున్నాయి. దేశంలో

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత బీసీల అభ్యున్నతిపై దృష్టి సారించారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించేందుకు పూనుకొన్నారు. ఓబీసీల వర్గీకరణ చేపట్టడం విప్లవాత్మక నిర్ణయం. బీసీ కులాల్లో కొన్నింటికి కాకుండా అన్నింటికీ అభివృద్ధి ఫలాలు అందించడం దీని ప్రధాన లక్ష్యం.

అన్ని వర్గాలకు అన్నింటా సమానావకాశాలు కల్పించాలనే సంకల్పంతో రిజర్వేషన్ల విధానాన్ని ప్రవేశపెట్టారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయి. దేశంలోని సామాజిక వ్యవస్థలో దళితులు, గిరిజనులు, ఇతర వెనకబడిన వర్గాలు, అగ్ర వర్ణాలుగా విభజన ఉంది. దళిత, గిరిజనులకు రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు ఉన్నాయి. వెనకబడిన తరగతుల్లోనూ పేదరికం, అసమానతలు వంటివి ఉన్నా, వాటిని మొదట్లో రిజర్వేషన్ల కోసం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో బీసీలు తమ వాటా కోసం దశాబ్దాల పాటు పోరాడారు. ప్రభుత్వం పలు బీసీ కమిషన్లు వేసినా, వాటి నివేదికలు అమలు కాలేదు. జనాభాపరంగా ఎక్కువ మంది ఉన్నప్పటికీ, వారి సంక్షేమం గురించి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 1990లో మండల్ కమిషన్ నివేదిక అమలుకోసం దేశవ్యాప్తంగా పెద్దయెత్తున ఉద్యమాలు జరిగాయి. దీంతో కేంద్రంలో కదలిక వచ్చింది. 1990లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రకటించింది. అయినా, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 6.9 శాతం, విద్యా సంస్థల్లో 8.2 శాతం రిజర్వేషన్లనే బీసీలు పొందారు.

## 8 లక్షలకు సంపన్న శ్రేణి

బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సంపన్నశ్రేణి వార్షిక ఆదాయ పరిమితిని మొదట్లో లక్ష రూపాయలుగా నిర్దేశించారు. ఆపై దాన్ని రెండు, నాలుగు లక్షల రూపాయలకు పెంచారు. రెండేళ్ల క్రితం ఆరు లక్షలు చేసిన కేంద్రం తాజాగా ఆ మొత్తాన్ని ఎనిమిది లక్షల రూపాయలకు హెచ్చించాలని నిర్ణయించింది. కేంద్రం వీటిని అమలుచేస్తుండటంతో అనేకమందికి నిబంధనలపై అవగాహన కొరవడుతోంది. దీనివల్ల అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉండిపోతున్నాయి. విద్యాసంస్థల్లో సీట్లకు బీసీలు లేరని 'స్పాట్ సెలక్షన్ల' ద్వారా ఇతర వర్గాలకు బదలాయిస్తున్నారు. సంపన్నశ్రేణి నిబంధనలు పేదలకు వరమైనా అది ఇన్నాళ్లూ సమర్థంగా అమలు కాలేదు.

## బీసీ కమిషన్‌కు చట్టబద్ధత

జాతీయ బీసీ కమిషన్ 1993లో ఏర్పాటైనా దానికి ఇప్పటివరకు చట్టబద్ధత దక్కలేదు. పూర్తిస్థాయి అధికారాలూ లేవు. ఎస్సీ, ఎస్టీ కమిషన్లు స్వయంప్రతిపత్తితో పనిచేస్తున్నాయి. ఇటీవల మోదీ ప్రభుత్వం బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. దీన్ని అన్ని వర్గాలూ స్వాగతించాయి. బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించినా రాజ్యసభలో కాంగ్రెస్ ఆటంకాలు సృష్టించింది. ప్రస్తుతం రాజ్యసభలో ఎన్‌డీఏ సర్కారుకు మెజారిటీ సభ్యుల మద్దతు ఉంది. దీనివల్ల బిల్లుకు ఆమోదం లభింపజేయడం లాంఛనప్రాయం.

కేంద్ర ప్రభుత్వం ఓబీసీల ఉపవర్గీకరణకు తీసుకున్న నిర్ణయాలకు ఆయా వర్గాల నుంచి సానుకూలత వ్యక్తమవుతోంది. స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడు దశాబ్దాల తరవాత ఓబీసీల అంశంపై విస్తృతస్థాయి చర్చకు ఇది దోహదపడుతుంది. అన్ని వర్గాలవారికీ సమాన న్యాయం కల్పించడానికి అవకాశం లభిస్తుంది. ■



నిరుత్సాహపడితే దైవం కూడా వ్యతిరేకిస్తుంది. – ఆచార్య చాణక్యుడు

# పట్టాలెక్కిన నదుల అనుసంధానం

గత యూపీఏ అటకెక్కించిన నదుల అనుసంధానం బృహత్ కార్యక్రమానికి మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రూ. 5.5 లక్షల కోట్ల వ్యయంతో చేపట్టే ఈ భారీ ప్రాజెక్టుపై త్వరలోనే కసరత్తు ప్రారంభం కానుంది. ఏటా వేల మంది ప్రాణాలను బలిగొంటూ పంటలకు నష్టం కలిగిస్తున్న వరదలు, కరవుకు ఇదే విరుగుడని మోదీ ప్రభుత్వం దేశంలోని పెద్ద నదులను అనుసంధానించేందుకు సిద్ధమ య్యింది.

దేశంలోని తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువ భాగం వరదలతో అతలాకుతలమవు తున్నాయి. ఇటీవలె భారత్‌లోని పలు ప్రాంతాలను, పొరుగునున్న బంగ్లాదేశ్, నేపాల్‌ను వరదలు ముంచెత్తాయి. అంతకుముందు రెండేళ్లు సరైన వర్షాలే లేవు. భారీ కుంభవృష్టితో ఇటీవల ముంబయి స్తంభించిపోయింది. అందుకు భిన్నంగా తమిళనాడులో కరవు తలెత్తడంతో తాగునీటి వినియోగంపై ఆంక్షలు విధించారు. నదుల అనుసంధానం ద్వారా ఈ సమస్యలను దూరం చేయవచ్చని ప్రధాని భావిస్తున్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టు కింద 60 నదులను అనుసంధానిస్తారు. ఎప్పుడూ నిండు కుండల్లా ఉండే గంగా, గోదావరి, మహానది వంటి నదులను నీటి లభ్యత తక్కువగా ఉండే నదులతో జోడిస్తారు. ఈ సంధాన ప్రక్రియ కోసం డ్యామ్‌లు, కాలువల నెట్‌వర్క్‌ను నిర్మిస్తారు. ఫలితంగా రైతులు.. అస్తవ్యస్త రుతుపవనాలపై ఆధారపడాల్సిన అగత్యం తప్పుతుందని ప్రభుత్వం అంచనావేస్తోంది. లక్షలాది హెక్టార్ల వ్యవసాయ భూములకు సాగునీటి వసతి కల్పించొచ్చని విశ్లేషిస్తోంది. ఇది సాకారమైతే వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి కూడా జరుగే అవకాశం ఉంది.

కెన్, బెత్వా నదులు ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల గుండా ప్రవహిస్తున్నాయి. 425 కిలోమీటర్ల కెన్ నది ఒక పులుల అభయారణ్యం గుండా ప్రవహిస్తోంది. ఈ అభయారణ్యంలో 6.5 శాతం అడవిని తొలగించి డ్యామ్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో 10 మారుమూల గ్రామాల నుంచి 2వేల కుటుంబాలను తరలిస్తారు. దీనికి పర్యావరణ, అటవీ పరిరక్షణ సహా దాదాపు అర డజను అనుమతులు లభించాయి. మరికొన్ని వారాల్లో దీనికి కేంద్ర క్యాబినెట్ తుది అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. అనంతరం మోదీ.. ఈ పనులను ప్రారంభిస్తారు. పార్–తాపిని నదులను నర్మదాతో, దమన్ గంగాను పింజాల్‌తో అనుసంధానించే ప్రాజెక్టులపై ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ ప్రాజెక్టులు గుజరాత్, పొరుగునున్న మహారాష్ట్రకు ఉద్దేశించినవి.

నదుల అనుసంధాన ప్రాజెక్టును 2002లో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వమే తొలుత ప్రతిపాదించింది. అయితే నీటి పంపకంపై రాష్ట్రాల మధ్య వివాదాలు రావడం, అధికారుల్లో అలసత్వం వంటి వాటి కారణంగా అనుమతుల ప్రక్రియలు నిలిచిపోయి, ప్రాజెక్టు అటకెక్కింది. అయితే దీనిని పట్టాలెక్కించేందుకు మోదీ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. సంప్రదింపుల ప్రక్రియ సాఫీగా సాగి, ప్రాజెక్టు వేగంగా సాకారం చేసేందుకు కసరత్తు చేస్తోంది.

–జనసందేశ్ ప్రతినిధి

## మోదీ చొరవ



నదుల అనుసంధానం ప్రాజెక్టులో మొదటి దశకు అనుమతుల కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా చొరవ తీసుకున్నారు. పర్యావరణవేత్తలు, జంతు ప్రేమికులు, మాజీ రాచ కుటుంబాలు వ్యతిరేకించినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. ఈ అనుమతులన్నీ రికార్డు సమయంలో వచ్చాయి. ప్రాజెక్టులో భాగంగా తొలుత ఉత్తర–మధ్య భారతదేశంలోని కెన్ నదిని.. పెద్దగా నీటి ప్రవాహంలేని బెత్వా నదికి అనుసంధానిస్తారు. ఇది.. ఇతర ప్రాజెక్టులకు నమూనాగా మారుతుందని మోదీ భావిస్తున్నారు.

## గమనిక

పాఠకుల సౌలభ్యం కోసం జనసందేశ్ పక్ష పత్రిక ఈ–మ్యాగజైన్ రూపంలోనూ అందుబాటులోకి వచ్చింది.
http://www.bjptelangana.org/
వెబ్‌సైట్‌లో లాగిన్ అయి జనసందేశ్(ఈ–బుక్) ట్యాబ్‌ను ప్రెస్ చేస్తే గత 10 సంచికలకు సంబంధించిన తేదీలు కనిపిస్తాయి. కావాల్సిన సంచికను ఎంచుకొని క్లిక్ చేస్తే ఈ–మ్యాగజైన్ తెరుచుకుంటుంది. అవసరమైతే పాఠకులు ఈ ఈ–మ్యాగజైన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తర్వాత కూడా చదువుకోచ్చు.

–ఎడిటర్



ఆగస్టు 29న బిజెపి స్పోర్ట్స్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిజెపి హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, సీనియర్ నాయకుడు నల్లు ఇంద్రసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# G.NARAYANAMMA INSTITUTE OF TECHNOLOGY & SCIENCE FOR WOMEN

Estd: 1997

SPONSORED BY G. PULLA REDDY CHARITIES TRUST, HYDERABAD
AFFILIATED TO J N T U H & APPROVED BY A. I. C. T. E
AN ISO 9001: 2008 CERTIFIED INSTITUTION AND ACCREDITED BY NAAC

**Shaikpet, Hyderabad – 500 104.**
**Ph: 23565648/49. Fax: 040 23564187**
**Website: www.gnits.ac.in, email: principal@gnits.ac.in**

## COURSES OFFERED

1. Electronics & Communication Engg.,
2. Computer Science & Engg.,
3. Electrical & Electronics Engg.,
4. Information Technology
5. Electronics & Telematics Engg.,
6. M.Tech in Power Electronics & Electric Drives
7. M.Tech in Computer Science & Engineering
8. M.Tech in Digital Electronics & Communication Systems
9. M.Tech in Computer Networks & Information Security
10. M.Tech in Wireless & Mobile Communications





## OTHER INSTITUTIONS RUN BY THE TRUST

1. G.Pulla Reddy Engineering College, Kurnool.
2. G.Pulla Reddy College of Pharmacy, Mehdipatnam, Hyderabad.
3. G.Pulla Reddy Degree & PG College, Mehdipatnam, Hyderabad.
4. G.Pulla Reddy Junior College, Abids, Hyderabad.
5. G.Pulla Reddy High School, Mehdipatnam, Hyderabad.
6. G.Pulla Reddy Memorial School, Dislukhnagar, Hyderabad.
7. G.Pulla Reddy Government Polytechnic, Kurnool
8. G.Narayanamma High School, Mehdipatnam, Hyderabad
9. G.Narayanamma Hospital, Gokavaram, Atmakuru Taluk, Kurnool
10. G.Narayanamma Pulla Reddy Respite Home for Mentally Retarded Women, Kurnool.
11. Vignana Peetham (Orphanage), Kurnool
12. Samskruta Basha Prachara Samithi, Nampally Station Road, Hyderabad.
13. G.Pulla Reddy Dental College & Hospital at Kurnool

**P.Subba Reddy**
**CHAIRMAN**

**G.Raghava Reddy**
**TREASURER**

**Dr.K. Ramesh Reddy**
**PRINCIPAL**




కిరీటాన్ని ధరించే శిరస్సు సుఖానికి దూరమవుతుంది. - షేక్స్పియర్


తెలంగాణ విమోచన యాత్ర
తెలంగాణ విమోచన యాత్ర